Lalithaa
లలితా జ్యువెల్లరి
మన విజయవాడలో

Estd 1938


# ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

Lalithaa
లలితా జ్యువెల్లరి
మన విజయవాడలో

సంపుటి: 64 • సంచిక: 9 • బుధవారం 23 జనవరి 2019 • విజయవాడ ❋ పేజీలు: 16 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



Lalithaa

## ప్రతి రూపాయి విలువే!

నాకు తెలిసినంతవరకు డబ్బు విషయంలో చిన్న మొత్తం, పెద్ద మొత్తం.. అంటూ ఏదీ లేదు. ప్రతి రూపాయి చాలా విలువైందే! ఎంతో ముఖ్యమైనది. నగలు కొనేటప్పుడు.. మన శ్రమకు తగ్గ పూర్తి ఫలితాన్ని ఆశ్వాదించాలంటే చాలా జాగ్రత్తగా దాన్ని ఖర్చుపెట్టాలి. పాత షోరూం, భారీ ఆఫర్లు వంటి కారణాలతో నగలు కొనేయడం సముచితం కాదు. సరైనరీతిలో లెక్కగట్టాలి!

గ్రాముకు రూ.50, రూ.100 తగ్గింపు, V.A.లో 50%, 20% రాయితి, పాతనగలు ఎక్స్ఛేంజ్ చేసుకునేటప్పుడు గ్రాముకు రూ.100 ఎక్కువ.. వంటి జిమ్మిక్కు ఆఫర్లను చూసి పక్కదోవ పట్టకండి. ఇలాంటి ఆఫర్లన్నీ ఎందుకు పండగలు, ప్రత్యేకమైన రోజుల్లో ఇస్తున్నారు?.. నిజంగానే మీ మంచి కోరుకునేవారైతే.. ప్రతిరోజూ ఇలాంటి ఆఫర్లను ఇవ్వొచ్చుగా. ఇంకోవిషయం.. కాస్త ధరలు తగ్గించమని మేనేజరు దగ్గరకు వెళితే.. V.A.లో 2% లేదా 3% తగ్గిస్తారు. ఒకవేళ.. అలా బేరమాడే శక్తి లేనివాళ్ల పరిస్థితి ఏంటి?... వాళ్లు మోసపోయినట్టేగా!.. అసలు కస్టమర్లను అలా ఎందుకు కన్ఫ్యూజ్ చేయాలి. అందుకే లలితా జ్యువెల్లరిలో మేం అలాంటివేం చేయం.

రాయితీలు, ఆఫర్లను మించి ఇచ్చే నగదుకు తగిన బంగారం లభిస్తోందా అని సరిచూసుకోవాలి. డబ్బు ఇచ్చేముందు ప్రతి రూపాయికి వివరణ అడగాలి. తద్వారా మీరు ఆదా చేసే నగదు వేలాది, లక్షలాదిలో ఉంటుంది!

మార్కెట్‌లోని ఉచితాలు, ఆఫర్లను చూసి పక్కదోవ పట్టకండి. దయచేసి మా వద్ద ఎస్టిమేట్‌స్లిప్, మొబైల్‌లో ఫొటోను తీసుకోండి. నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చిచూడండి.




నగల కొనుగోలుదారులకు డాక్టర్ కిరణ్‌కుమార్ సలహాలు!

లేటెస్ట్! TV ఇంటర్వ్యూ పార్ట్-2

Scan the QR code or visit youtu.be/sTnckoV55mQ

TV ఇంటర్వ్యూ పార్ట్-1 youtu.be/nfy34JdCEmY

ప్రపంచంలోనే అతిపెద్ద షోరూంలలో ఒకటి!




లలితా జ్యువెల్లరి మన విజయవాడలో
60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్,
సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటెరింగ్ కాలేజ్ ఎదురుగా.
ఫోన్: 0866-2481133 / 91332 98333 / 91332 98444.

త్వరలో రాజమండ్రిలో!

లక్షలాది డిజైన్లు! 100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్

## లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్



**వైజాగ్**
29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్,
ద్వారకా నగర్.
ఫోన్: 0891 - 6600001.




**తిరుపతి**
481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ,
మాస్క్‌రోడ్, (V.V. మహల్‌రోడ్)
ఫోన్: 0877 - 666 0505 / 0606 / 7888.




**హైదరాబాద్**
6-3-883, SBR సొక్,
రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా,
సోమాజిగూడ సర్కిల్.
ఫోన్: 040 - 6748 6677.

విజయవాడ • విశాఖపట్నం • తిరుపతి • హైదరాబాద్ • చెన్నై • తిరువళ్లూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి
కుంభకోణం • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు

www.lalithaajewellery.com



క్యారెట్ రూ.46,000 కన్నా అధికంగా ఇస్తున్నారంటే..

# మీరు తెలిసే మోసపోతున్నట్టు!



భారతదేశంలోనే తక్కువ ధరకు వజ్రాభరణాలు!

## క్యారెట్ రూ. 46000 నుంచి!

V.A. గ్రాముకు రూ.975 మాత్రమే

అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.

మా దగ్గర కొన్న వజ్రాభరణాలకు 100% ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌకర్యం మరియు 85% క్యాష్‌బాక్ సౌకర్యం. 100% Quality. E-F Colour Grade & VVS Clarity.

నాణ్యత తక్కువైన G-H కలర్‌గ్రేడ్ ఆభరణాలను మేం విక్రయించం.

## బంగారు ఆభరణాలు తయారీ ధరకే..!

లక్షలాది డిజైన్లు! 100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్




## వెండి వస్తువులు

కనువిందు చేసే సంప్రదాయ మరియు వినూత్నమైన వెండిసామగ్రి.

**మార్కెట్‌లో కంటే అతి తక్కువ ధరకు అందిస్తున్నాం!**



## నగలు కొనుగోలు పథకం

11 నెలల 'నగలు కొనుగోలు పథకం'!

**తొలి వాయిదా ఉచితం!**

**+**

**V.A. 50% ఉచితం!**

ఈ సువర్ణ అవకాశం అన్ని బంగారు నగలకు వర్తిస్తుంది!

రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500 చిన్న వాయిదాలు, రెండింతల ప్రయోజనం!

ప్రతినెలా నగల కొనుగోలు పథకంలో చెల్లిస్తున్నది డబ్బు కాదు.. అది మీ శ్రమ! అందుకు తగ్గ ఫలితాన్ని అందించాలన్నదే నా ఉద్దేశం!

కస్టమర్ GST చెల్లించాల్సి ఉంటుంది.

## నగల బుకింగ్ పథకం

One Time Payment !

**ఏ నగకూ 100% V.A. లేదు**

మొత్తం నగదును ఒకసారి చెల్లించి, తర్వాత.. V.A. లేకుండా నగలు కొనుగోలు చేసుకోండి.

**5 నెలల నుంచే ఫలితం!** 11 నెలల తర్వాత నగను కొనేటప్పుడు, 14% లేదా 16% వరకు V.A. ఉన్న నగ అయినప్పటికీ.. 1% V.A. కూడా చెల్లించనక్కర్లేదు.

మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ పథకంలో చేరొచ్చు.

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.


Lalithaa®©

**లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్**

విజయవాడ : 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటరింగ్ కాలేజ్ ఎదురుగా.
ఫోన్: 0866-2481133 / 91332 98333 / 91332 98444.

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.

తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్కోరోడ్, (v.v. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.

హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677. www.lalithaajewellery.com

చెన్నై • తిరువళ్లూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్


నగలు కొనడం ఎలా?..
అన్న విషయంపై
రూపొందించిన పుస్తకం మా షోరూంలో
ఉచితంగా లభ్యమవుతుంది.

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

ఆంధ్రప్రభ
Estd 1938
www.prabhanews.com
Journalism first!
సంపుటి: 64 • సంచిక: 9 • బుధవారం 23 జనవరి 2019 • విజయవాడ * పేజీలు: 14 • వెల: 5.00
•Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

# సంక్షేమ బాటలో బడ్జెట్లు

## అటు కేంద్రం... ఇటు రాష్ట్రాలు పోటాపోటీగా హామీలు

- ప్రభుత్వ ఖజానాలో సగం సొమ్ము సంక్షేమానికే
- కేంద్ర ఓటాన్ బడ్జెట్‌లో రాయితీల రంగరింపు
- సబ్సిడీలతో పాటు ఉచిత పథకాలకు మోడీ శ్రీకారం
- రాష్ట్రాలూ అదే బాటలో నిధుల కేటాయింపు




**(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

బడ్జెట్‌లు రూటు మార్చుకుంటున్నాయి. సంక్షేమ పథకాలతో నిండిపోనున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజాకర్షక పథకాలకే పెద్దపీటేస్తున్నాయి. మేలోగా లోక్‌సభ ఎన్నికలు జరగాల్సి ఉండడంతో ఈసారి కేంద్రం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతోంది. లోక్‌సభతో పాటే అసెంబ్లీలకు ఎన్నికలు జరగాల్సిన ఐదు రాష్ట్రాలతో పాటు ఇటీవల ఎన్నికలు ముగిసిన తెలంగాణ రాష్ట్రం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లనే ప్రతిపాదిస్తున్నాయి. ఇవన్నీ ప్రజాకర్షక పథకాల్ని రంగరించి బడ్జెట్‌లో ప్రకటించేందుకు సిద్ధమౌతున్నాయి. దశాబ్దం క్రితం నాటి పరిస్థితితో పోలిస్తే బడ్జెట్‌లలో ప్రాధాన్యతాంశాలు పూర్తిగా మారి పోయాయి. అప్పట్లో బడ్జెట్ వస్తోందంటే ప్రజల్లో ఉత్కంఠ వ్యక్తమయ్యేది. దేశ అవసరాల్ని ఏ విధంగా లెక్కిస్తారు.. వాటికి నిధుల్ని ఎలా సమీకరిస్తారు.. ప్రజలపై పన్నుల భారం ఏ మేరకు ఉంటుంది.. సబ్సిడీలు, రాయితీల ప్రయోజనాలు ఎంత వరకు కల్పిస్తారన్న ఆతృత కనిపించేది. ప్రతి బడ్జెట్‌లోనూ ప్రభుత్వం పన్నుల భారం పెంచి రాయితీల ప్రయోజనాల్ని ➪ 5వ పేజీలో...



# క్రికెట్ రారాజు

## విరాట్ విశ్వరూపం
## ప్రపంచ అవార్డుల హ్యాట్రిక్

### ఐసీసీ చరిత్రలో యుగపురుషుడు

**ప్రపంచ క్రికెట్ అవార్డుల్లో హ్యాట్రిక్ కొట్టిన ఒకే ఒక్కడు**

అతడో పరుగుల యంత్రం... అతడో బ్యాటింగ్ మంత్రం... అతడో గెలుపు తంత్రం...పొట్టి క్రికెట్‌లో ఉరికే ఉత్సాహం... వన్డేల్లో ఉరిమే మెరుపు... టెస్టు పరీక్షల్లో నెగ్గిన మేటి.. ఒకటేమిటి.. క్రికెట్‌లో పాఠాలన్నీ నేర్చిన ఘనాపాఠి... అన్ని ఫార్మాట్లలో ఆటను ఆరాధించిన ప్రేమికుడు.. అందుకే క్రికెట్ ప్రపంచం అతడి ప్రతిభకు దాసోహమైంది... అతడే... విరాట్ కోహ్లీ.. పదహారేళ్ల వయసులో క్రికెట్ మైదానంలో అడుగుపెట్టిన ఈ కుర్రాడు.. రెండేళ్ల తరువాత... 2008లో ఐసీసీ అండర్ -19 ప్రపంచకప్ జట్టులో ఆడి.. నాయకత్వం వహించి కప్ సాధించాడు. పందొమ్మిదేళ్ల వయసులో మొదలుపెట్టిన పరుగులవేట.. అప్రతిహతంగా కొనసాగిస్తున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో పదకొండు సంవత్సరాలుగా విరామమెరుగని విరాట్ విజయపరంపర కొనసాగుతూనే ఉంది. ఆ ప్రతిభాపాటవాలకు మురిసి ఇప్పుడు... ఐసీసీ అవార్డులు వరించాయి. తన ముప్పయ్యవ ఏట క్రికెట్ రారాజుగా.. సగర్వంగా విజయహాసం చేస్తున్న పరిచయమే అక్కరలేని చిచ్చరపిడుగు... కోహ్లీ. ఇప్పటివరకు 77 టెస్టులు, 219 అంతర్జాతీయ వన్డేలు, ఇంటా బయటా 315 టీ-20 మ్యాచ్‌లు ఆడిన విరాట్... పరుగుల యంత్రంగా మారిపోయాడు. టెస్టుల్లో 25 సెంచరీలతో 6613, వన్డేల్లో 39 శతకాలతో 10,385 పరుగులు, టీ-20లలో 4 సెంచరీలతో 9976 పరుగులు చేసిన కోహ్లీ... ఇప్పుడు మరో చరిత్ర సృష్టించాడు.. ఆటలో అతడేమిటో చెప్పిన మధురక్షణాలివి.. ఐసీసీ అవార్డుల్లో క్లీన్ స్వీప్ కొట్టేసిన మొనగాడు.. ఇంతవరకు క్రికెట్ చరిత్రలో ఎవరూ సాధించని హ్యాట్రిక్ అవార్డుల వీరుడు.. మన విరాటుడు.. ఇప్పుడు... ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్... ఐసీసీ వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ ... ఐసీసీ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్... ఇది తెలిసి బంతీ బ్యాటూ మురిసిపోతున్నాయి..



ఢిల్లీ విమానాశ్రయంలో దావోస్ వీడియో కాన్ఫరెన్స్ ప్రసంగానికి వెళుతున్న సీఎం చంద్రబాబు

# మా దగ్గర సేంద్రియ సాగే

- వ్యవసాయంలో అడ్డంకులు అధిగమిస్తున్నాం
- దావోస్ సమావేశంలో సీఎం చంద్రబాబు
- ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి వీడియో కాన్ఫరెన్స్
- కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీతో భేటీ
- ఈవీఎం వివాదంపై చర్చ... పొత్తులపై సమాలోచనలు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం ఢిల్లీలో సుడిగాలి పర్యటన చేపట్టారు. సాయంత్రం సుమారు గం. 4.30 సమయంలో ప్రత్యేక విమానంలో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న ఆయన, విమానాశ్రయం నుంచే వీడియో కాన్ఫరెన్సు ద్వారా దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో సమావేశమై పొత్తులు, ఇతర రాజకీయాంశాలపై చర్చించారు. ఆ తర్వాత అమరావతిలో నిర్మించిన నూతన హైకోర్టు భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు రావాల్సిందిగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ సహా పలువురు న్యాయమూర్తులను ఆహ్వానించారు. తొలుత విమానాశ్రయం నుంచి ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా దావోస్ సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు నాయుడు, సంక్షోభంలో పడిపోయిన వ్యవసాయానికి సేంద్రీయ సాగే పరిష్కారమని తెలిపారు. వాతావరణ మార్పులు, రసాయన ఎరువుల కారణంగా సాగు ఖర్చు పెరిగిపోవడంతో అంతర్జాతీయంగా వ్యవసాయం సంక్షోభంలో ➪ 4వ పేజీలో...

# ఆ సగం.. సందేహమే!




- న్యాయస్థానాల్లో నిలిచేనా?
- అగ్రవర్ణ పేదల కోటాలో వాటానా?
- ఏపీ కేబినెట్ నిర్ణయం అమలుపై అనేక ప్రశ్నలు
- కాపులకిది ఉపయోగపడే ప్రయోగం కాదని నిపుణుల అభిప్రాయం

**(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడ్డ కుటుంబాల కోసం కేంద్రం ఇటీవల ప్రకటించిన పదిశాతం రిజర్వేషన్లల్లో సగాన్ని రాష్ట్రంలో కాపులకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తీర్మానం అమలుపై సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఇది న్యాయస్థానాల్లో నిల్చే అవకాశం లేదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ పది శాతం రిజర్వేషన్‌ను అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడ్డ కులాలనుద్దేశించి కేంద్రం ప్రకటించింది. రిజర్వేషన్లకు సంబంధించిన పూర్తి అధికారం కేంద్ర ప్రభుత్వానిదే. రాజ్యాంగం ఈ విషయంలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రత్యేక అధికారం కల్పించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో కాపులు తమను వెనుకబడ్డ కులాలుగా గుర్తించమంటూ డిమాండ్ చేస్తున్నారు. అంతేతప్ప అగ్రకులాల్లోని



పేదల కోసం ప్రతిపాదించిన రిజర్వేషన్ల కోటాలో భాగస్వామ్యాన్ని కోరడం లేదు. భారత రాజ్యాంగ ప్రకారం వెనుకబడ్డ వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలి. వెనుకబాటుతనం వేరు, పేదరికం వేరు. ఇదే రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ళ క్రితం కాపుల్ని వెనుకబడ్డ తరగతులుగా గుర్తిస్తున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేసింది. అయితే ఈ తీర్మానం కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి నోచుకోలేదు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో కాపులు వెనుకబడ్డ కులాలకు చెందిన వారా లేక అగ్రకులాల్లోని పేదలా అన్నది స్పష్టం కాని పరిస్థితి ఏర్పడింది. 2017లో కాపుల్ని బీసీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాలన్నీ తప్పు బట్టాయి. దీనికి వ్యతిరేకంగా గళమెత్తాయి. ఉద్యమాలు కూడా ➪ 5వ పేజీలో...



# అగ్రవర్ణాల మధ్య బాబు చిచ్చు

- ఈబీసీ రిజర్వేషన్ల కోత తగదు
- బీజేపీ సారథి కన్నా ధ్వజం

**అమరావతి, ఆంధ్రప్రభ:** అధికారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అగ్రకులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోడీ ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్ తీసుకొస్తే తన స్వార్థం కోసం చంద్రబాబు నాయుడు మరోసారి అగ్రకులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ఐదు శాతం రిజర్వేషన్లకు కోత విధించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. భారతీయ జనతా పార్టీ యువమోర్చా పదాధికారుల సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కన్నా మాట్లాడుతూ గతంలో మాల, మాదిగలు, కాపులు, బీసీల మధ్య గొడవలు పెట్టిన చరిత్ర చంద్రబాబు నాయుడుదన్నారు. అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు నాయుడు ఎంత నీచానికైనా దిగజారేందుకు వెనుకాడరని ఆయన పేర్కొన్నారు. కాపులకు రిజర్వేషన్ ఎరగా చూపి కమిటీల పేరిట ➪ 4వ పేజీలో...



# జగన్‌తో మేడా భేటీ

- 31న రాజంపేటలో వైసీపీలో చేరిక
- మేడాపై సస్పెన్షన్ వేటు
- కార్యకర్తలను ధిక్కరిస్తే ఇదే జవాబని చంద్రబాబు హెచ్చరిక 4

# పోటీ ప్రపంచంలో నవ్యాంధ్ర టాప్!

9లో

- వాణిజ్య గమ్యస్థానంలో అగ్రగామి
- గ్లోబల్ కాంపిటేటీవ్ ఫైయర్‌ను విడుదల చేసిన సీఎం చంద్రబాబు




# ఏపీలో మెడికల్ ఎలక్ట్రానిక్స్ సెంటర్

- త్వరలో నిర్ణయం తీసుకుంటామన్న నాస్కామ్ ఛైర్మన్
- దావోస్‌లో మంత్రి లోకేష్‌తో భేటీ 5లో




# మన ఈవీఎంలు దుర్భేద్యం

- ట్యాంపరింగ్ అసాధ్యం
- క్యాలిక్యులేటర్ లాంటి వ్యవస్థే ఈవీఎంలోనూ ఉంటుంది
- గతంలోనూ ఇలాంటి వివాదాలు లేవనెత్తారు




**న్యూఢిల్లీ:** మన ఈవీఎమ్‌లను ఎవరైనా హ్యాక్ చేస్తారా? ఇదే ఇప్పుడు దేశంలో వేడివాడీగా చర్చ జరుగుతోంది. దీనిపై వివిధ పార్టీలు, నాయకులు రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో మాజీ ఎన్నికల సంఘం ప్రధాన అధికారి నవీన్ చావ్లాతో ఆంధ్రప్రభ-ఇండియా ఎహెడ్ ఛానల్ సంయుక్తంగా చేసిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర అంశాలను వెల్లడించారు. లండన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో షుజ అనే సైబర్ నిపుణుడు ఈవీఎమ్‌లను హ్యాక్ చేయొచ్చని, 2014లో ➪ 4వ పేజీలో...

ఆంధ్రప్రభ- ఇండియా ఎహెడ్ ఇంటర్వ్యూలో మాజీ సీఈసీ నవీన్ చావ్లా

ఆంధ్రప్రభ






## ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: బహుళ విదియ ఉ.6.55 వరకు, అనంతరం తదియ తె.4.35 వరకు; నక్షత్రం: మఖ రా.1.33 వరకు, అనంతరం పుబ్బ అమృతకాలం: రా.11.10 నుండి 12.40 వరకు; వర్జ్యం: మ.2.04 నుండి 3.33 వరకు; దుం ్మహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

# రైతుల కళ్లల్లో ఆనందమే నా ఆకాంక్ష

●దేశంలో నదుల అనుసంధానానికి మనమే శ్రీకారం ●అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం ●ప్రజావసరాలు తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం ●ప్రజాబలంతోనే ప్రగతి సాధిస్తాం ●ఉండవల్లి నుంచి చిత్తూరు జిల్లా రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీడియో కాన్ఫరెన్స్

**తిరుపతి, ప్రభన్యూస్:** శ్రీశైలం జలాలను జిల్లాకు తరలించడంలో భగీరథుడి వలే తాను శ్రమించానని, ప్రజల కళ్లల్లో ఆనందం చూడటమే తన ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మొదటిసారిగా హంద్రీ-నీవా జలాలు చిత్తూరు జిల్లా నేలను తాకిన సందర్భంగా జలహారతి కార్యక్రమం మంగళవారం పీటీఎం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సభలో పాల్గొన్న రైతులనుద్దేశించి ప్రత్యేకంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ 1989లో నందమూరి తారకరామారావు చిత్తూరు జిల్లా ప్రజలకు నీవా నది ద్వారా నీరు అందించాలన్న సంకల్పంతో శంకుస్థాపన చేశారని, దేశ చరిత్రలోనే నదులను అనుసంధానం చేసి ప్రగతి బాటలో పయనించిన రాష్ట్రం ఒక్క ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. పట్టిసీమతో గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు అందించామని, శ్రీశైలం, కృష్ణా డెల్టా ప్రాంతంకు హక్కువున్న నీటిని రాయలసీమ జిల్లాలకు నేడు అందించగలిగామని పేర్కొన్నారు.

కేంద్రం రాష్ట్రానికి సరైన నిధులు ఇచ్చివుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో వున్న ప్రాజెక్టులన్నిటినీ ఈ పాటికి పూర్తి చేసేవారమని, కేంద్రం కనికరించనప్పటికీ తన శాయశక్తులా ప్ర జల ఆశీస్సులతో అన్నివర్గాల ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించాలన్న నేపథ్యంలో బృహత్ ప్రాజెక్టులను చేపట్టామని చంద్రబాబునాయుడు పేర్కొ న్నారు. పోలవరానికి కేంద్రం అధికారం చేపట్టిన వెంటనే నిధులు మంజూరు చేసివుంటే ఈ పాటికి ఆ ప్రాజెక్టును పూర్తి చేసేవారమేమోనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాలు కరవు జిల్లాలని, ఈ జిల్లాపై కూడా బీజేపీ ప్రభుత్వం కనికరించలేదని, తానే నడుం బిగించి ఈ ప్రాంతాల్లో కరవును పారదోలేందుకు ఓ పక్క రైతుకు ఉపయోగ పడే కార్యక్రమాలు, మరోవైపు ప్రజలకు ఉపాధి పెంపొందించడంలో, నిరుద్యోగులకు పారిశ్రామిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ, ఉపాధి, కార్యక్రమాలను ముమ్మరంగా అమలు చేసినట్లు చంద్రబాబు పేర్కొన్నారు. జిల్లాలో ఈ రెండు నదులేకాక 5 నదులు అనుసంధానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తమ ముఖ్య లక్ష్యమని, రైతుల కళ్లల్లో ఆనందం నింపడమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందన్నారు. ఇది ఒక భగీరథ ప్రయత్నమని, ప్రయత్నం చేస్తే ఫలితాలు సాధింపవచ్చనేదానికి హంద్రీ-నీవా పథకమే ఓ ఉదాహరణ అని రైతులనుద్దేశించి పేర్కొన్నారు.

తాను 2014లో పీటీఎం కాలువపక్కనే నిద్రించానని, ఆనాడు ఈ ప్రాంతంలో జలకళ లేక తాను బాధపడ్డానని, నేడు తన చిరకాల వాంఛ తీరిందని, కృష్ణమ్మతల్లి చిత్తూరు జిల్లా నేలను తాకించి ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం ఆవేశంగా మాట్లాడుతూ మీ శక్తినిబట్టి జలహారతులివ్వండి, కృష్ణమ్మను పూజించండి, ఆ తల్లికి ఘన స్వాగతం పలకండి... త్వరలో పశ్చిమ, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లా మాదిరిగా చిత్తూరు జిల్లాలోను నిరంతరం పంటలు పండే రోజు రానున్నాయని, రైతులందరూ సుఖ సంతోషాలతో ఉండే సమయం ఆసన్నమైందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాన కాలువకు 10 అనుసంధాన కాలువలు ఏర్పాటు చేశామని, తంబళ్లపల్లి, మదనపల్లి, పుంగనూరు, పీలేరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాలకు నీరందనున్నాయని పేర్కొన్నారు. అంతేకాక కర్నూలు, కడప అనంతపురం జిల్లాలకు ఉన్న రిజర్వాయర్లు చిత్తూరు జిల్లాలో లేవని, గండికోటనుండి 2600 కోట్లతో తాగునీరందించే ప్రాజెక్టుకు సోమవారం అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించామని, అందుకు అనుగుణంగా త్వరలో ఈ ప్రాజెక్టుకు టెండర్లు పిలవనున్నామని రైతులకు వివరించారు.

గతంలో ధవళేశ్వరం ఆనకట్ట కట్టి కాటన్ దొర రైతు గుండెల్లో నేటికీ చిరస్థాయిగా నిలిచిపోయారని, నేడు మనమిక్కడ పెద్దల పండగ చేసుకుంటే అక్కడవారు కాటన్ దొరను ప్రతిఇంటిలో ఆయన ఫోటోను పెట్టుకోని మరి పూజిస్తున్నారని చంద్ర బాబు పేర్కొన్నారు. కరవు జిల్లాకు నీరుతెచ్చి మీఅందరి రుణం తీర్చుకునే భాగ్యం తనకు కలిగిందని ఆనందంగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన ఆనందాన్ని పంచుకున్నారు. గోదావరి నుండి 2500 టిఎంసిలు సముద్రంలో నీరు వృధాగా కలుస్తున్నాయని, అందులో 500 టిఎంసిలు మన రాష్ట్రం సద్వినియోగ పర్చుకోగలిగితే సస్యశ్యామలం అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. అదేవిధంగా తాను రాష్ట్ర ప్రజలకోసం కష్టించి పనిచేస్తున్నానని, పేదలకోసం 200 పింఛన్లు, 2వేలకు చేశానని, డ్వాక్రా మహిళలకు అండగా వుంటూ 10 వేలు పసుపుకుంకుమ ఇచ్చానని, మరో పదివేలు త్వరలో అందిస్తానని, కేంద్రం బ్యాంకులు తనతో సహకరించలేదని, వారు సరిగా సహక రించి వుంటే రాష్ట్రంలో 24 వేల కోట్ల రుణమాఫీ గతంలో చేశామని, పెండింగ్‌లో వున్న నాలుగైదు విడతలు రానున్న ఫిబ్రవరి మాసంలో అందించనున్నామని సిఎం తెలిపారు. పేదవారికోసం 80 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ నెల 29న మదనపల్లి రానున్న కృష్ణా జలాల హారతి కార్యక్రమంలో తాను పాల్గొంటానని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. హంద్రీ-నీవా నీళ్లు నేడు జిల్లాలో రావడానికి ఎందరో శ్రమించారని, వారందరికీ తాను ధన్యవాదాలు తెలుపు తున్నానని, తనపై కొందరు కాంట్రాక్టర్లు కోపగించుకున్నా ఇంజనీర్లు శ్రమించినా గత జిల్లా కలెక్టర్ సిద్ధార్థజైన్‌కు ఈ పథకంలో శ్రమించారని, ప్రస్తుత కలెక్టర్ ప్రద్యుమ్న పట్టుదలతో ఆయన కృషి ఫలితంగా నేడు హంద్రీనీవా జలాలు త్వరితగతిన జిల్లాకు చేరాయనడంలో ఏమాత్రం అనుమానం లేదన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి అమరనాథ్‌రెడ్డి, జలవనరుల శాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తంబళ్లపల్లి ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీలు రాజసింహులు, గౌనివారి శ్రీనివాసులు, జిల్లాపరిషత్ ఛైర్ పర్సన్ గీర్వాణి, జెసి గిరీషా, జెసి-2 చంద్రమౌళి, మదనపల్లి సబ్ కలెక్టర్ కీర్తి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

### రూ.12 వేల కోట్లతో హంద్రీ-నీవా తెచ్చాం

రూ.12 వేల కోట్లు వెచ్చించి 55 లిఫ్టులను ఏర్పాటు చేసి 565 కిలోమీటర్లనుండి జిల్లాకు ప్రజల సంక్షేమం కోసం రైతుల బాగోగుల కోసం తెప్పించడం జరిగిందన్నారు. ఇందులో ఏమాత్రం రాజకీయాలు లేవని, కొందరు పని గట్టుకుని ఈ జలాలను రాజకీయం చేయాలని చూస్తే ప్రజలే వారికి బుద్ధి చెబుతారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల నుద్దేశించి పేర్కొన్నారు.

### బిందు సేద్యంతో 90 శాతం సబ్సిడీ

రైతులు వాతావరణానికి అనుకూలంగా పంటలు పండించాలని, ప్రస్తుతం నీరువుంది కదా అని వరిపై ఆసక్తి చూపడంకంటే పండ్లతోటలు, కూరగాయలు, పూలు సాగుచేస్తే నీళ్లు ఆదా అవుతాయని, ఒక ఎకరా వరికి వాడే నీళ్లు మూడు ఎకరాల పండ్లతోటకు వాడవచ్చని, బిందు సేద్యం ద్వారా 90 శాతం సబ్సిడీ రైతులకు అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



సభలోని వారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన ఆనందాన్ని అమరావతి నుంచి పంచుకుంటున్న సీఎం చంద్రబాబునాయుడు

# అమరావతిపై దావోస్ నిపుణుల ఆసక్తి

●సుస్థిర భవిష్యత్‌పై సీఆర్డీయే కమిషనర్ శ్రీధర్ ప్రసంగం

**అమరావతి, ఆంధ్రప్రభ :** దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో పలువురు ప్రతినిధులు అమరావతి ప్రగతి ప్రణాళికలపై ఆసక్తి కనబరచారు. ఈ సందర్భంగా సుస్థిర భవిష్యత్‌కు నగరాలు, సమూహాలను సిద్ధం చేయడంలో నగరీకరణ ఎదుర్కొనే సవాళ్లు అనే అంశంపై డ్యూచ్ బ్యాంక్ నిర్వహించిన సదస్సులో ఏపీసీఆర్డీయే కమిషనర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం పాల్గొన్నారు. సుస్థిర భవిష్యత్‌కు సంబంధించిన అంశాలపై ప్రపంచ ఆర్థిక సదస్సు పబ్లిక్ ప్రైవేటు రంగాలకు చెందిన అత్యున్నత అధికారుల సమావేశాన్ని నిర్వహించింది. గ్లోబలైజేషన్ 4.0ను ఈ ఏడాది థీమ్‌గా ఫోరమ్ ప్రకటించింది. 21వ శతాబ్దం నగరీకరణ శతాబ్దం. పౌరుల సుస్థిరత, సుఖ జీవనం వంటి అంశాలు ప్రపంచ ప్రాధాన్యత అంశాలు. ముఖ్యంగా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు చేపట్టాల్సినవి. ఈ సమావేశాన్ని ఆల్ఫ్రెడ్ హ్యార్‌హసన్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అన్నా హెర్రహ్యాసన్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అర్బన్ సిటీస్ ప్రొఫెసర్ రికిబుర్ డెట్‌లు ప్రారం భించారు. అమరావతిలో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు ఉన్న సంబంధాన్ని గుర్తు చేస్తూ నగరీకరణలో ప్రస్తుత ధోరణుల నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ ప్రాధాన్యతపై చర్చించడం జరిగింది. పట్టణ మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక వనరుల సమీకరణలో ఉన్న సవాళ్లను చర్చించిన పానెల్, తక్కువ ఖర్చు, దీర్ఘకాల ఫండింగ్ ఆప్షన్స్ అవసరాన్ని నొక్కి చెప్పింది.

ఈ సదస్సులో అమరావతి అభివృద్ధి నమూనా, భూసమీకరణ పథకం, మాస్టర్ ప్లాన్, రూపొందించిన పాలనా విధానాలు వంటి అంశాలపై చర్చించడం జరిగింది. ఆర్కాడిస్ సంస్థ డైరెక్టర్ గెహార్ల్స్, హెలో సంస్థ ఫౌండర్ జాన్ ఎడ్జ్ లను డాక్టర్ శ్రీధర్ కలసి అమరావతిలో డేటా వేర్ హౌసింగ్‌పై చర్చించారు.

# మా దగ్గర సేంద్రియ సాగే



చేందుకు ముందుకొచ్చే సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటామని ఆహ్వానం పలికారు. అలాగే సేంద్రీయ ఉత్పత్తుల కారణంగా ఆరోగ్యంపై పడే సానుకూల ప్రభావం, వాతావరణ మార్పులపై అధ్యయనం చేసే సంస్థల కోసం కూడా తాము ఎదురుచూస్తున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో ఏపీతో కలిసి పనిచేసేందుకు పలు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి కనబర్చాయి. ఇండోనేషియా మంత్రి లుహూత్ ఏపీ అనుసరిస్తున్న సేంద్రియ సాగు విధానాన్ని తమ దేశంలోనూ అనుసరిస్తామని చెప్పారు. గ్రీన్ క్లైమేట్ ఫండ్ సంస్థ సాంకేతిక సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. డబ్ల్యూ.డబ్ల్యూ.ఎఫ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రెసిడెంట్ పవన్ సుఖ్‌దేవ్ ఏపీ ప్రభుత్వానికి నేల స్వభావం, వాతావరణం అంశాలపై సహకరించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే ఐసీఆర్ఏఎఫ్ (వరల్డ్ ఆగ్రోఫారెస్ట్రీ సెంటర్) శాస్త్రీయ సహాయం అందించేందుకు ముందుకు రాగా, ఇంటర్నేషనల్ నైట్రోజన్ ఇనీషియేటివ్ ఛైర్మన్ మార్క్ సుట్టన్ గ్లోబల్ క్లైమేట్ రీసెర్చ్ ఫండ్ దక్షిణాసియా హబ్ ఏర్పాటు కోసం 20 మిలియన్ అమెరికా డాలర్లు కేటాయిస్తామని తెలిపారు. సేంద్రీయ విధానంలో భాగస్వామిగా ఉన్న బీఎస్పీ పరిబాస్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక సహాయం అందించేందుక ు ముందుకొచ్చింది.

సేంద్రియ సాగుపై పరిశోధన కోసం అమరావతిలో గ్లోబల్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సంస్థ సేంద్రీయ సాగుపై సమాచారం, అధ్యయనం, సరికొత్త సేంద్రీయ విధానాలపై పరిశోధనలు చేస్తుందని, సరికొత్త ఆవిష్కరణలతో సేంద్రీయ సాగును మరింత అధునాతనంగా తీర్చిదిద్దడంలో ఉపయోగపడుతుందని తెలిపారు.

(మూడో పేజీ తరువాయి)

పడిపోయిందని అన్నారు. దీనికి శాశ్వత పరిష్కారంగా జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (ఖర్చు లేని సేంద్రీయ సాగు పద్ధతి)ని తమ రాష్ట్రం అంతటా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సహజసిద్ధ సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తున్న రైతుల సంఖ్య 27 లక్షలుగా ఉందని, ఇది మొత్తం వ్యవసాయంతో పోల్చి చూస్తే కేవలం 0.5 శాతం మాత్రమేనని చంద్రబాబు నాయుడు అన్నారు. గత 2 దశాబ్దాలుగా సేంద్రీయ సాగు పద్ధతులు అవలంబించే రైతుల సంఖ్యలో పురోగతి చాలా నెమ్మదిగా జరుగుతోందని, ఇందుకు కారణాలను విశ్లేషిస్తే.. రైతులు రసాయన ఎరువులకు అలవాటుపడిపోవడం, ప్రభుత్వం, సమాజం నుంచి తగినంతగా మద్దతు లభించకపోవడం, అలాగే ఈ విధానంపై సరైన అవగాహన లోపించడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రం ఈ అడ్డంకులు, అవరోధాలను అధిగమించిందని, కేవలం మూడేళ్లలోనే సేంద్రీయ వ్యవసాయ విధానం వాటాను మొత్తం వ్యవసాయంలో 8 శాతానికి పెంచగల్గిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5 లక్షల మంది రైతులు సేంద్రీయ సాగు చేస్తున్నారని ఈ తరహా వ్యవసాయం చేస్తున్నారన్నారు. 2024 నాటికి మొత్తం రైతులందరినీ సహజ సిద్ధ వ్యవసాయ విధానం వైపు మళ్లించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. డా. సుభాష్ పాలేకర్ నేతత్వంలో ఈ మేరకు అవగాహన, శిక్షణా కార్యక్రమాలు, ప్రభుత్వ చిత్తశుద్ధి, 5,600 మంది అనుభవజ్ఞులైన రైతులు, 1,06,991 స్వయం సహాయక బృందాలు ఆంధ్రప్రదేశ్ జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కి మూలస్తంభాలుగా నిలిచి లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చంద్రబాబు నాయుడు అన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికి 5 లక్షల మంది ఈ విధానంలో సాగు చేస్తున్నారని, వచ్చే ఏడాదికి ఈ సంఖ్యను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తమతో కలిసి పనిచేస్తున్న, సహాయం అందిస్తున్న ఆ I, UNEP, SIFF, FAO, IDH, ICRAF, CIRADతదితర సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మరికొన్ని అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్య ఒప్పందాలు చేసుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. ముఖ్యంగా ఆర్థిక వనరులు సమకూర్చడం, సేంద్రియ సహజసిద్ధ వ్యవసాయ విధానాలకు శాస్త్రీయ, సాంకేతిక సహాయం అందించడం, ఉత్పత్తులను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో మార్కెట్‌కు చేరవేయడం, అమరావతిలో గ్లోబల్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేసే విషయంలో సహకరిం

### రాహుల్ గాంధీతో భేటీ... ఈవీఎం వివాదంపై చర్చ

దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్న సీఎం చంద్రబాబు, ఆ తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. సుమారు అరగంట పాటు సాగిన ఈ సమావేశంలో తాజాగా వివాదాస్పదమైన ఈవీఎం ట్యాంపరింగ్ అంశం, దీనిపై బీజేపీయేతర పార్టీలు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్టు తెలుస్తోంది. అలాగే రానున్న సార్వత్రిక ఎన్నికలు, వాటితోపాటు జరిగే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తులు, సీట్ల సర్దుబాటు అంశంపై కూడా చర్చించినట్టు తెలుస్తోంది.

### న్యాయమూర్తులకు ఆహ్వానం

త్వరలో అమరావతిలో ప్రారంభించనున్న తాత్కాలిక హైకోర్టు భవన సముదాయాన్ని ప్రారంభించేందుకు రావాల్సిందిగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ను సీఎం ఆహ్వానించారు. ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానం పలికిన సీఎం, అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు లావు నాగేశ్వరరావు, సుభాష్ రెడ్డి, ఎన్వీ రమణ నివాసాలకు వెళ్లి వారిని కూడా ఆహ్వానించారు. అనంతరం విమానాశ్రయానికి తిరుగు ప్రయాణమయ్యారు.

# మన ఈవీఎంలు దుర్భేద్యం

(మూడో పేజీ తరువాయి)

ఈసీఐఎల్‌లో వాటిని తయారు చేసిన బృందంలో తాను కూడా ఉన్నానని ప్రకటించి సంచలనం సృష్టించారు. దీనిపై కాంగ్రెస్ నేత కపిల్ సిబాల్ మాట్లాడుతూ ఈవీఎమ్‌లను చెత్తకుప్పలో వేయాలని డిమాండ్ చేశారు. అయితే ఈవీఎమ్‌లను ఎవరూ తారుమారు చేయలేరని మాజీ సీఈసీ నవీన్ చావ్లా స్పష్టం చేస్తున్నారు.

**ప్రశ్న:** భారతదేశంలో ఈవీఎమ్‌లను హ్యాక్ చేయడం సాధ్యం అవుతుందా?

**జవాబు:** ఈవీఎమ్‌లను ఎవరూ హ్యాక్ చేయలేరు. లండన్‌లో నిర్వహించిన మీడియా సమావేశం గురించి నాకు తెలియదు. అయితే రెండేళ్ల క్రితం కూడా కొంతమంది ఈవీఎమ్‌లను హ్యాక్ చేయవచ్చని ప్రయత్నించారు. మన దేశంలో ఈవీఎమ్‌లను రెండు ప్రభుత్వరంగ సంస్థలు తయారు చేస్తున్నాయి. మన దేశంలో ఎన్నికల సంఘం వినియోగిస్తున్న ఈవీఎమ్‌లను ఎవరూ హ్యాక్ చేయలేరు. దీనికి అనేక కారణాలున్నాయి.

**ప్రశ్న:** ఎన్నికల సంఘానికి చేరడానికి ముందే ఎవరైనా ఈవీఎమ్‌లను తమకు అనుకూలంగా పని చేయించుకొనే విధంగా తారుమారు చేయడం సాధ్యమవుతుందా?

**జవాబు:** అలా ఎవరూ చేయలేరు. మొత్తం ఈవీఎమ్‌ల తయారీ ప్రక్రియలో ప్రతి దశలోనూ ఎన్నో రక్షణాత్మక వ్యవస్థలు పని చేస్తుంటాయి. ఇకపోతే తయారు చేసిన ఈవీఎమ్‌లను ఫలానా రాష్ట్రాలకే శాశ్వతంగా కేటాయిండం కూడా జరగడం లేదు. వీటిని అవసరమైన చోటకి తరలించడం కూడా జరుగుతోంది.

ఈవీఎమ్‌లను తయారు చేసే సమయంలోనే ట్యాంపరింగ్ చేస్తే.. అవి ఏ పార్టీ ప్రయోజనాల కోసం, ఏ రాష్ట్రం కోసమో ఉద్దేశించి ఉండాలి. అయితే ఈవీఎమ్‌లను అన్ని రాష్ట్రాలకు మారుస్తుండడం, తరలిస్తుండడం జరుగుతోంది.

**ప్రశ్న:** అయితే ఈవీఎమ్‌లు ఎన్నికల సంఘం వద్దకు చేరిన తరువాత... కొంతమంది ఎన్నికల సంఘం అధికారుల సహకారంతో వాటిని హ్యాక్ చేయడం సాధ్యపడుతుందా?

**జవాబు:** మనకు 543 పార్లమెంటరీ నియోజవర్గాలున్నాయి. ప్రతి నియోజవర్గానికి రిటర్నింగ్ అధికారి ఉంటారు. ఈయన తప్పనిసరిగా ఐఏఎస్ అధికారే అయి ఉంటారు. ఈ అధికారి కింద ఎంతో మంది ప్రభుత్వ అధికారులు, పోలీసులు బూత్ స్థాయి వరకు పని చేస్తుంటారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, పోలింగ్ అధికారులు, తహశీల్దార్లు.. ఇలా అనేక స్థాయిలకి చెందిన అధికారులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారు. వీరంతా ప్రభుత్వ అధికారులే. వీరిలో స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు వంటి వారు ఎవరూ ఉండరు. ఇందులో ప్రతి ఒక్కరూ జవాబుదారీతనం వహించాల్సి ఉంటుంది. షుజానే దేశంలో ఏదో ఒక పార్లమెంటరీ నియోజకవర్గంలో మేజిస్ట్రేట్‌గా ఉంటే.. ఈవీఎమ్‌లన్నీ అతని ఆధీనంలో ఉంటే, ఆయన వాటిని తారుమారు చేయడం ఎలా సాధ్యమవుతుంది? ఎన్నికల సంఘం గత ఇరవై సంవత్సరాలుగా ఎన్నో సురక్షిత పద్ధతలను అభివృద్ధి చేసి అమలు చేస్తోంది.

**ప్రశ్న:** తన వద్దకు వచ్చిన ఈవీఎమ్‌లను ప్రతి ఒక్కదాన్నీ ఎన్నికల సంఘం పరీక్షిస్తుందా? ట్యాంపర్ చేయడానికి వీల్లేకుండా ఉన్నాయని నిర్ధారించుకుంటుందా?

**జవాబు:** అవునండి.. ఎన్నో కఠినమైన ప్రోటోకాల్స్‌ను ఎన్నికల సంఘం ఈ విషయంలో పాటిస్తుంది. ప్రతి ఒక్క ఈవీఎమ్ యంత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుంది. ఇక ఎన్నికలు జరగడానికి ముందు ఎన్నికల సంఘం అన్ని రాజకీయపార్టీలను ఆహ్వానించి.. ఏదో ఒక మిషన్‌ను ఎంచుకొని పరీక్షించుకోవడానికి అవకాశం కల్పిస్తుంది.

ఈ ప్రక్రియ అంతా ఇంజనీర్ల సమక్షంలో జరుగుతుంది. ఈ ప్రక్రియ ప్రతి నియోజవర్గంలోనూ జరుగుతుంది.

**ప్రశ్న:** మనిషి చేతుల ద్వారా ఈవీఎమ్‌లను ట్యాంపర్ చేయడం సాధ్యం కాకపోయినా.. వైర్‌లెస్ విధానాల్లో హ్యాక్ చేయడం సాధ్యం కాదంటారా?

**జవాబు:** ఈవీఎమ్‌లను వైర్ ద్వారా కానీ, వైర్‌లెస్ ద్వారా కానీ ఎవరూ హ్యాక్ చేయలేరు. ట్యాంపరింగ్‌కి పాల్పడలేరు. ప్యాకెట్ కేలిక్యులేటర్‌ని ఎవరైనా హ్యాక్ చేయగలరా? డెస్క్‌టాప్‌పైనా ఒక కేలిక్యులేటర్ ఉంటుంది. దాన్ని కూడా ఎవరూ హ్యాక్ చేయలేరు. ఈవీఎమ్‌ల్లో కూడా కేలిక్యులేటర్ వంటి వ్యవస్థే ఉంటుంది.

**ప్రశ్న:** లండన్‌లో ఉంటున్న సైబర్ నిపుణుడు షుజా మాట్లాడుతూ.. 2014 ఎన్నికలను ఈవీఎమ్‌లను హ్యాక్ చేయడం ద్వారా రిగ్గింగ్ చేశారని ఆరోపించారు. దీనిపై మీరేమంటారు?

**జవాబు**: (వ్యంగ్యంగా..) అవునండి.. నేను కూడా కొంత నమ్ముతాను. 2014లోనే కాదు, 2009 ఎన్నికల్లో కూడా ట్యాంపరింగ్ జరిగింది. ఆ ఎన్నికలు నా ఆధ్వర్యంలోనే జరిగాయి కదా? ఆ ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత జాతీయంగా, అంతర్జాతీయంగా ఒక్క ఆరోపణ కూడా రాలేదు.

**ప్రశ్న:** గత నాలుగేళ్లుగా ఈవీఎమ్‌లను హ్యాక్ చేస్తున్నారని బురద చల్లుతున్నారు. దీనిపై మీరేమంటారు?

**జవాబు:** ఏ ఎన్నికలో అయినా గెలిచినవారు ఎంతో సంతోషంగా సంబరాలు చేసుకుంటారు. అయితే ఓడిన వారు కొన్నిసార్లు యంత్రాలపైన నెపాన్ని వేయడానికి చూస్తారు. యూపీలో రెండు వేల సంవత్సరంలోనూ, రెండు వేల ఆరు సంవత్సరంలోనూ ఇవే ఈవీఎమ్ యంత్రాలు పూర్తిగా భిన్నమైన ఫలితాలను ఇచ్చాయి కదా? దీనికి ఎవరైన ఎలాంటి సమాధం చెబుతారు?

**ప్రశ్న:** జమ్ము, కాశ్మీర్ నాయకుడు ఫరూక్ అబ్దుల్లా ఈ ఈవీఎమ్‌లను దొంగ యంత్రాలను తిట్టి పోశారు. ఆయనెందుకు అలాంటి అభిప్రాయానికి వచ్చాడంటారు?

**జవాబు:** ఫరూఖ్ అబ్దుల్లా లాగా ఈవీఎమ్‌లను తిట్టిపోసేవారి గురించి నేనేమీ మాట్లాడను. అయితే ఈవీఎమ్‌లను ఎవరూ హ్యాక్ చేయలేరని సంపూర్ణంగా నేను నమ్ముతున్నాను. 2009 సార్వత్రిక ఎన్నికలను మే నెలలో నిర్వహించినప్పుడు, జూలైలో కొన్ని ఫిర్యాదులొచ్చాయి. అప్పుడు వివిధ రాష్ట్రాల నుంచి వందల కొద్దీ ఈవీఎమ్‌లను తెప్పించాం. అప్పుడు అందరినీ పిలిచాం. దాన్నే ఒక పోలింగ్ కేంద్రంగా భావించమని చెప్పాం.

ఎవరైనా సరే ఈవీఎమ్‌లను ఎలా అయినా హ్యాక్ చేయమని బహిరంగంగా అవకాశం ఇచ్చాం. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశాం. కోర్టులో సాక్ష్యంగా పనికొస్తుందని వీడియో కెమెరాలతో రికార్డింగ్ కూడా చేయించాం. అప్పుడు ఎవరూ ఏమీ చేయలేకపోయారు.

# జగన్‌తో మేడా భేటీ

●పార్టీలో చేరేందుకు సుముఖత ●ఎమ్మెల్యేకు రాజీనామాపై జగన్ షరతు ●చర్చలు సఫలం

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** తెలుగుదేశం పార్టీకి చెందిన కడప జిల్లా రాజంపేట ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. మంగళవారం లోటస్ పాండ్‌లోని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ నివాసానికి వచ్చారు. మేడా మల్లికార్జున రెడ్డితోపాటు ఆయన ఇద్దరు సోదరులు మేడా రఘునాథరెడ్డి, మేడా రాజశేఖర్ రెడ్డి , చిన్నాన్న మాజీ ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి ముఖ్యఅనుచరుడు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ యోగీశ్వర్ రెడ్డి తదరులకు వైసీపీనేత ఎంపి విజయసాయిరెడ్డి, పార్థసారథి తదితరులు సాదర స్వాగతం పలికారు. జగన్‌తో సుమారు 40నిమిషాల పాటు చర్చలు జరిపారు. పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. జగన్ కూడా పార్టీలో చేరితే మంచి భవిష్యత్తు ఉంటుందని మేడా సోదరులకు భరోసా ఇచ్చారు. అంతే కాకుండా తొలుత ఎమ్మెల్యే పదవికి టీడీపీకి రాజీనామా చేసి వస్తేనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటామని షరతు పెట్టారు. అది తమ పార్టీ సిద్ధాంతం అని మేడా సోదరులకు జగన్ స్పష్టం చేశారు. రాజంపేట వైసీపీ నేతలతో కూడా జగన్ మాట్లాడారు . వారు కూడా మేడా సోదరులు వైసీపీలోకి చేరికపై అభ్యంతరాలు తెలపలేదు. దీంతో మేడాకు పార్టీలో చేరేందుకు జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈనెల 31న రాజంపేటలో భారీ ఎత్తున సభ ఏర్పాటు చేసి ఆ సభకు ఆహ్వానిస్తామని మేడా సోదరులు తెలపటంతో జగన్ అందుకు అంగీకరించారు. రాజంపేట సభలో మేడా సోదరులు తన అనుచరులతో జగన్ సమక్షంలో చేరేందుకు నిర్ణయించారు.

# అగ్రవర్ణాల మధ్య బాబు చిచ్చు


(మూడో పేజీ తరువాయి)

కాలయాపన చేసింది చంద్రబాబు కాదా? అంటూ ఆయన ప్రశ్నించారు. కులాల మధ్య చిచ్చు పెట్టి ప బ్బం గడుపుకోవడం బీజేపీకి చేత కాదని ఆయన పేర్కొ న్నారు. అధికారం కోసం అనేక వాగ్దానాలు చేసిన చంద్రబాబు ఎందుకు అమలు చేయ లేదంటూ కన్నా నిలదీశారు. కేంద్రం 3200 కిలో మీటర్ల జాతీయ రహదార్లు ఇచ్చిందని స్వయంగా తెదేపాకు చెందిన మంత్రి అయ్యన్న పాత్రుడు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీజేపీ ప్రచార కమిటీ కన్వీనర్‌గా చంద్రబాబు బాగా చేస్తున్నట్లు కితాబిచ్చిన ఆయన సోషల్ ఆడిట్‌కు కేంద్రమంత్రి సవాల్ విసిరితే స్పందన లేదని ఆక్షేపించారు.

రాష్ట్రంలో పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష నేతలపై భౌతికదాడులకు దిగుతున్నట్లు ఆయన ఆరోపించారు. మార్చి 2న అన్ని జిల్లాల్లో యువ మోర్చా తరుపున కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రమేష్ నాయుడు తెలిపారు. సమావేశంలో బీజేపీ ఉపాధ్యక్షుడు తురగా నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి అడపా నాగేంద్రం, రాష్ట్రసంఘటనా ప్రధాన కార్యదర్శి జీఆర్ రవీంద్ర రాజు, యువ మోర్చా జాతీయ కార్యదర్శి పనసల సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాజుల వెంకయ్య నాయుడు, కార్యదర్శి పాలూరి జయప్రకాష్‌నారాయణ, కోశాధికారి పిట్టల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మేడాపై సస్పెన్షన్ వేటు!

●కార్యకర్తలను ధిక్కరిస్తే ఇదే జవాబు ●త్వరలోనే రాజంపేటకు ఇన్‌చార్జ్: సీఎం



**అమరావతి, ఆంధ్రప్రభ :** ప్రభుత్వ విప్, కడప జిల్లా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని టీడీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటిం చారు. మంగళవారం ముఖ్య మంత్రి చంద్రబాబు రాజంపేట కార్యకర్తలు, ముఖ్యనేతలతో ఉండవల్లిలోని ప్రజావేదికలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మేడా మల్లికార్జున రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, అనర్హుడిని అందలం ఎక్కించారని పెద్ద ఎత్తున కార్యకర్తలు నినదించారు. వెంటనే నేతలు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించిన ముఖ్య మంత్రి ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలను ఇబ్బంది పెట్టే వారికి పార్టీలో స్థానం లేదని స్పష్టం చేశారు. మల్లికార్జునరెడ్డిని ఎమ్మెల్యేగా చేయడమే కాకుండా ప్రభుత్వ విప్‌గా నియమించామని అన్నారు. మేడా తండ్రికి టీడీపీ సభ్యత్వం క ూడా ఇచ్చామని, ఐదేళ్లు అన్ని అనుభవించి ఎన్నికలు వస్తున్న సమయంలో వేరే పార్టీకి వెళ్ళిపోయారని మండిపడ్డారు. గెలుపు, ఓటములకు, కుట్రలు, కుతంత్రాలకు తాను భయపడేది లేదని, పార్టీలో ఉండే అర్హత మల్లికార్జునరెడ్డికి లేదని అన్నారు. రాజంపేట నియోజకవర్గ సమన్వయం బాధ్యతను మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, ఆది నారా యణరెడ్డితో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి అప్పగించారు. ఈ ముగ్గురు కార్యకర్తలకు అందుబాటులో ఉండి అండగా నిలుస్తారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో మళ్ళీ తెలుగుదేశం పార్టీనే విజయం సాధిస్తుందని, ఎవరెన్నీ కుట్రలు చేసినా, కుతంత్రాలు పన్నినా ప్రజలు వారిని చిత్తు చిత్తు చేస్తారని అన్నారు. మధ్యలో వచ్చిన వారు మధ్యలోనే పోతారని, టీడీపీకి కార్యకర్తలే శాశ్వతమని చంద్రబాబు అన్నారు. వ్యక్తులు అప్రస్తు తమని, పార్టీయే శాశ్వతమని చెప్పారు. కార్యకర్తలకు అండగా ఉండి కంటికి రెప్పలాగా కాపాడుకుంటానని అన్నారు. రాజంపేటతో సహా కడప జిల్లాలో టీడీపీ విజయ దుందుబి మోగించడం ఖాయమన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.నాలుగున్నరేళ్ళలో కడపలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని, అంతేకాకుండా పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించామన్నారు. ఇవే విజయానికి బాటలు వేస్తాయని చెప్పారు. కడపలో చీని చెట్టు ఎండిపోకుండా కాపాడమని, గండికోట, చిత్రావతి, పైడిపాలెంకు నీళ్లు ఇచ్చిన ఘనత టీడీపీదే అన్నారు. త్వరలోనే రాజంపేటకు ఒక సమర్ధుడైన ఇన్‌చార్జ్‌ను నియమిస్తామని చంద్రబాబు తెలిపారు. అంతా కార్యకర్తలు, నేతలు ఐక్యమత్యంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

# సంక్షేమ బాటలో బడ్జెట్లు


(మూడవ పేజీ తరువాయి)

వీలైనంతగా తగ్గించేది. వాస్తవానికి దేశానికి స్వతంత్ర మొచ్చిన తొలిరోజుల్లో ప్రభుత్వాదాయాన్ని వీలైనంతగా ప్రజాసంక్షేమానికి కేటాయించేవారు. అభి వృద్ధి, సంక్షేమం రెండింటికి సమాన ప్రాధాన్యతనిచ్చేవారు. రానురాను సంక్షేమ రంగానికి కేటాయింపులు తగ్గించారు. వ్యవసాయ, పారిశ్రామిక మౌలిక సదుపాయాల వృద్ధిలో భాగంగా అభివృద్ధికే నిధుల కేటాయింపులో పెద్దపీటేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశీ ఆర్థిక సంస్థల ఆదేశాలకనుగుణంగా వీలైనంతగా రాయితీల కేటాయింపుల్లో కోతలెట్టేవారు. ఇలా ఉచితంగా లేదా సబ్సిడీ ధరలపై ఆహారధాన్యాలు, ఉపాధి కల్పన కార్యక్రమాల్ని చేపట్టడం వల్ల ప్రజల్లో సోమరితనం పెరిగిపోతుందన్న ప్రచారం విస్తృతంగా జరిగేది. ఇది దేశ ఆర్థిక స్థితిని దిగమింగుతుందన్న భయాన్ని కల్పించేవారు. అంచెలంచెలుగా సబ్సిడీల్ని తొలగిస్తూ సంక్షేమ రంగాన్ని నిర్వీర్యం చేసేవారు. కానీ కొన్నేళ్ళ క్రితం నుంచి పరిస్థితి మారింది. మౌలిక వసతుల కల్పనారంగం పూర్తిగా ప్రైవేటుపరం కావడంతో ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల్లో మార్పులొచ్చాయి. ప్రజల నుంచి పన్నుల రూపంలో సేకరించిన ధనాన్ని తిరిగి వారి సంక్షేమానికి వ్యయం చేయాలన్న ఆలోచన పెరిగింది. దీని వెనుక రాజకీయ ప్రయోజనాలున్నా సంక్షేమ పథకాల ప్రకటనల్లో అధికార, ప్రతిపక్షాలు పోటీలు పడ్డం మొదలైంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిది మరింత ఉచ్ఛస్థాయికి చేరింది. ఈసారి అన్ని పార్టీలు సంక్షేమంపైనే దృష్టిపెట్టాయి. తాము అధికారంలోకొస్తే రాయితీలు, సబ్సిడీలు పెంచుతామంటూ హామీలు గుప్పిస్తున్నాయి. ఉచితంగానే నిత్యావసరాలు, ఇతర సదుపాయాలు అందిస్తామంటూ మేనిఫెస్టోల్లో పెడుతున్నాయి. ఇప్పటికే రైతులు, మహిళలకిచ్చిన రుణాల రద్దుకు హామీనిస్తున్నాయి. విద్యార్థులు, యువత, మహిళలు ఇలా సమాజంలోని వివిధ వర్గాలకు వేర్వేరుగా ఉచిత పథకాల అమలుకు సంసిద్ధమౌతున్నాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకొస్తే ఇస్తామంటున్న పార్టీలకు ధీటుగా ఇప్పటికే ప్రభుత్వాన్ని నడుపుతున్న పార్టీలు మరింత బలమైన సంక్షేమ పథకాల్ని అమల్లోకి తెచ్చేస్తున్నాయి. కేవలం ఎన్నికలకు ముందే కాకుండా దీర్ఘకాలిక ప్రాతిపదికన నిరంతర ప్రక్రియగా ఈ పథకాల్ని అమలు చేసేందుకు వీలుగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో వీటిని ప్రతిపాదిస్తున్నాయి. గతంలో అయితే కేంద్ర బడ్జెట్ ప్రకటన అనంతరమే రాష్ట్రాలు ఈ ప్రకటనలు చేసేవి. కేంద్రం ప్రకటించే సంక్షేమ పథకాలు, రాయితీలకు అనుగుణంగా రాష్ట్రాలు స్పందించేవి. కానీ ఇప్పుడు రాష్ట్రాలకు కూడా ఆదాయం పెరిగింది. సంపద వృద్ధి అయింది. వీటిని తిరిగి అవసరాల్లో ఉన్న ప్రజల దరిచేర్చాల్సిన బాధ్యతను అవి గుర్తించాయి. దీంతో కేంద్ర బడ్జెట్‌తో సంబంధం లేకుండానే తాము సమీకరించే నిధుల్ని బట్టి ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమానికి పెద్దమొత్తంలో కేటాయింపులు జరిపేందుకు సిద్ధమౌతున్నాయి. ఇప్పుడొచ్చే కేంద్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అయితే గతంలో ఎప్పుడూ కనివిని ఎరుగని రాయితీలు, సబ్సిడీలతోపాటు ఉచిత పథకాలు కూడా పెద్దసంఖ్యలో ప్రవేశపెట్టాలని ఇప్పటికే కేంద్రం నిర్ణయించింది. రాష్ట్రాలు కూడా దీనికేమాత్రం తగ్గకుండా వీలైతే మరికాస్త ఎక్కువగానే సబ్సిడీలు, రాయితీల ఖాతాలకు నిధులు కేటాయించాలని పోటీలు పడుతున్నాయి.

# భాజపాకు కోల్‌కతా ఫీవర్!

**● ఏపీకి కేంద్రం చేసింది శూన్యం ● స్వయంకృషితో ఎదుగుతున్నాం ● గడ్కరీ వ్యాఖ్యలు పచ్చి అబద్ధం ● ఈవీఎంల పట్ల అప్రమత్తం ● నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు**



**అమరావతి, ఆంధ్రప్రభ :** కోల్‌కత్తా సభతో బీజేపీ నేతల్లో కలవరం మొదలైందని, కూటమికి నలుగురు ప్రధానులు అంటూ ఆ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలే దీనికి నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఏపీకి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ఎక్కువ నిధులు ఇచ్చామని కేంద్ర మంత్రి గడ్కరీ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మంగళవారం టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ నేతలతో ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లకు ఎక్కువ నిధులు ఇచ్చారని, ఒక్క బుల్లెట్ ట్రైన్‌కే రూ. లక్ష కోట్లు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌ను ఏదో ఉద్ధరించినట్టు బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, అన్ని రాష్ట్రాలతో పాటు నిధులు కేటాయించారే తప్ప ప్రత్యేకంగా ఇచ్చింది ఏమీ లేదని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల కన్నా ఏపీకి తక్కువ నిధులు ఇచ్చారని వెల్లడించారు. పోలవరానికి నెలలోనే నిధులు విడుదల చేస్తామనిహామీ ఇచ్చి ఏడాది పాటు జాప్యం చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టుకు సంబంధించి రెండోవ డీపీఆర్‌లను ఆమోదించడంలో కూడా ఏడాది గడిచినా ఎలాంటి చలనం లేదన్నారు. ఏ రాష్ట్రానికి అయినా మోడీ ఆమోద ముద్రతోనే నిధులు ఇస్తున్నారని, ఆయన వివక్షతకు ప్రతిరూపమని విమర్శించారు. ఏపీ అభివృద్ధిలో బీజేపీ పాత్ర ఏమాత్రం లేదని, కేవలం స్వయం కృషితోనే అభివృద్ధి చేశామని, ఆ ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు.

### మంత్రివర్గ నిర్ణయాలపై వివరించండి

తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్ళాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతలకు దిశానిర్ధేశం చేశారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన 10శాతం రిజర్వేషన్లలో కాపులకు 5శాతం ఇవ్వాలని ఏనాడో కోరామని అయితే దీనికి బీజేపీ నేతలు ఒప్పుకోలేదని అన్నారు. ఈ 10శాతం రిజర్వేషన్లలో కాపులకు 5శాతం మిగిలిన 5 శాతాన్ని ఈడబ్ల్యూఎస్ పేదలకు ఇస్తామని తెలిపారు. మరోవైపు పింఛన్లు కూడా రెట్టింపు చేశామని, దీనికి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసిందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు రూ. 250 కోట్లు ముందస్తుగా చెల్లించాలని నిర్ణయించామని, చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకున్న వారికి ఈ మొత్తాన్ని చెల్లిస్తామన్నారు. ఈ నిర్ణయంతో 6 లక్షల మంది బాధితులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. మిగిలిన బాధితులకు కూడా హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తప్పనిసరిగా న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

మరోవైపు ఆటోలపై లైఫ్ ట్యాక్స్, ట్రాక్టర్లపై త్రైమాసిక పన్నును తొలగించామని దీని వల్ల ప్రయోజనం చేకూరిన డ్రైవర్లు, ఓనర్లనంతా టీడీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. అనుమతులు మంజూరు కాకుండానే 2014 తర్వాత 1.26లక్షల మంది గృహ నిర్మాణాలు చేసుకున్నారని వారందరికీ రూ. 60వేలు చెల్లించేందుకు నిర్ణయించామని తెలిపారు. ఇందుకోసం రూ. 750కోట్లను వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకువచ్చి పార్టీకి అండగా నిలిచేలా చూడాలని నేతలకు అధినేత దిశానిర్దేశం చేశారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర, జిల్లా పార్టీ బాధ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఈవీఎంల పట్ల అప్రమత్తం

ఈవీఎంల ట్యాంపరింగ్ ఎలా చేయవచ్చో అంతర్జాతీయంగా సైబర్ నిపుణులు వెల్లడించారని, ఈ హెచ్చరికల నేపథ్యంలో వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. ప్రజాస్వామ్యంలో అనుమానాలకు తావు ఉండకూడదని, ఓటు ఎవరికి పడిందనే సంశయం ప్రజల్లో ఉండకూడదన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి చేటు కలిగించే పరిణామమని చెప్పారు. తెలుగుదేశం పార్టీ చేసిన పోరాటం వలనే వీవీ ప్యాట్ రసీదులు వచ్చాయని, అయితే వీటిపై ముద్ర లైట్‌గా పడుతుందని తెలిపారు. ఈ ముద్ర కూడా వెంటనే చెరిగిపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. వీవీ ప్యాట్‌ల వినియోగం 100 శాతం నియోజకవర్గాల్లో అమలు కాలేదని, దీనిపై జాతీయ స్థాయిలో చర్చించనున్నట్లు సీఎం చంద్ర బాబు నాయుడు తెలిపారు.

# ఢిల్లీలో మూడు రోజులుగా జనసేన దీక్ష

**● అన్నదాతలకు మద్దతుగా నిరసన ● ప్రధాని, రాష్ట్రపతి కార్యాలయాలకు వినతి పత్రాల సమర్పణ**



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** అన్యాయానికి గురవుతున్న అన్నదాతలకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటం ఆగదని జనసేన విశాఖ జిల్లా కమిటీ సభ్యులు కొణతాల సీతారామ్ తేల్చి చెప్పారు. విశాఖ జిల్లా, అనకాపల్లి మండలం టి.వెంకుపాలెం రైతులకు పరిహారం చెల్లించాకే భూములను సేకరించాలనే డిమాండ్‌తో దేశ రాజధానిలో ఆయన చేపట్టిన దీక్ష నేటికి నాలుగో రోజుకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడో ఉన్న రైతుల ఇబ్బందులను హస్తిన వరకూ తీసుకొచ్చిన సీతారాం... తమ సమస్యను పరిష్కరించాలంటూ జనసేన పార్టీ తరపున ప్రధానమంత్రి కార్యాలయానికి, రాష్ట్రపతి భవన్ కార్యాలయానికి వినతి పత్రాలు సమర్పించారు. అనకాపల్లి మండలం టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67,68లో సుమారు వంద ఎకరాల భూమిని ఉద్యానవన పరిశోధనా క్షేత్రం ఏర్పాటు కోసం సేకరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రారంభ దశలో ఎకరాకు పది లక్షల రూపాయల పరిహారం ఇస్తామని చెప్పి తర్వాత దాన్ని ఆరు లక్షల రూపాయలకు కుదించారు. లబ్ధిదారుల జాబితాను తయారు చేసిన సమయంలో అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద్, తన అనుచరుడు, సంపతిపురం మాజీ సర్పంచ్ నంబారు శ్రీనుతో కలిసి కొంత మంది నకిలీల పేర్లను లబ్ధిదారులుగా చేర్చి సుమారు రెండు కోట్ల రూపాయలు కాజేయడానికి ప్రయత్నించారని, దాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడిగా తాను అడ్డుకున్నానని కొణతాల సీతారాం ఆరోపిస్తున్నారు. అర్హులైన వారికి మాత్రమే పరిహారం అందించాలని ఆందోళన చేపట్టడంతో భూముల సేకరణ ఆగిపోయింది. ఈ భూసేకరణ కోసం ప్రభుత్వం సుమారు 8 కోట్ల రూపాయలను మంజూరు చేసినా, అనకాపల్లి ఆర్డీవో రైతులకు పరిహారం ఇవ్వకుండా భూములు సేకరించడానికి చర్యలు తీసుకోవడంతో మరోసారి తాము ఆందోళనకు దిగామని ఆయన వివరించారు. రెండు సార్లు ఆర్డీవో, ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసినా ఫలితం లేకుండా పోయిందని సీతారాం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనకాపల్లి పర్యటనకు వచ్చినప్పుడు నేరుగా ఆయనను కలిసి తమ సమస్యకు పరిష్కారాన్ని కోరుతూ రైతులు వినతిపత్రం అందజేశారు. విశాఖ జాయింట్ కలెక్టర్ సృజన దృష్టికీ రైతుల సమస్యను తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో జనసేన అనకాపల్లి నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం నిరవధిక దీక్షకు దిగారు. ఉద్యానవన పరిశోధనా క్షేత్రం ఏర్పాటు కోసం సేకరించాలని భావించిన స్థలంలో 40 రోజుల పాటు దీక్ష చేశారు. అయినా లాభం లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆయన అన్నదాతలతో కలిసి ఢిల్లీ చేరుకున్నారు. టి.వెంకుపాలెంనకు చెందిన కుండల లోవరాజు, పాము అప్పారావు, ఊరుకుటి తాతబ్బాయి, బరనికన నర్సింగమూర్తి, ఊరుకుటి రాము నాయుడు, పాము పైడిరాజు, చందనాల గోవింద్, పాము సూర్య గోవిందతో కలిసి జంతర్ మంతర్ వద్ద గత ఆదివారం నుంచి దీక్ష చేస్తున్నారు. అనకాపల్లి రైతులు ఢిల్లీలో ఆందోళన చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే దృష్టికి రైతుల అంశాన్ని తీసుకెళ్లాలని ప్రయత్నిస్తే పోలీసులతో అరెస్ట్ చేయించారని కొణతాల సీతారామ్ విమర్శించారు. ఏది ఏమైనా రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడతానని ఆయన ఆంధ్రప్రభకు వివరించారు. ప్రస్తుతం ప్రధానమంత్రి కార్యాలయం, రాష్ట్రపతి భవన్‌కు వినతి పత్రాలు సమర్పించామని, వారి నుంచి వచ్చే స్పందనను బట్టి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సమయంలో తదుపరి చర్యలు చేపడతామని సీతారామ్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో గ్రామ సభ నిర్వహించాలని, అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ముందు ప్రకటించినట్టుగానే రైతులకు ఎకరాకు పది లక్షల రూపాయల నష్టపరిహారం అందజేయాలని కోరారు.

# ఆ సగం... సందేహమే!

(మూడవ పేజీ తరువాయి)

నిర్వహించాయి. కానీ ప్రభుత్వ తాజా నిర్ణయాన్ని బీసీ సంఘాలు స్వాగతిస్తున్నాయి. ఇది పూర్తిగా అగ్రకులాల్లోని పేదలకు సంబంధించిందే తప్ప తమ కోటా పరిధిలోకొచ్చే అంశం కాదంటూ బీసీ నాయకులు వ్యాఖ్యలు చేస్తున్నారు. అదే సమయంలో పేదరికం ప్రాతిపదికన ఇచ్చే రిజర్వేషన్లను భారత రాజ్యాంగం ఆమోదించదంటూ వీరే తేల్చిచెబుతున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అదనపు రిజర్వేషన్ కోటా కోసం ఉద్యమాలు సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కాపుల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే తెలంగాణలో ముస్లింలు, గుజరాత్‌లో పటేళ్ళు, రాజస్థాన్‌లో గుజ్జర్ల కోసం అదనపు రిజర్వేషన్లు ఇవ్వండంటూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని అభ్యర్థించాయి. కనీసం అదనంగా ఇస్తున్న పదిశాతం రిజర్వేషన్లకు సంబంధించి కేటాయింపుల అధికారాన్ని తమకు ఇమ్మంటూ రాష్ట్రాలు కేంద్రాన్ని కోరాయి. వీటన్నింటికి కేంద్రం ససేమిరా అంది. ఏ ఒక్క డిమాండ్‌ను ఆమోదించలేదు.

గత కొన్నేళ్ళుగా ప్రతిసారి ఎన్నికలకు ముందు కాపులకు బీసీ రిజర్వేషన్ల అంశం ఓ రాజకీయ ప్రచారాస్త్రంగా మారిపోయింది. రాష్ట్రంలో ఇతర కులాలతో పోలిస్తే తాము అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ఆర్థికంగా చిన్నచిన్న కులాల కంటే వెనుకబాటులో ఉన్నామన్నది కాపుల వాదనగా ఉంటోంది. మూడు దశాబ్దాలుగా రిజర్వేషన్ల కోసం కాపుల ఉద్యమాలు సాగుతున్నాయి. వంగవీటి మోహనరంగా, ముద్రగడ పద్మనాభం తదితరులు ఈ ఉద్యమాల్ని ఉధృతం చేశారు. దీంతో పలు నియోజకవర్గాల్లో గెలుపోటముల నిర్ణాయక శక్తిగా ఉన్న కాపుల్ని ఉపేక్షించడం తగదన్న నిర్ణయానికి రాజకీయ పార్టీలొచ్చాయి. అప్పటి నుంచి ఏదొక రూపంలో ఈ రిజర్వేషన్ అంశాన్ని అవి స్పృశిస్తూనే ఉన్నాయి. గత ఎన్నికలకు ముందు సుదీర్ఘ పాదయాత్ర చేసిన చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం నియోజక వర్గంలో రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు. తామధికారంలోకొస్తే కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం విజయానికి కాపుల మద్దతు కూడా ఓ కీలకాంశమైంది. ఏడాదిన్నర తర్వాత కూడా చంద్రబాబు దీనిపై స్పందించకపోవడంతో రాష్ట్రంలో కాపు ఉద్యమం తిరిగి తీవ్రతరమైంది. అదిప్పుడు అధికారపార్టీ అతిపెద్ద సమస్యగా మారింది. తూతూ మంత్రంగా అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కేంద్రం ఆమోదించక పోవడం, అంతకుముందు కాపుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అధ్యయనానికి నియమించిన రామానుజన్ కమిటీ నివేదిక బహిర్గతం చేయకపోవడం, ప్రభుత్వం స్వయంగా నిర్వహించిన ప్రజాసాధికార సర్వేలో గుర్తించిన అంశాల్ని కూడా బయటపెట్టకపోవడం వంటి చర్యలు కాపుల్లో తెలుగుదేశం పట్ల ఆగ్రహాన్ని పోగేశాయి. ఈ దశలో కాపులు సంఘటితమౌతున్నారు. తెలుగుదేశానికి వ్యతిరేకంగా ఏకతాటిపైకి వస్తున్నారు. రాజ్యాధికారం కోసం పోరు సాగిస్తున్నారు. జనాభాకు అనుగుణంగానే పాలనా పగ్గాలు అందుకోవాలని ఆరాటపడుతున్నారు. ఇది అధికార పార్టీకి వెన్నులో చలి తెప్పిస్తోంది. దీన్నుంచి కాపుల దృష్టి మరల్చేందుకే చంద్రబాబు సరికొత్త ప్రణాళికను అమల్లో పెట్టారంటూ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే ఈ ప్రణాళిక వల్ల ఆశించిన ప్రయోజనం చేకూరకపోగా కాపులకు కూడా ఇది ఏ విధంగానూ ఆదుకునే ప్రయోగం కాదని తేల్చిచెబుతున్నారు.

# నేడు పాడేరులో పవన్ కల్యాణ్ బహిరంగ సభ



ఆంజనేయ స్వామి గుడిలో పూజలు చేస్తున్న జన సేన నాయకులు

**అమరావతి, ఆంధ్రప్రభ :** జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బుధవారం మధ్యాహ్నం విశాఖపట్నం జిల్లాలోని పాడేరు అంబేద్కర్ కూడలిలో నిర్వహించే గిరిజన సభలో పాల్గొనున్నారు. మన్యంలో ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం, అభివృద్ధి, సాధికారిత సాధనపై జనసేన పార్టీ ఈసభను నిర్వహిస్తోంది.

### ప్రత్యేక పూజలు

జనసేన పార్టీ విజయం సాధించాలని, పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మంగళవారం విజయవాడలోని బందర్ రోడ్ పున్నమ్మ తోట వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ మహేందర్ రెడ్డి, మీడియా ఇంచార్జ్ పి. హరిప్రసాద్, రాష్ట్ర నాయకులు యాతం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ ఓట్లకు జగన్ గాలం

**● బ్రాహ్మణుల కోసం భారీ పథకాలు**
**● నివేదిక పూర్తి చేసిన అధ్యయన కమిటీ**

**కాకినాడ, ప్రభన్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న వరాల జల్లుకు ఝలక్ ఇచ్చేలా వైకాపా అధినేత జగన్ దృష్టి పెట్టారు. ఇందులో రాష్ట్రజనాభాలో 10 లక్షల ఓటు బ్యాంకు ఉన్న బ్రాహ్మణులపై ఆయన దృష్టి పెట్టారు. బ్రాహ్మణులకు ఏవేం కావాలో కార్యాచరణ రూపొందించేందుకు 18 మందితో కూడిన అధ్యయన కమిటీ వేసారు. కమిటీ నివేదిక తుది రూపు దాల్చబోతోంది. దానిలో భారీ వరాలు ఇచ్చేలా నివేదిక తయారు చేసారు. రెండు మూడు రోజుల్లో జగన్ ఈ వరాల ప్రకటన చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

వైకాపా అధికారంలోకి వస్తే రూ. వేయి కోట్లతో బ్రాహ్మణకార్పొరేషన్‌ను ప్రక్షాళన చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. అధ్యయన కమిటీ కూడా ఇదే ప్రతిపాదించింది. ఇక కార్పొరేషన్‌కు ఏటా రూ 200 కోట్లు కేటాయింపు, కశ్యప పథకం క్రింద ప్రస్తుత కార్పొరేషన్ ఇస్తున్న వృద్ధాప్య పింఛన్‌లు రూ. వేయి నుంచి రూ 3వేలకు, ఆశ్రమాల్లో ఉంటున్న వృద్ధులకు ఆరు వేలకు పెంపు చేయాలని కమిటీ సూచిస్తోంది. అలాగే ఎస్ఎస్‌సి చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి రూ 20వేలు, డిగ్రీ వారికి రూ. 40వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. అదే ప్రస్తుతం ఎస్ఎస్‌సికి రూ 7వేలు, డిగ్రీకి రూ 10వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇక విదేశీ విద్యకు ఆర్థిక సహాయం కోసం రూ 10 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు, విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు నగరాల్లో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల తరహాలోనే బ్రాహ్మణులకు హాస్టళ్ళ నిర్మాణం, అర్చకులకు 65 ఏళ్ల పదవీ విరమణ వయసు తొలగింపు, 2015 పే స్కేల్ అమలు, పే స్కేల్ లేని అర్చకులకు నెలకు రూ 15వేల వేతనాలు ఇవ్వాలని కమిటీ సూచిస్తోంది. ఇక ఇప్పటికే వైకాపా పార్టీ తరపున ఇద్దరు బ్రాహ్మణులకు సీట్లు ప్రకటించేసారు. ప్రస్తుత ఎమ్మెల్యే కోన రఘుపతికి అదే సీటుతో పాటు కొత్తగా మల్లాది విష్ణుకు విజయవాడ సెంట్రల్ సీటు కేటాయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన కార్పొరేషన్, ఫండ్‌లకు ఏమాత్రం సంబందం లేకుండా భారీ నజరానాలతో బ్రాహ్మణులకు పెద్ద పీట వేయడం ద్వారా బ్రాహ్మణ ఓటు బ్యాంకు మొత్తం వైకాపా వైపు ఉండేలా చూసేందుకు అధ్యయన కమిటీ ఇచ్చిన నివేదికను ఈనెల 26లోగా జగన్ స్వయంగా ప్రకటించనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. అదే జరిగితే ప్రస్తుతం టీడీపీ వైపు మొగ్గు చూపుతున్న బ్రాహ్మణ వర్గం తిరిగి వైకాపా వెళ్లే అవకాశాలు మెండుగా ఉన్నాయని బ్రాహ్మణ సంఘాలే చెబుతున్నాయి



# అదాని గ్రూప్‌తో లోకేష్ భేటీ

**అమరావతి, ఆంధ్రప్రభ:** అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ ఏర్పాటు చేస్తామని, కనెక్టెడ్ స్మార్ట్‌సిటీ ఏర్పాటుకు అదాని సహకారం ఉపయోగపడుతుందని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో అదాని ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్‌పార్క్ పనులు వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అన్నారు. దావోస్‌లో మంగళవారం అదాని గ్రూప్ ఎండీ అండ్ సీఈఓ అనిల్ సార్దానాతో మంత్రి లోకేష్ బృందం సమావేశమయింది. డేటా సెంటర్ పార్క్ ఏర్పాటుపై ఇటీవల ఏపీ ప్రభుత్వంతో అదాని గ్రూప్ ఒప్పందం చేసుకుంది. ఈవిషయంపై మంత్రి లోకేష్ మాట్లాడుతూ జనవరి నెలాఖరులోగా అనుమతులు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని, జనవరి నెలాఖరుకి భూమిపూజ చేసి పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం అనిల్ సార్ధానా మాట్లాడుతూ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈసమావేశంలో సీఆర్డీఏ కమిషనర్ శ్రీధర్, ఏపీఈడిబి సీఈఓ జాస్తి కృష్ణకిషోర్, సమాచార శాఖ కార్యదర్శి బి. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### డెలాయిట్ గ్లోబల్ ఛైర్మన్ డేవిడ్ క్రూక్‌తో ...

టెక్నాలజీ సహాయంతో బిగ్ డేటా అనాలిసిస్, రియల్ టైం గవర్నెన్స్ అమలు డెలాయిట్ సహకారం కావాలని మంత్రి లోకేష్ డేవిడ్ క్రూక్‌కి వివరించారు. ఈసందర్భంగా డేవిడ్ క్రూక్ స్పందిస్తూ ఏపీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఏపీ ముందంజలో ఉందని, ఆసేవలు మరింత మెరుగుపరిచేందుకు డెలాయిట్ సహకారం ఇస్తుందన్నారు.

### స్విస్ రే ఇన్స్యూరెన్స్ కంపెనీతో...

తుఫాన్లు, వరదలు, కరువు పరిస్థితులకు ఇన్స్యూరెన్స్ సర్వీసెస్ అందిస్తున్న స్విస్ రే చైనా వంటి దేశాలకు ఇన్స్యూరెన్స్ అందిస్తోంది. ఈసందర్భంగా మంత్రి లోకేష్ వీలైనంత త్వరగా మీ బృందాన్ని ఏపీకి పంపి అధ్యయనం ప్రారంభించాలని కోరారు. అనంతరం స్విస్ రే ఇన్స్యూరెన్స్ కంపెనీ రీజనల్ లీడర్, పబ్లిక్ సెక్టార్ సొల్యూషన్స్ ఇవో మన్జింగర్ మాట్లాడుతూ అనేక దేశాల్లో ప్రకృతి వైపరిత్యాలకు ఇన్స్యూరెన్స్ కల్పిస్తున్నామని, ఏపీలో ఈతరహా ఇన్స్యూరెన్స్ పద్ధతి ద్వారా నష్టాన్ని తగ్గించుకునే అవకాశం వస్తుందన్నారు. త్వరలో మాబృందం అమరావతికి వస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి లోకేష్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో జరిగిన కంట్రీ స్ట్రాటజీ డైలాగ్ ఆన్ ఇండియా సమావేశంలో పాల్గొన్నారు.

# ఏపీలో మెడికల్ ఎలక్ట్రానిక్స్ సెంటర్

**● టెక్నాలజీతో ప్రగతి పరుగులు ● త్వరలో నిర్ణయం తీసుకుంటామన్న నాస్కామ్ చైర్మన్ ● దావోస్‌లో మంత్రి లోకేష్‌తో భేటీ**



**అమరావతి, ఆంధ్రప్రభ :** టెక్నాలజీ అనుసంధానంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 49వ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం దావోస్ చేరుకున్న మంత్రి లోకేష్ ఎజైల్ గవర్నెన్స్ ఫ్యూచర్ కౌన్సిల్ బృందంతో భేటీ అయ్యారు. టెక్నాలజీ అనుసంధానంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పాలనలో తీసుకురావాల్సిన మార్పులు గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వాలు వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులు, టెక్నాలజీకి అనుసంధానం అయ్యేలా ప్రభుత్వాలు పాలనలో మార్పులు, నూతన పాలసీలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అందుబాటులో ఉన్న సమాచారం, టెక్నాలజీ వినియోగించుకొని ప్రజల సమస్యలు పరిష్కరించాలని, ప్రస్తుతం ఏపీలో గవర్నెన్స్ 2.0 అమలు చేస్తున్నామని, రియల్ టైం గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. నూతన రాజధాని అమరావతిలో ల్యాండ్ రికార్డ్సు డిజిటలైజ్ చేస్తున్నామని, బ్లాక్ చైన్ టెక్నాలజీ వినియోగం ద్వారా ల్యాండ్ రికార్డ్సు టాంపరింగ్ జరగకుండా రక్షణ కల్పిస్తు న్నామని, డ్రోన్లను వినియోగించి రియల్ టైంలో భూప రీక్షలు నిర్వహించే టెక్నాలజీపై మేలిండా గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. సీఎం డ్యాష్ బోర్డ్ ద్వారా వివిధ శాఖల సమాచారం అందరికీ అందుబాటులో ఉంచామని, అదేవిధంగా వివిధ శాఖల పనితీరు రియల్ టైంలో తెలుసుకుంటున్నామని, ఈ-ప్రగతి ద్వారా సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఎజైల్ గవర్నెన్స్ ఫ్యూచర్ కౌన్సిల్ సభ్యులు మెంబర్ ఆఫ్ యూరోపియన్ పార్లమెంట్ మారిట్జ్ సాకే, ఏపీ ప్రభుత్వం తరపున ఆర్టీజీ సీఈఓ అహ్మద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### నాస్కామ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీతో సమావేశం

మంత్రి నారా లోకేష్ విప్రో లిమిటెడ్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్, నాస్కామ్ ఎక్సిక్యూటివ్ కౌన్సిల్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రిషద్ ప్రేమ్‌జీ మాట్లాడుతూ నాస్కామ్ ఆధ్వర్యంలో ఫ్యూచర్ స్కిల్స్ అభివృద్ధి కోసం నూతన ప్లాట్ ఫార్మ్ ఏర్పాటు చేస్తున్నామని, అధునాతన టెక్నాలజీల్లో మన దేశ యువతకి శిక్షణ ఇవ్వడం ద్వారా వాళ్లు ఉద్యోగ అవకాశాలు అందుకునే విధంగా సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఏపీలో అధునాతన టెక్నాలజీల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నామని, ఫిన్‌టెక్, బ్లాక్ చైన్, బిగ్ డేటా లాంటి టెక్నాలజీలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నాస్కామ్ ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ స్కిల్స్ ప్లాట్ ఫార్మ్ ద్వారా యువనేస్తంలో ఉన్న యువతి, యువకులకి శిక్షణ ఇచ్చేందుకు సహకారం కావాలని, ఏపీలో విప్రో కార్యకలాపాలు మరింతగా విస్తరించాలని, విశాఖపట్నంలో ఉన్న సెంటర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ ఎలక్ట్రానిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని రిషద్ ప్రేమ్‌జీ తెలిపారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య, ఏపీఈడీబీ సీఈఓ జాస్తి కృష్ణకిషోర్, ఆర్టీజీ సీఈఓ అహ్మద్ బాబు, సమాచారశాఖ కార్యదర్శి బి. రామాంజనేయులు, వైద్యశాఖ సలహాదారుడు డాక్టర్ జితేందర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

### సీఐఐ డైరెక్టర్ జనరల్‌తో...

ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి అంతా ఒకేచోట కాకుండా అభివృద్ధి వికేంద్రీకరణ విధానం అమలు చేస్తున్నామని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళవారం దావోస్‌లో సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, కేపీఎంజీ చైర్మన్ అండ్ సీఈఓ అరుణ్ కుమార్‌తో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో పారిశ్రామికాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో నెంబర్ వన్ స్థానంలో ఉన్నామని, కేవలం పెట్టుబడులు ఆకర్షించడమే కాకుండా వచ్చిన ఇన్వెస్టర్లు సంతోషంగా ఉండటం కూడా అంతే ముఖ్యమన్నారు.


**VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)**

**'E' Procurement Notice**

No.83/VMC-Engg/CDB/AE/2018-19 Dt: 21.01.2019

| Sl. No. | Name of Work | Estimate Amount Rs. In Lakhs |
|---|---|---|
| 1. | Construction of Compound wall, GLSR, Digital Skill development center, Providing roads and drains (14 works) | 1278.51 |

Contact: Superintending Engineer, VMC, Vijayawada - 520 001.
Further details can be seen @ 'e' procurement market place @ www.tender.apeprocurement.gov.in
Download of bid documents starts from : 24-01-2019 @ 03.30 P.M
Last date / time for receipt of tenders : 07-02-2019 upto 04.00 P.M

Sd/- K.S. Rama Murthy
For Commissioner

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 23 జనవరి 2019


## చరిత్రలో ఈరోజు

### జననం తప్ప మరణం లేదు!



నేతాజీ సుభాష్ చంద్రబోస్ పేరు వింటేనే భారతీయుల ఒడలు పులకరిస్తాయి. ఆసేతు హిమాచలాన్ని ప్రభావితం చేసిన సుభాష్ చంద్రబోస్ ఆనాటి కాంగ్రెస్‌లో ఒక సంచలనం. కాంగ్రెస్‌లో మహాత్మగాంధీ మాటను కాదని ఆపార్టీకి అధ్యక్షుడు కావడం ఎవ్వరికీ సాధ్యం కాదు. అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నేతాజీ 1938-39లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించే మార్గాలలో గాంధీజీతో విభేదించిన నేతాజీ యుద్ధం ద్వారానే బ్రిటీష్ వారి కబంధ హస్తాల నుంచి విముక్తి సాధ్యమవుతుందని విశ్వసించారు. అటు హిట్లర్‌తో, ఇటు జపాన్‌తో చేతులు కలిపిన నేతాజీ అజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం విదేశీగడ్డపై సమరశంఖం పూరించారు. 1941లో జర్మనీకి వెళ్లిన నేతాజీ నాజీ నియంత హిట్లర్ సహాయం కోరారు. బెర్లిన్‌లో ఫ్రీ ఇండియా సెంటర్, ఫ్రీ ఇండియా రేడియో ప్రారంభించారు. రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న ఆ రోజుల్లో రేడియోలో సుభాష్ చంద్రబోస్ ప్రసంగాలను వినడానికి యావత్ భారతీయులు ఉవ్విళ్లూరేవారు. నేతాజీ ప్రసంగంతో ఉత్తేజితులయ్యేవారు. నేతాజీ భారత్ వస్తారని, బ్రిటీష్ చెర నుంచి విముక్తి కలిగిస్తారని నమ్మేవారు. నేతాజీ దేశంలోకి వస్తున్నారనే వదంతులు, పుకార్లు ఆ రోజుల్లో విపరీతంగా వ్యాపించేవి. అవి నమ్మిన ప్రజలు నేతాజీ రాక కోసం వీధుల్లో వేచి చూడడం విశేషం. ఈనాడు మన నేతలు తరుచూ వాడుతున్న జైహింద్ నినాదాన్ని జాతికి అందించింది నేతాజీ సుభాష్ చంద్రబోస్. నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణం ఇప్పటికీ అంతుచిక్కని రహస్యంగా మిగిలిపోయింది. అయితే 1945, ఆగస్టు, 22న బోస్ ప్రయాణిస్తున్న యుద్ధ విమానం కూలడంతో మరణించారని అప్పుడే జపాన్ రేడియో ప్రకటించింది. నేతాజీ మృతిని జపాన్ ప్రభుత్వం ధృవీకరించింది. అయినప్పటికీ ఆయన బతికే ఉన్నారని, తిరిగి వస్తారని, దేశాన్ని విముక్తి చేస్తారని భారతీయులు విపరీతమైన నమ్మకం పెట్టుకున్నారు. ఆ నమ్మకమే తరువాత.. అనేక ఊహాగానాలకు దారి తీసిందని చరిత్రకారులు అంటారు. నేడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన రోజు.

### ప్రళయ భూకంపం!



సరిగ్గా ఇదే రోజున 1556లో చైనాలోని షాన్‌జీలో భారీ భూకంపం సంభవించింది. ఆనాటి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 8.0గా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ భూకంపం ధాటికి 8,30,000 మంది మృత్యువాతపడ్డారు. 1556, జనవరి 23న ఉదయం సంభవించిన ఈ భూకంపం ధాటికి చైనాలోని షాన్‌జీ, హెనన్, గన్సూ, హెబే, షాన్‌డొంగ్, హుబేయ్, హునన్, జియాన్సూ,అన్‌హుయ్ ప్రావిన్స్‌లతోపాటు దాదాపు 97 ప్రాంతాలలో మొత్తం 840 కి.మీ. విస్తీర్ణం భూకంపానికి గురయింది. కొండలు, గుహలు కూలి అనేకమంది చనిపోయారు. ఆయా ప్రావిన్స్‌లలోని 60 శాతానికిపైగా జనాలు చనిపోయారు. షాన్‌జీ ప్రావిన్స్‌లోని వీ నదిలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంప కేంద్రానికి 500 కి.మీ విస్తీర్ణంలో అపారమైన నష్టం జరిగింది. మృతుల సంఖ్య 8,10,000 నుంచి 8,30,000 వరకూ ఉంటుందని అంచనా వేయగలిగినప్పటికీ ఆస్తి నష్టాన్ని అంచనా వేయలేమని నిపుణులు పేర్కొన్నారు. భారీ సంఖ్యలో ఇళ్లు నేలమట్టమయ్యాయి. అడవులు, సహజ సంపద నాశనమయ్యాయి. ఈ భారీ భూకంపానికి సంబంధించిన వివరాలతో కొన్ని రికార్డులను పొందుపరచారు. వీటి ఆధారంగా నేటి జియాలజిస్టులు నష్టాన్ని, భూకంప తీవ్రతను తెలుసుకోవడానికి ప్రయత్నం చేశారు. జన సమర్ధప్రాంతాల్లో తీవ్రస్థాయిలో భూమి కంపించడంతోనే ఇంత భారీ స్థాయిలో ప్రాణ, ఆస్థి నష్టాలు జరిగి ఉంటాయని భావిస్తున్నారు. ప్రపంచ చరిత్రలో ఇంత భారీ ప్రాణ నష్టం జరగడం అదే తొలిసారిగా గుర్తించారు. దాదాపు ప్రళయంతో సమానమైన ఆనాటి చైనా భూకంపం ప్రపంచ భూకంపాల చరిత్రలో అగ్రస్థానం ఆక్రమించింది.

### కలమే ఆయుధం!



జర్నలిజం ఎంతో మంది గొప్ప గొప్ప నేతలను సమాజానికి అందించింది. ప్రపంచవ్యాప్తంగా నాయకులుగా రాణించిన జర్నలిస్టులు ఎంతోమంది ఉన్నారు. మరాఠా సింహం, శివసేన స్థాపకుడు బాల్‌థాక్రే కూడా పత్రికా రంగం నుంచి రాజకీయ రంగంలోకి ప్రవేశించినవారే. అందుకనే ఆయన తన పార్టీ పత్రికలో స్వయంగా వ్యాసాలను చివరి క్షణం వరకు రాస్తూండేవారు. బాల్‌థాక్రే పత్రికారంగంలో కార్టునిస్టుగా కెరీర్ ప్రారంభించారు. జనవరి 23, 1926లో బాంబే ప్రెసిడెన్సీలోని పునెలో జన్మించిన బాల్‌థాక్రే ది ఫ్రీ ప్రెస్ జర్నల్ అనే ఆంగ్ల పత్రికలో ఉద్యోగిగా చేరారు. 1960లో మార్మిక్ అనే రాజకీయ వారపత్రికను సొంతంగా ప్రారంభించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన మరాఠీ మాట్లాడే ప్రాంత ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని తీవ్రస్థాయిలో జరిగిన ఉద్యమంలో థాక్రే నాన్నగారు కేశవ్ సీతారం థాక్రే కీలక పాత్ర పోషించారు. ఆ విధంగా తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భాషాభిమానం, ప్రాంతీయ అభిమానంతో తనదైన సొంత రాజకీయ సిద్ధాంతానికి ఊపిరి పోశారు. దేశ ఆర్థిక రాజధానిగా ఉన్న ముంబైలో మరాఠాయేతరుల సంఖ్య పెరుగుతోందని గుర్తించిన థాక్రే తన వారపత్రిక మార్మిక్ ద్వారా మహరాష్ట్ర ప్రజల్లో చైతన్యం తీసుకొని రావడానికి విశేష కృషి చేశారు. ఆ తరువాత 1966లో శివసేన పార్టీని స్థాపించారు. మారాఠీల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా శివసేనను థాక్రే తీర్చిదిద్దారు. దీంతో ముంబైలోని మరాఠీలు పెద్దయెత్తున థాక్రే భావజాలానికి దాసోహమన్నారు. ఇదే ఊపులో థాక్రే మరాఠీ భాషలో శివసేన అధికార పత్రికగా సామ్నాను ప్రారంభించారు. సామ్నాలో థాక్రే వ్యక్తం చేసే అభిప్రాయాలు ఒక్కోసారి దేశ రాజకీయాల్లోనూ సంచలనం సృష్టించేవి. సామ్నాలో థాక్రే సంపాదకీయాలు తరుచూ మహరాష్ట్రలోని దినపత్రికల పతాక శీర్షికలు అయ్యేవి. 1993 అల్లర్ల తరువాత శివసేన హిందుత్వ వైఖరిని స్వీకరించింది. శివసేన అధ్యక్షుడిగా తప్ప మరే రాజకీయ పదవిని ఆశించని బాల్ థాక్రే మృతి చెందినప్పుడు మరాఠా నేల కన్నీరు మున్నీరుగా విలపించింది. థాక్రే అంతిమయాత్రలో లక్షలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. మరాఠా భూమిపై శివాజీ తరువాత అంత ప్రజాదరణ పొందిన నేతగా థాక్రే ప్రసిద్ధి పొందారు.

# 'బేటీ బచావో'కు అరకొర నిధులు

ఆడపిల్లలను శ్రీమహాలక్ష్మిగా భావించే వారున్నట్టే, గుండెల మీద కుంపటిగా ఆందోళన చెందేవారు మన సమాజంలో ఆది నుంచి ఉన్నారు. అయితే,నాగరికత ప్రభావమో,ఆర్థిక వ్యత్యాసాల కారణమో తెలియదు కానీ, ఇప్పుడు రెండో వర్గం వారి సంఖ్య నానాటికీ పెరిగి పోతోంది. లింగ వివక్ష అనేది కుటుంబంనుంచే ప్రారంభం అవుతోంది. కుమార్తె లు,కుమారుల మధ్య తేడా చూపే తల్లితండ్రులు ఇప్పటికీ ఉన్నారు. వరకట్నం, లింగ పరమైన వివక్షవంటి సామాజిక రుగ్మతలు ఇప్పటికీ సాగుతున్నాయి. దాంతో ఆడపిల్ల పుట్టబోతోందన్న విషయం ఆధునిక వైద్యవిధానాల ద్వారా ముందే తెలుసుకుని గర్భస్రావాల కోసం క్యూకడుతు న్నారు.దీంతో మగ,ఆడ పిల్లల మధ్య నిష్పత్తి బాగా పడిపోతోంది. ఈ రుగ్మతను తొలగించడానికి భ్రూణ హత్యలకు వ్యతిరేకం గా,బాలికా విద్యకు అనుకూలంగా ఉద్యమ స్థాయిలో ప్రచారాన్ని నిర్వహించేందుకు 2015లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ బేటీ బచా వో బేడీ పఢావో కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.ఆయన అధికారంలోకి రాగానే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సామాజిక రుగ్మతలను తొలగించే కార్యక్రమాలను కూడా ప్రవేశపెట్టారు. పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని రక్షణ రంగానికి అవసరమైన ఆయుధాలూ, విడిభాగాల దిగుమతుల భారంతగ్గించేందుకు మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టే భూమి మీద పడకుండానే తల్లి గర్భంలో అంతమై పోతున్న ఆడపిల్లలను కాపాడుకునేందుకు,వారి విద్యావికాసానికి బేటీ బచావో,బేటీ పఢావో కార్యక్రమాన్ని 2015 జనవరి 22వ తేదీన ప్రారంభించారు. ఈ నాల్గేళ్ళలో భ్రూణ హత్యలు,ఆడపిల్లలు వేధింపులు తగ్గాయా అంటే లేదనే సమాధానం వస్తుంది.ఈ కార్యక్రమానికి ఇంతవరకూ కేంద్రం కేటాయించిన నిధుల్లో 56 శాతం మీడియాలో ప్రచారానికే ఖర్చు అయినట్టుఇటీవల లోక్‌సభలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధా నంగా ప్రభుత్వం గణాంకాలను సభకు సమర్పించింది. ఈ కార్యక్రమానికి ప్రచారం అవసరమన్న మాటనిజమే అయినా, కేవలం మీడియా ద్వారా ప్రచారం ద్వారానే ఈ రుగ్మత తొలగిపోతుందనుకుంటే పొరపాటు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయిల వరకూ కార్యకర్తలను నియోగించి వారిచేత ఇంటింటా ప్రచారం జరిపించాల్సిన కార్యక్రమం ఇది .ప్రజలను జాగృతం చేయడానికి కేవలం ప్రసార,ప్రచార మార్గాలనే ఎంచుకోవడం వల్ల ప్రయోజనం ఉండదు. సభలూ,సమావేశాల తోపాటు సమన్వయకర్తలను నియ మించి ప్రచారం జరిపించాల్సిన అవసరం ఉంది.ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలు ఇంకా తొలగలే దు.అలాగే,లింగ వివక్ష కూడా గ్రామాల్లోనే అధికంగా కనిపిస్తోంది.నగరాలు, పట్టణాల్లో చైతన్యం ఎక్కువ కనుక, ఆడపిల్లలు చదువులపైనా, ముఖ్యంగా, వృత్తి విద్యాకోర్సులపై శ్రద్ధ చూపుతున్నారు. ఇందుకు వారికి అవకాశాలు నగరాల్లో మాత్రమే లభిస్తున్నా యి. బేటీబచావో కార్యక్రమాన్ని తొలి దశలో వంద జిల్లాల్లో ప్రారంభించారు.ఈ వంద జిల్లాల్లో ఆడ,మగ పిల్లల నిష్పత్తిలో ఎక్కువ అంతరం ఉండటం వల్ల వీటిని ఎంపికచేశారు. మగపిల్ల వాడు చదుకుంటే అతడికిఒక్కడికే ప్రయోజనమనీ, ఆడపిల్ల విద్యావంతురాలైతే మొత్తం సమాజానికే ప్రయోజన కరమని భావించే వారు ఇప్పటికీ ఉన్నారు. బాలికల విద్య కోసం కందుకూరి వీరేశలింగం పంతులు గారు,సావిత్రి బాయ్ పూలే వంటి సంఘ సంస్కర్తలు వందల ఏళ్ళ క్రితమే కృషి చేశా రు.పేదరికం కారణంగా ఆడ పిల్లలను బడులకు పంపేందుకు విముఖత చూపే తల్లి తండ్రులు ఇప్పటికీ ఉన్నారు. అలాగే,బాల్యం నుంచి ఆడపిల్లలను ఇంట్లో పనుల కోసమే వినియోగించే తల్లి తండ్రులు కూడా ఉన్నారు. పుట్టింటి వారికి ఆడపిల్ల అందించే సేవలు విలువ కట్టలేనివి. ఇంట్లో పనులు మాత్రమే కాకుండా, ఉద్యోగాలు చేసి పైసా పొల్లు పోకుండా ఇంటి ఖర్చులకు వెచ్చించే ఆడపిల్లలు ఎంతో మంది ఉన్నారు. ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయడం కష్టమని భావించేవారున్నట్టే, వారి సంపాదన మీద ఆధారపడే తల్లి తండ్రులు కూడా ఉన్నారు. నగరాల్లో,పట్టణాల్లో మహిళా సంఘాలు నిర్వహిం చే ర్యాలీలు, ప్రదర్శనల కారణంగా బాలికలు,యువతులలో చైతన్యం పెరుగుతోంది .ప్రభుత్వం కల్పించే ఉచిత విద్యను వారు సద్వినియోగం చేసుకుంటున్నారు. బ్యాంకులు,ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. భ్రూణ హత్యలకు తల్లి తండ్రులు ఇప్పుడిప్పుడే ఈ దురాచారం మంచిది కాదనీ, పిల్లలు ఆడైనా, మగైనా ఒకటేనన్న వాస్తవాన్ని తెలుసుకుం టున్నారు.భ్రూణ హత్యలు తగ్గు ముఖం పట్టేందుకు మహిళా సంఘాలునిర్వహిస్తున్నపాత్రను తక్కువ అంచనా వేయ లేం. అలాగే,నిరంతర వార్తా స్రవంతుల ద్వారా భ్రూణ హత్య లు, ఆడపిల్లల వేధింపులు, గృహ హింసలు,లైంగిక అత్యాచా రాల వంటి సమాచారం.

క్షణాల్లో మారుమూల ప్రాంతాలకు చేరుతోంది.ప్రభుత్వం ప్రవే శపెట్టిన పథకం ద్వారా కన్నా సామాజిక చైతన్యం ద్వారానే సత్ఫలితాలు లభిస్తున్నాయి. బేటీ బచావ్ కార్యక్రమానికి కేటాయించిన నిధులు 644 కోట్ల రూపాయిలు మాత్రమే. ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగే సభలూ,సమావే శాలకూ,మంత్రులు,ఇతర విఐపీల విదేశీ యాత్రలకు చేస్తున్న ఖర్చుతో పోలిస్తే ఈ నిధులు ఏమూలకూ రావు.అందువల్ల ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా త్రికరణ శుద్ధిగా అమలు జేసేందుకు మరిన్ని నిధులను కేటాయించాల్సిన అవసరం ఎంతైనాఉంది.

# అగ్రవర్ణాలపై వల!

**రిజర్వేషన్లు మానవీయ,సామాజిక. కోణాల నుంచి చూడవలసిన అంశం. రాజ్యాంగం ప్రకారం విద్యా, ఉద్యోగ రంగాలలో ప్రాతినిథ్యం లేని కులాలకు, సామాజికంగా వెనుకబడినతనం ప్రతిపాదికగా రిజర్వేషన్లు కల్పించాలి. వివిధ కమిషన్లు కుడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. సాంఘిక వెనకబాటు తనాన్ని ప్రతిపాదికగా తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం, పలు హైకోర్టులు తీర్పులిచ్చాయి. సామాజికవెనుకబడినవారికి, నిరక్షరాస్యలకు, విద్యారంగంలో వెనుకబడినవారికి, కుల వివక్షకు గురౌతున్నవారికి రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. సామాజికవేత్తల అభిప్రాయం ఇదే.**

అగ్రకులాలలోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటు ఉభయసభల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదించారు. కేంద్ర నిర్ణయం రిజర్వేషన్ల సిద్ధాంతానికి వ్యతిరేకం. రిజర్వేషన్ల కు ప్రాతిపదిక సామాజిక వెనకబాటుతనమే తప్ప ఆర్థిక ప్రతిపాదిక కాదు. రిజర్వేషన్లు పేదరిక నిర్మూలనం పథకం కాదు. అగ్రకులాలకు రిజర్వేషన్లు అనేది రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధం. సామాజిక వివక్షతకు గురవుతున్న కులాలకు అధికారం ఇచ్చి సామాజిక హెూదా పెంచాలనే లక్ష్యంతో ప్రవేశ పెట్టిన రిజర్వేషన్లు నేడు రాజకీయ నాయకుల చేతిలో గురి తప్పాయి.. రాజకీయ నాయకులు ఓట్ల కోసం వాడుకునే సాధనంగా దిగజారింది. పైగా ఇది సిద్ధాంత బలంతో పోరాడే బి.జె.పి లాంటి జాతీయ పార్టీ తన మౌలిక విలువలకు తిలోదకాలు ఇచ్చి సున్నితమైన అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తోంది. ఎందుకంటే,ఇప్పుడు కేంద్రంలో కానీ, రాష్ట్రా ల్లో కానీ అసలు ఉద్యోగాల రిక్రూట్ మెంట్ లేదు. 14 లక్షల ఖాళీలు ఉన్న భర్తీ చేయడం లేదు. ఇంకో కోణం నుంచి చూస్తే ఇది రిజర్వేషన్లు మౌలిక సిద్ధాంతం విరుద్ధమైన అంశం. వీటివల్ల ''ప్రతిభకు'' అన్యాయం జరుగుతుంది. రిజర్వేషన్లకు ఒక ప్రతిపాదిక అంటూ లేకుండా పోతుంది. సమాజంలో అసంతృప్తి గురవుతున్న వర్గాలకు ఎర వేయడం ప్రభుత్వానికి ఉండ వలసిన లక్షణం కాదు. సిద్ధాంతాల ప్రతిపాదిక కార్యక్రమాలు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీలకు రిజర్వేషన్లు పెట్టడానికి సిద్ధాంతపరమైన పునాది ఉంది. కుల వ్యవస్థతో ముడిపడి ఉన్న మన భారతీయ సమాజం లో మొదట కులాన్ని నిర్మూలించడానికి ఎలాంటి నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు జరగలేదు. కనీసం కులాల మధ్య ఉన్న అంతరాలు నిర్మూలించడానికి చర్యలు తీసుకోలేదు. కులం నిర్మూలించి ఆ తర్వాత కుల వ్యవస్థతో వచ్చిన అసమానతలను రూపు మాపి అందరికీ ప్రతిభ అభివృ ద్ధితో కూడిన సమాన అవకాశాలు కల్పించి అవసర మైన ఆర్థిక సామాజిక మార్పును తీసుకు రావడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 71 సంవత్సరాల కాలంలో ఘోరంగా విఫలమయ్యాయి.

అగ్రకులాల్లో పేదలకు ఈ పది శాతం రిజర్వేషన్లు సరిపోతాయా? ఈ రిజర్వేషన్లతో ఎంతమంది ఉద్యోగాలు వస్తాయి. సమాజంలో వివక్షతకు,గురవుతున్న కులాలకు ఉద్యోగాల లభ్యతకు రిజర్వేషన్లు కల్పించి తద్వారా అధికారంలో స్థానం కల్పించి ఈ కులాల సాంఘిక హెూదా పెంచాలనేదే రిజర్వేషన్ల ప్రధానలక్ష్యం. రిజర్వేషన్ల ద్వారా ఉన్నత స్థాయి ఉద్యోగాలలో చేరితే ఈ వర్గాల సాంఘిక హెూదా పెరుగుతుంది. మన సమాజం లో ఒకవ్యక్తిని తక్కవ కులం వారనే దృష్టితో తక్కువ చూపు చూస్తారే తప్ప, ఆర్థిక ప్రతిపాదికగాచూడరు. బి.సి కులాల్లోని చాకలి, మంగలి, వడ్డెర, కురుమ, బుడు బుక్కల, దాసరి, మేదరి, గొల్ల, కుమ్మరి తదితర కులాలవారినీ, ఎస్సీలమాదిరిగానే చిన్న చూపు చూస్తారు. వారికీ సాంఘీక హెూదా, గౌరవం ఇవ్వరు. అదే అగ్రకులాలో పేదవారు ఉన్న వారికి దొర, పటేల్, పంతులు అంటూ గౌరవంగా పిలుస్తారు. గ్రామాలలో గౌరవంగా చూస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో సాంఘి .క వ్యత్యాసాలు పోవాలంటే పేదకులాలకు హెూదా, పదవులు ఇవ్వాలి. ఉన్నత అధికార పదవుల ద్వారా అధికారంలోకి వస్తే పేద కులాల సాంఘిక హెూదా పెరుగుతుంది. దళిత కులాల వారు ఉన్నత ఉద్యోగాలలో చేరినప్పుడు మాత్రమే వారి సాంఘీక హెూదా పెరుగుతుంది. ఈ కులాల వారు ఒక కలెక్టర్ గానో, డిప్యూటీ కలెక్టర్ గానో, ఒక ప్రొఫెసర్ గానో ఉన్నత ఉద్యోగాలలో ఎంపికైనప్పుడు వారు అగ్ర కులాల వారితో సమానంగా వేదిక లె క్కిస్తారు.. గౌరవం ఇస్తారు. తమ ఇళ్ళకు ఆహ్వానిస్తా రు.మర్యాదలు చేస్తారు. అధికారానికి, సాంఘీకహెూదాకు అవినాభావ సంబంధం ఉంది. పేద కులాల సాంఘిక హెూదా, గౌరవం పెరగాలంటే వారికి ఉన్నత ఉద్యోగాలు కల్పించాలి . ఉన్నత ఉద్యోగాలలో చేరాలంటే రిజర్వేషన్లు కావాలి. అందుకే పేద కులాలకు రిజర్వేషన్లు పెట్టారు. పైగా మన సమాజంలో ''ఆర్థికస్థితి'' శాశ్వతం కాదు. ''కులం'' శాశ్వతం. ఈ రోజు పేద వారు రేపు కోటిశ్వరులు కావచ్చు, కాని తక్కువ కులం వారు అగ్రవర్ణం వారు కాలేరు. అలాగే, అగ్ర వర్ణాల వారు తక్కువ కులం వారుగా మారరు. ఇది ఒక వాస్తవికమైన తాత్విక విధానం. ఘనీభవించిన సత్యం. అగ్ర కులాలకు ఉద్యోగాలలో వారి జనాభాకు మించి 5 నుంచి 6 రెట్ల వరకు ప్రాతినిథ్యం కల్పించి చినట్టు ప్రభుత్వ గణాంకా వివరాలే తెలుపుతున్నాయి. మండల్ కమీషన్ నివేదిక ప్రకారం బి.సిలకు గ్రేడ్ 1 స్థాయి ఉద్యోగాలలో 1994 వరకు 2 శాతం




దాటలేదు. గ్రేడు 2 స్థాయి ఉద్యోగాలలో 4 శాతం దాటలేదు. అంటే 54 శాతం జనాభా గల బి.సిలకు ఇంత తక్కువ ప్రాతినిథ్యం ఉండడం చూస్తే ఎంత అన్యాయం జరిగిందో స్పష్టంగా తెలుస్తుంది. అలాగే దేశ జనాభాలో మైనార్టీలు పోగా అగ్ర కులాల వారు 15 శాతం మాత్రమే ఉంటారు. ప్రభుత్వం నియమించిన మండల్ కమీషన్ కాక కాలేల్కర్ కమీషన్ రిపోర్టుల ప్రకారం గ్రేడ్ ఉద్యోగాలలో 1980 నాటికీ 89 శాతం ఉండగా 1994 నాటికి వీరి ప్రాతినిథ్యం 80 కు తగ్గింది. ఇక ఉన్నత స్థాయి అధి కార పదవులలో మొత్తం 29 గవర్నర్ పదవులు, 21 వాణిజ్య బ్యాంక్ చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్ల పదవులన్నీ 100 శాతం అగ్ర కులాలకు దార దత్తం చేయబడినవి. ప్రధాన మంత్రి కార్యాలయం, కేంద్ర ప్రభు త్వ కార్యదర్శులు 98 శాతం అగ్రకు లాలకే రిజర్వు కాబడి ఉన్నవి. ఇతర ఉన్నత స్థాయి అధికార పోస్టులలో 80 శాతం పోస్టులలో అగ్రకులా వారే ఉన్నారు. ఇక న్యాయ వ్యవస్థ లో ముఖ్యంగా సుప్రీంకోర్టు హైకోర్టు జడ్జీలలో బి.సిల ప్రాతిని థ్యం 2 శాతం దాటడం లేదు. సుప్రీంకోర్టు లో 33 ఉండగా మొత్తం అందరు అగ్ర కులాల వారే ! దేశంలోని మొత్తం 749 హైకోర్టు జడ్జీల పదవులలో 39 బి.సిలు, 18 ఎస్.సి, 5 ఎస్.టి లు పోగా మిగతా 687 జడ్జీలు ఉన్నత కులాల వారే ఉన్నారు. ఇక ప్రభు త్వం వ్యవస్థలో భాగమైన మంత్రి వర్గ వ్యవస్థలో ఇంతవరకు కేంద్ర క్యాబినెట్లలో 70 శాతం మంత్రి పదవులు అగ్రకులా లవారే అయ్యారు. అలాగే ముఖ్య మంత్రి పదవులు, చైర్మన్ పదవులు అన్ని అగ్రకులాలకే రిజర్వు చేయబడినవి.ఇలా న్యాయవ్యవస్థ రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థలో 80 శాతం పదవులు అగ్రకులాల వారే పొందారు. పొందుతున్నారు. 15 శాతం జనాభా ఉంది 80 శాతం పదవులు పొందుతున్నారు. 15 శాతం జనాభా ఉండి 80 శాతం పదవులు పొందుతున్న అగ్రకులాల వారికే రిజర్వేషన్లు ఇవ్వడంలో ఉన్న శాస్త్రీయత ఏమిటి? హేతుబద్దత ఏమిటి ? ఇది చరిత్రను వక్రికరించడమే ! నిజాన్ని నిలువునా పాతర పెట్టడమే అవుతుంది. ఇటివల జరిపిన ఒక సర్వేలో ప్రైవేటు రంగంలోని ఎక్జుక్యుటివ్ ఉద్యోగాలలో 95 శాతంఉద్యోగాలు అగ్రకులాలు ఉన్నట్లు తెలింది. 15 శాతం జనాభా గల అగ్రకులాల వారికి ప్రైవేటు రంగంలో 95 శాతం, ప్రభుత్వ రంగంలో 64 శాతం ఉద్యోగాలుఉంటే ఇంకా వీరికి రిజర్వే షన్లు పెట్టడంలోని ఔచిత్యమేమిటి ?ఇక అసలు విషయానికి వస్తే ఈ దేశ సంపద, పరిశ్రమలు, డబ్బు, వ్యాపార, వాణిజ్య, కాంట్రాక్టులు అధికారం 15 శాతం జనాభా ఉన్న అగ్రకులాల చేతుల్లో 90 శాతం రిజర్వేఅయ్యి ఉంది. మరి వీటిని కూడా అన్ని కులాల జనాభా ప్రకారం రిజర్వ్ చేస్తే మన దేశంలో మన దేశంలో ప్రజలందరి ఆకలి, పేదరికం, నుంచి విముక్తులు అవుతారు కదా. వీటిని కుడా అన్ని సామాజిక గ్రూపులకు ఎందుకు విభజించరు.? ఇంకొక వైపు వైపు కేంద్ర ప్రభుత్వం బీసీ కులాల అభివృద్ధికి 71 సంవత్సరాల వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజ్యాంగబద్ధమైన మండల్ కమిషన్ సిఫార్సులను 13 సంవత్సరాల సంవత్సరాలు చెత్త బుట్టలో వేశారు. చివరకు ఎన్ని అవాంతరాలు, అవరోధాలు, పోరాటాల తర్వాత 1993 నుంచి ప్రారంభమయ్యాయి. 56 శాతం జనాభా కలిగిన బి.సిలకు ఉన్నత ఉద్యోగాలలో ఈ నాటికి 14 శాతం దాటలేదు. జిల్లా కలెక్టర్ల లో ఏ ఒక్క బీసీ కనిపించరు. అలాగేజిల్లా పోలీస్‌సూపరింటెండెంట్. ప్రభుత్వ కార్యదర్శిగానో, అతి తక్కువగా కనిపిస్తారు. ఇంత అన్యాయానికి గురైన వారి గురించి బిజెపి పార్టీ నాయకులకు కనిపించదు.అంతేకాదు బీసీలకు ఇంతవరకు అన్యాయం జరిగిన రంగాలలో వాటా కావాలి. బీసీలకు ఏ రంగంలో న్యాయం జరిగింది. ఏ రంగం చరిత్ర చెప్పిన అన్యాయాల చిట్టా కనిపి స్తుంది. స్వాతంత్రం లభించి 71 సంవత్సరాలు నడుస్తున్న 54 శాతం జనాభా ఉన్న బీసీలకు రాజకీయ రంగాల్లో 12ం ప్రాతినిధ్యం లేదు. దేశంలోని 2600 బీసీ కులాల్లో 2550 బిసి కులాల వారు ఇంత వరకు అసెంబ్లీ పార్లమెంటులో అడుగు పెట్టలేదు. దేశంలోని 29 రాష్ట్రాలలో 16 రాష్ట్రాలకు ఇంత వరకు పార్లమెంటులో ప్రాతినిధ్యం లేదు. అలాగే 29 గవర్నర్ పదవులలో ఒక్క గవర్నర్ పదవి కూడా బీసీలకు ఇవ్వలేదు. 245 ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ పదవులలో, 21 జాతీయ బ్యాంకుల చైర్మన్ పదవులలో బీసీలకు ఇవ్వలేదు. ఇలా రాజకీయ పదవులలో బీసీలకు తరతరాలుగా అన్యాయం జరుగుతుంది. మెజారిటీ ప్రజలు ఉన్నప్పటికీ ఇంతవరకు ప్రధానమంత్రి పదవి ఒక్క మోడీ తప్ప భారత రాష్ట్ర పతి, ఉపరాష్ట్రపతి, స్పీకర్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి లాంటి పదవులు బి.సిలకు అవకాశం ఇవ్వలేదు. ఇలా అన్ని రాజకీయ అధికార పదవులలో 50 కోటా ఇవ్వవలసిన అవసరాన్ని ఈ రోజు బి.జె.పి పరోక్షంగా బీసీలకు గుర్తు చేస్తోంది.



**ఆర్.కృష్ణయ్య,**
**జాతీయ బి.సి సంక్షేమ సంఘం**

# మోడీకి ఈసారి పరీక్షే!



గత 3 దశాబ్దాల భారత ఎన్నికల చరిత్ర ఎంత కాదన్నా కొన్ని సుస్పష్టమైన వాస్తవాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సంకీర్ణ రాజకీయాలకు మరింత పదును పెట్టే ప్రయత్నాల్లో పడ్డారు. 2019 లోక్ సభ ఎన్నికలు 2014ఎన్నికల మాదిరి నల్లేరు మీద నడక కాదని స్పష్టమైన తర్వాత నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు.ఏ ప్రాతిపదికన ఈ చర్యలు ఉంటాయో అర్థంచేసుకోవాలంటే కొంత చరిత్రను పునః పరిశీలించాల్సిందే.2014 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 543 లోక్‌సభ స్థానాల కుగాను 10 హిందీ రాష్ట్రాలు యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్త రాఖండ్, ఢిల్లీ, జార్ఖండ్‌లలో పక్కనే ఉన్న పంజాబ్, జమ్మూ కాశ్మీర్, రాష్ట్రాలు, చండీఘడ్‌లలోని మొత్తం 245 స్థానాల కుగాను బీజేపీ 196 స్థానాలు గెలిచింది. దేశంలోని 22 కోట్ల జనాభా గల యూపీలోని 80 స్థానాలకు గాను బీజేపీ 71, మిత్రపక్షాలు అప్నాదల్ 2, మొత్తం 73 లోక్‌సభ పీట్లు గెలువగా కాంగ్రెస్‌కు 2సమాజ్‌వాదీ పార్టీకి 5 స్థానాలు మాత్రమే వచ్చాయి. మాయావతి బీఎస్పీకి ఒక్కసీటు రాలేదు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంకోల్పోయిన మధ్యప్రదేశ్ (29), రాజస్థాన్ 25, చత్తీస్‌గఢ్ 11, కలిపి మొత్తం 65 స్థానాలు కాగా కమలం పార్టీ 62 స్థానాలు గెలిచింది. పశ్చిమభారతంలోని 78 లోక్‌సభ లోక్‌సభ స్థానాలకు బీజేపీ సొంతంగా గుజరాత్‌లోని మొత్తం 26 లోక్‌సభ స్థానాలను, మహారాష్ట్రలోని 48కి గాను 23 సొంతంగా మిత్రపక్షం శివసేన, 18 స్థానాలు గెలువగా... గోవా 2 ఎంపీ స్థానాలతో కలిపి మొత్తం 72 గెలువగలిగింది. కర్ణాటకలోని 28 లోక్‌సభ స్థానాలకు గాను 2014 ఎన్నికల్లో బీజేపీ 17 కాంగ్రెస్ 9, జేడీఎస్ 2 గెలిచాయి.నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు చేసిన వాగ్దానాలు అమలులో, గ్రామీణ దుస్థితిని, సేద్యపురంగు సంక్షోభాన్ని, నిరుద్యోగాన్ని కల్పించడంలో ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమైనందున రైతులు, నిరుపేదలు, కార్మికులు, యువతలో తీవ్ర అసంతృప్తిపె రుగుతోంది. మోడీ తీసుకున్న పెద్దనోట్ల రద్దు వల్ల అసంఘటిత రంగంలో లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. నోట్ల మార్పిడికి బ్యాంకుల ముందు వరుసల్లో నిలబడి తిరుగుబాటు, అలసటతో 120 మంది వృద్ధులు దుర్మరణం చెందారు. ఆపై తగిన ఏర్పాట్లు చేయకుండా 28 శాతం వరకు భారీ శ్లాబులతో జీఎస్టీ పన్ను విధానాన్ని దేశమంతటా ప్రవేశపెట్టడం వల్ల చిన్న వ్యాపారులు చితికిపోయారు. 2018లోనే కోటి 10 లక్షల మంది ఉపాధి కోల్పోయినట్లు, పారిశ్రామికోత్పత్తి మందగించినట్లు గణాంకాలు ఘోషిస్తున్నాయి. ఇదికాక దేశరక్షణకు కీలకమైన రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుతో ప్రధాని మోడీ అనిల్ అంబానికి కాంట్రాక్టు ఇప్పించి ఆశ్రిత పెట్టుబడిదారి విధానానికి, అవినీతికి పాల్పడినట్లు పార్లమెంటు లోపలా, బయటా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ పూర్వ రంగంలో వచ్చే ఏప్రిల్-మేలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో జాతీయపార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు సొంతంగా మెజారిటీ సాధించే పరిస్థితి లేదని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ గతంలో గెలిచిన స్థానాల్లో దాదాపు 70 శాతం సీట్లు కోల్పోనుందని సర్వేలలో తెలిసింది. ముఖ్యంగా యూపీలోని 80 స్థానాలకుగాను బీజేపీ 38, సమాజ్‌వాదీ పార్టీ 38 అజిత్‌సింగ్ రాష్ట్రీయ లోక్‌దళ్ 32 స్థానాలకు కూటమిగా పోటీ చేయనుండగా2 స్థానాలు కాంగ్రెస్‌కు వదిలారు. మొత్తం 80 స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను నిలిపినా 25 స్థానాల్లోనే ప్రభావం చూపే పరిస్థితిలో ఉంది.అందువల్ల వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 120 నుంచి, కాంగ్రెస్ 100, మిత్రపక్షాలు కలిపిన 300 స్థానాలు దాటకపోవచ్చు. అంటే ప్రాంతీయ పార్టీలు దాదాపు 250 స్థానాలు సాధించే అవకాశముంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ 34, ఒరిస్సాలో బిజు జనతాదళ్ 20 స్థానాలు, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం15, తెలంగాణాలో టీఆర్ఎస్ 11, తమిళనాడులో39 స్థానాలకు గాను జయ జీవించి ఉన్నపుడు అధికార అన్నాడీఎంకె 37 స్థానాలు, కేరళ 20 స్థానాలకు గాను యుడిఎఫ్ 12, ఎల్‌డీఎస్ -8 గెలిచాయి. అస్సాంలోని 14 లోక్‌సభ స్థానాలకు నాగు బీజేపీ 7, కాంగ్రెస్ 3 గెలిచాయి. ఈ సారి మిత్రపక్షం అస్సాంలో 3 పరిషత్ బిజీపీకి దూరమైంది. ఈ పూర్వరంగంలో బిజేపీ నానాటికీ జనాధరణ కోల్పోతున్నా అందుకు దీటుగా కాంగ్రెస్ బలపడలేకపోతుంది. బీజేపీ 100కి పైగా గెలిచిన స్థానాలు కోల్పోవడం ఖాయమంటున్నారు. 1989 నుంచి జనవరి 8 లోకసభ ఎన్నికలకు గాను 1992, 2004, 2009 లో కాంగ్రెస్ నేతృత్వాన, 1999, 2014లో బీజేపీ సారాథ్యంలో కాంగ్రెస్‌లో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడ్డా యి. ఈ అన్ని సందర్భాల్లో బీజేపీ, కాంగ్రెస్ రెండింటికీ కలిపి 300 స్థానాలు వచ్చాయి. 1989లో కాంగ్రెస్ కు 197, బీజేపీ కి 85, మొత్తం 282, 1991లో కాంగ్రెస్‌కు 232, బీజేపీకి 120మొత్తం 352, 1996లో కాంగ్రెస్‌కు 140, బీజేపీకి 161 మొత్తం 301, 1998లో కాంగ్రెస్‌కు 141, బీజేపీకి 161, 302,1999లో కాంగ్రెస్‌కు 114, బీజేపీకి 182 మొత్తం 296, 2004లో కాంగ్రెస్‌కు 145, బీజేపీకి 138 మొత్తం 283, 2009లో కాంగ్రెస్‌కు 206, బీజేపీకి 116 మొత్తం 322, 2014లో బీజేపీకి 282 , కాంగ్రెస్‌కు 44 మొత్తం 326 లభించాయి. అందువల్ల కాంగ్రెస్ ఈ సారి తన పరిస్థతిని మెరుగుపరుచుకోవడానికి మిత్రపక్షాలతో పొత్తులకు ప్రాధాన్యమిస్తోంది. బీజేపీ కూడా ఇప్పుడు తత్వంభోధపకి కొత్త మిత్రులకు ఆశలు పెడుతూ గాలం వేస్తుంది.యూపిలో 80, బీహార్‌లో 40, మహారాష్ట్రలో 48, ప. బెంగాల్‌లో 42, తమిళనాడులో 39 స్థానాలున్నందున అక్కడ గెలిచే పార్టీలు, సాధించే సీట్లను బట్టే, బీజేపీ, కాంగ్రెస్ ఏది ఎక్కువ సీట్లు గెలిచి మిత్రపక్షాలను ఆకర్షిస్తుందనే అంశమే కీలకం కానుంది. దూరమవుతున్న దళితులను బుజ్జగించుకునే, అగ్ర వర్ణాలను నిలుపుకోవడానికి 10 శాతం ఈబీసీ రిజర్వేషన్లు కల్పించింది. తెలంగాణ తరహాలో రైతులకు ఆదాయ కల్పనతో పాటు వచ్చే 5 ఏళ్లలో ఆదాయం రెట్టింపు కోసం వచ్చే బడ్జెట్‌లో మరెన్నో రాయితీలు కల్పించడం, మధ్యతరగతి వర్గాలను ఆకట్టుకోవడానికి ఆదాయ పన్ను పరిమితిని రూ. 8.5లక్షలకు పెంచే యత్నాలు చేయనున్నారు. బీహార్‌లో 18 శాతం, మధ్య ప్రదేశ్‌లో 22 శాతం, యూపీలో 25 శాతం, ఢిల్లీలో 50 శాతం, రజాస్తాన్‌లో 23 శాతం, జార్ఖండ్‌లో 20 శాతం, హరియాణలో 40 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 12 శాతం, అసోంలో 35 శాతం, గుజరాత్‌లో 30 శాతం, కర్నాటకలో20 శాతం, కేరళలో 30 శాతం, మహారాష్ట్రలో 30, ఒరిస్సాలో 20, పశ్చిమబెంగాల్, పంజాబ్‌లో 48 శాతం, తమిళనాడులో 10 శాతం అగ్రవర్గాల వారున్నారు. వీరు గతంలో కాంగ్రెస్‌కు, ఇటీవలి సంవత్సరాలలో బీజేపీకి ఎక్కువగా ఓటేస్తున్నారు. అందువల్ల 10 శాతం ఈబీసీ రిజర్వేషన్లు వారికి పరిమిత ప్రయోజనమేనంటున్నారు.

పతకమూరు దామోదర ప్రసాద్
సీనియర్ జర్నలిస్ట్, 9440990381



# ట్యాంపర్.. టెంపర్..



## ఈవీఎం రిగ్గింగ్‌పై రాజకీయ దుమారం

◆ సైబర్ నిపుణుడు షుజా ఆరోపణలతో ప్రకంపనలు ◆ షుజాపై ఢిల్లీ పోలీసులకు ఈసీ ఫిర్యాదు.. ఎఫ్ఐఆర్ నమోదు ◆ కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ బీజేపీ ఎదురుదాడి ◆ నిజాలు నిగ్గుతేల్చాలని కపిల్ సిబల్ డిమాండ్

**న్యూఢిల్లీ:** ఎన్నికల యంత్రాలు (ఈవీఎం) మరోసారి రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. కోల్‌కతా వేదికగా విపక్షాలన్నీ ఈవీఎంలకు వ్యతిరేకంగా నినదించిన నేపథ్యంలో, భారతీయ సైబర్ నిపుణుడిగా చెప్పబడుతున్న సయ్యద్ షుజా చేసిన రిగ్గింగ్ వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న దశలో అతను చేసిన ఆరోపణలు సంచలనం కలిగిస్తున్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను బీజేపీ హ్యాక్ చేసిందని, భారత ఎన్నికల సంఘం వాడే మిషిన్లను ట్యాంపరింగ్ చేయడం సాధ్యమేనంటూ అతను తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. తన ఆరోపణలకు నిర్దిష్ట ఆధారాలు చూపక పోయినప్పటికీ, తన వాదనకు బలం చేకూర్చేలా ఉదరహించిన కొన్ని సంఘటనలు ఆసక్తికరంగా మారాయి. లండన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ వివరాలను వెల్లడించడం, ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుకు కపిల్‌సిబల్ హాజరవడం రాజకీయంగా విస్తృత చర్చకు, విమర్శ, ప్రతివిమర్శలకు దారితీసింది. సైన్స్ ఫిక్షన్‌ను తలపిస్తున్న ఈవీఎం రిగ్గింగ్ వ్యవహారాన్ని నిగ్గుతేల్చాలని సిబల్ వాదిస్తుంటే, ప్రజాస్వామ్యం పరువును, ఈసీ విశ్వసనీయతను అప్రదిష్టపాల్జేసేందుకు కాంగ్రెస్ పన్నిన కుట్రగా పేర్కొంటూ బీజేపీ ఎదురుదాడికి దిగింది. మరోవైపు షుజా తీవ్ర వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తంచేసింది. అతనిపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేయాలని కోరింది. మనం వాడే ఈవీఎంలు రిగ్గింగ్ (హ్యాకింగ్)కు సాధ్యంకానివని పునరుద్ఘాటించింది.

### ఈసీ సీరియస్.. ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను (ఈవీఎం) రిగ్గింగ్ చేశారంటూ అమెరికాలోని భారత సైబర్ నిపుణుడు సయ్యద్ షుజా చేసిన సంచలన ఆరోపణలపై ఎన్నికల కమిషన్ సీరియస్‌గా స్పందించింది. అతనిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి విచారణ జరపాలంటూ మంగళవారం పోలీసులకు లేఖ రాసింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, భారత్‌లో ఎన్నికల సంఘం వాడుతున్న ఈవీఎంలను హ్యాకింగ్ చేయవచ్చని, దీన్ని తాను నిరూపిస్తానని సోమవారం లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో షుజా ఆరోపించాడు. అంతేకాకుండా మిలటరీ ఉపయోగించే మాడ్యులర్స్‌ను దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో అమర్చి, కాంగ్రెస్ గెలవాల్సిన 200 సీట్లను రిగ్గింగ్ ద్వారా బీజేపీ కైవసం చేసుకున్నదని అతను సంచలన ప్రకటన చేశాడు. అయితే దీనికి సంబంధించిన ఆధారాలను అతను బయటపెట్టలేదు. మీడియా ద్వారా ఈ విషయం మా దృష్టికి వచ్చింది. ఈవీఎంల తయారీలో తానున్నానని, వాటిని హ్యాక్ చేయగలనని ఓ ఈవెంట్‌లో షుజా చేసిన వ్యాఖ్యలను పోలీసులకు ఇచ్చిన లేఖలో ఈసీ పేర్కొన్నట్లు తెలిసింది. ఇండియాలో ఉపయోగించే ఈవీఎంలను హ్యాక్ చేయడం అసాధ్యమని ఈసీ మరోసారి తేల్చిచెప్పింది. షుజా ఉద్దేశపూరితంగానే ఈ విధమైన ఆరోపణలు చేసినట్లు పేర్కొంది. మనం వాడే ఈవీఎంలను ప్రభుత్వరంగ సంస్థలైన భారత్ ఎలక్ట్రానిక్స్ (బీహెచ్ఈఎల్), ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్) తయారు చేస్తాయి. అత్యంత భద్రత ప్రమాణాలు పాటిస్తూ, అన్ని ప్రామాణిక ప్రక్రియలను పరిశీలిస్తూ వీటిని హ్యాకింగ్‌కు ఆస్కారం లేకుండా తయారుచేస్తారు. వీటిని పనితీరును, భద్రత ప్రమాణాలను పరిశీలించేందుకు 2010లో అత్యున్నత సాంకేతిక నిపుణుల కమిటీని కూడా ఏర్పాటుచేశామని పోలీసులకు ఇచ్చిన లేఖలో తెలిపింది. షుజా ఆరోపణలపై ఏవిధమైన న్యాయపర చర్యలు తీసుకోవచ్చో తెలపాలని ఢిల్లీ పోలీసులను ఈసీ కోరింది. అసత్య ప్రచారంతో, అనవసర భయానక పరిస్థితులను సృష్టిస్తున్నట్లు అతని వ్యాఖ్యలు ఉన్నాయని, ఇది ఐపీసీ సెక్షన్ 505 (1) ఉల్లంఘనేనని ఎన్నికల సంఘం పేర్కొంది. లండన్‌లో అతను చేసిన వ్యాఖ్యలను నిశితంగా పరిశీలించి, విచారణ జరపాలని ఢిల్లీ పోలీసులను ఈసీ కోరింది.



### విపక్షానికి మరోదారి లేదు..: కేంద్రమంత్రి జవదేకర్

వచ్చే ఎన్నికల్లో పరాభవం తప్పదని విపక్షాలు నిర్ధారణకు వచ్చాయి. ఓటమిని కప్పిపుచ్చుకునేందుకు ముందుగానే సాకులు వెతుక్కుంటున్నాయి మీ అధికారమా? అంటూ ప్రజలు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారంలోకి వచ్చితీరుతుందని ధీమా వ్యక్తంచేశారు. కోల్‌కతా ర్యాలీపై విపక్షాలు మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి ప్రాథమిక కార్యక్రమానికి సంబంధించి కమిటీని వేయలేదు. కానీ ఈవీఎం కమిటీని మాత్రం ఏర్పాటుచేశారు. ఎన్నికల్లో ఓడిపోతామని వాళ్లకు తెలుసు. అందుకే ఈవీఎంలను కారణంగా చూపాలని చూస్తున్నాయని జవదేకర్ ఎద్దేవా చేశారు. విపక్ష కూటమికి నాయకుడు లేరు.. కులరహిత, తీవ్రవాద రహిత, నిరుద్యోగ రహిత భారత నిర్మాణంపై వాళ్లకు విజనే లేదు. జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్ సంకుచిత ఆలోచనల్లో కొట్టుమిట్టాడుతున్నది. ఏదేమైనా మళ్లీ ఎన్డీయే గెలుస్తుంది. మునుపటి కన్నా ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించడం ఖాయం అని జవదేకర్ ధీమా వ్యక్తంచేశారు.

### బ్యాలెట్ పద్ధతిలోనే లోక్‌సభ ఎన్నికలు: మమత, మాయావతి, అఖిలేశ్ డిమాండ్

ఈవీఎం హ్యాకింగ్ ప్రకంపనలపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, యూపీ మాజీ ముఖ్యమంత్రి మమత, మాయావతి స్పందించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని, లోక్‌సభ పోలింగ్‌కు ఈవీఎంల స్థానంలో పేపర్ బ్యాలెట్లను వినియోగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల యంత్రాలపై వస్తున్న తాజా విమర్శలు చాలా తీవ్రమైనవి. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిని నిర్వహించడమే మంచింది. షుజా ఆరోపణలు సంచలనాత్మకమైనవి. బీజేపీ కుట్రను ఇది బహిర్గతం చేస్తున్నది అని బీఎస్పీ అధినేత్రి మాయావతి వ్యాఖ్యానించారు.

దీనిపై ఎన్నికల కమిషన్ గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవీఎంల ప్రామాణికతను తొలిసారి ప్రశ్నించింది తమ పార్టేయేనన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం తమ ఓట్లు దోపిడీకి గురవుతున్నాయన్న భావనలో ప్రజలున్నారు. మా ఓట్లు.. మీ అధికారమా? అంటూ ప్రజలు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. కాగా, యూపీ మరో మాజీ సీఎం అఖిలేష్ మాట్లాడుతూ, ఈవీఎంలతో ప్రజాస్వా మ్యానికి ముప్పు పొంచివుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది ఏ ఒక్క పార్టీయో లేవనెత్తిన సందేహం కాదు. విపక్షాలన్నీ చేస్తున్న ఆందోళన. ఇప్పటికైనా ఈసీ ప్రత్యామ్నాయాలపై దృష్టిసా రించాలని అఖిలేశ్ సూచించారు.

### షుజా మా సంస్థలో పనిచేయలేదు: ఈసీఐఎల్

**షు**జా ఎవరో మాకు తెలీదు. షుజా మాత్రమే కాదు.. అతను చెబుతున్న వ్యక్తులెవరూ మా సంస్థ తయారు చేసిన ఈవీఎం ఇంజనీరింగ్ బృందంలో సభ్యులుగా లేరని మంగళవారం ఈసీఐఎల్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇవి పూర్తిగా నిరాధార, తప్పుడు వ్యాఖ్యలు. అలాంటి పేర్లు గల వ్యక్తులు 2014 ఈవీఎంల తయారీ బృందంలో లేనేలేరని ప్రకటించింది. లండన్ మీడియా సమావేశంలో షుజా మాట్లాడుతూ, తాను ఈసీఐఎల్ - ఈవీఎం ఇంజనీరింగ్ బృందానికి నాయకత్వం వహించానని, తన బృందంలో ప్రకాశ్, కేశవ్, వంశి, అంజాస్ సభ్యులుగా ఉండే వారని, వీరిలో కొందరు హత్యకు గురవడంతో, ప్రాణ భయంతో తాను దేశం విడిచివెళ్లానని చెప్పిన సంగతి తెలిసిందే. స్కైప్ ద్వారా మాట్లాడిన అతను ముఖాన్ని మాస్క్‌తో కవర్ చేసుకోవడం వల్ల షుజాను గుర్తుపట్టలేని పరిస్థితి ఏర్పడింది.

## ఈవీఎం.. కథాకమామిషు..

### తొలిసారి ఎప్పుడు?

ఈవీఎంలు మన దేశంలో తొలిసారి 1982లో ప్రవేశపెట్టారు. కేరళలోని పరూర్ అసెంబ్లీ సీటుకు జరిగిన ఉప ఎన్నికలో 50 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ యంత్రాలను వినియోగించారు. అటు తర్వాత 1998లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 16 నియోజకవర్గాల్లో ఈవీఎంలు ఏర్పాటయ్యాయి. 2004 సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఈవీఎంల ద్వారానే పోలింగ్ జరిగింది.

### ఎలా పనిచేస్తాయి?

ఈవీఎం మిషిన్‌లో కంట్రోల్ యూనిట్ ప్రధానమైనది. ఈవీఎం పనితీరుకు సంబంధించిన డాటా ఇందులో నిక్షిప్తమై ఉంటుంది. చిన్నపాటి మైక్రోచిప్‌లో ఉంచిన సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఇది పనిచేస్తుంది. పోలింగ్ ముగిసిన తర్వాత క్లోజ్ బటన్ నొక్కితే, అటు తర్వాత ఎలాంటి కొత్త డేటాను ఇది స్వీకరించలేదు. బూత్ రిజిస్టర్ సంఖ్యను ఈవీఎంలో పోలైన ఓట్లతో సరిపోల్చుకోవడం ద్వారా పారదర్శకతను నిర్ధారిస్తారు. ఈవీఎం స్వతంత్ర ఎలక్ట్రానిక్ పరికరం. దీన్ని మరే నెట్‌వర్క్‌తోనూ అనుసంధానం చేయజాలరు.

### ఫిక్స్ చేయొచ్చా?

ఏ అభ్యర్థికి ఓటేస్తే వారి ఖాతాలోకే చేరుతుంది. ఈ క్రమంలో సీరియల్ నంబర్ కీలకం. నామినేషన్లలో అభ్యర్థుల పేర్లలోని అక్షర క్రమానుగతంగా ఈవీఎంలపై వారికి క్రమసంఖ్యను కేటాయిస్తారు. కాబట్టి, ఏ అభ్యర్థి ముందు, ఏ అభ్యర్థి వెనుక అనేది ముందుగా తెలీదు. నామినేషన్లకు ముందే ఈవీఎంలు ఆయా నియోజకవర్గాలకు బట్వాడా అవుతాయి. కాబట్టి ఎలాంటి అపోహలకు తావుండదు.

### ఈవీఎం జంబ్లింగ్..

ఎన్నికల ప్రక్రియకు సిద్ధం చేసిన ఈవీఎంలన్నిటినీ సాంకేతికంగా పరిశీలించిన తర్వాత ఒకచోటకు చేర్చుతారు. అక్కడ నుంచి ఏ ఈవీఎం ఎక్కడకు వెళ్తున్నదో ఎవరికీ అంతుబట్టదు. ఒక క్రమంలో కాకుండా రెండు దఫాల్లో జంబ్లింగ్ విధానంలో నియోజకవర్గాలకు లేదా రాష్ట్రాలకు ఈవీఎంలను సరఫరా చేస్తారు. ఏ పోలింగ్ స్టేషన్‌కు ఏ మిషన్ వెళ్తుందో చివరి వరకు ఎవరికీ తెలిసే అవకాశం లేదు. ఏ నంబర్ ఈవీఎం ఎక్కడకు పంపారన్న జాబితా ఆయా జిల్లా కలెక్టర్ వద్దవుంటుంది.

### వీవీపాట్ అంటే?




ఓటింగ్ మిషన్లపై అనుమానాలను పటాపంచలు చేసేందుకు 2010లో ఈసీ ముందడుగేసింది. ఓటు రసీదు విధానాన్ని తీసుకొచ్చింది. ఓటు మీట నొక్క గానే తామెవరికి ఓటేశామన్నది తెలుసుకునేలా వీవీపాట్ మిషన్‌లో ఒక రసీదు కనిపిస్తుంది. తద్వారా ఓటరు తన ఓటు సరిగానే పడిందని నిర్ధారించుకుంటాడు. 2013 నాగాలాండ్ ఉప ఎన్నికల్లో తొలిసారి వీవీపాట్ యంత్రాలు వినియోగించారు. 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి అన్నిచోట్ల ఈ తరహా మిషన్లు వాడాలని జూన్ 2014న ఈసీ సంకల్పించింది.

### ఎన్ని దేశాల్లో ఈవీఎంలు ఉన్నాయ్?

ప్రస్తుతం 31 దేశాల్లో ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే ఓటింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో కేవలం నాలుగు దేశాలు మాత్రమే జాతీయ స్థాయిలో ఈవీఎంలను వినియోగిస్తున్నాయి. 11 దేశాలు పాక్షికంగాను, 5 దేశాల్లో ప్రయోగాత్మకంగాను అమలుచేస్తున్నాయి. మూడు దేశాలు వీటికి మంగళం పాడాయి.

### ఈవీఎం సమర్థనీయమేనా?

2006లో నెదర్లాండ్స్ దేశం కంప్యూటర్ మిషన్ ఓటింగ్‌పై సందేహాలు లేవనెత్తింది. సరైన భద్రత ప్రమాణాలు లేవని భావించింది. చివరకు పార్లమెంటరీ కమిటీ దర్యాప్తుతో 2007లో ఈవీఎం పద్ధతి నుంచి వైదొలగుతున్నట్లు స్పష్టం చేసింది. 2009లో జర్మనీ ఈ దిశగా అడుగులేసింది. ఓటర్లకు ఈవీఎం సాంకేతికతపై సరైన అవగాహన లేకుండా వీటి వినియోగం తగదని కోర్టు తీర్పు చెప్పడంతో ఈవీఎంలను అటకెక్కించింది.



## సైన్స్ ఫిక్షన్‌లా ఉంది

**సై**బర్ నిపుణుడు షుజా చేసిన ఆరోపణలు చాలా తీవ్రమైనవి. దేశంలో ప్రజాస్వామ్య మనుగడపై ఆందోళన కలుగుతోంది. ఈవీఎంల ప్రామాణికతపై వచ్చిన సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు విరుద్ధంగా కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ బాధ్యతారాహిత్య ప్రకటన చేశారు. కేంద్రమంత్రిగా అతను ఎంతమాత్రం అర్హుడు కాదు. ఇది పారదర్శక, స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశం. అందువల్ల షుజా ఆరోపణలపై దర్యాప్తునకు ఆదేశించి తక్షణమే నిగ్గుతేల్చాలి. ఎఫ్ఐఆర్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎవరైనా ఆరోపణలు చేసినప్పుడు అవి తప్పా? రైటా? అని తేల్చాల్సింది మీరే అంటూ రవిశంకర్ ప్రసాద్‌పై సిబల్ ఎదురుదాడి చేశారు. ఒకవేళ షుజా వ్యాఖ్యలు తప్పయితే అతనిపై చర్యలు తీసుకోవాలి. ఒకవేళ నిజమే అయితే అది చాలా తీవ్ర అంశంగా పరిగణించాల్సి ఉంటుంది. ఇదంతా సైన్స్ ఫిక్సన్ కథమాదిరిగా అనిపిస్తోంది. అయినా దీనిని పరిశీలించాల్సిందే. మీడియా సంస్థలు లేదా దర్యాప్తు సంస్థలు యదార్థమేమిటో వెలికితీయాలన్నారు. రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యలు చిన్నపిల్లల చేష్టల్లా ఉన్నాయి. ఇది ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించిన అంశమని గుర్తించాలి. అమెరికా ఆశ్రయం కోరిన షుజాపై అక్కడి ప్రభుత్వం రెండేళ్లపాటు విచారణ జరిపింది. భారత్‌లోనూ అతని ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలి అని సిబల్ అన్నారు.

## సిబల్‌కు అక్కడేం పని?



**భా**రత ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల కమిషన్‌ను అప్రదిష్ట పాల్జేసేందుకు కాంగ్రెస్ ఈవీఎం హ్యాకింగ్ ఆరోపణల కుట్రకు తెరలేపింది. కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ సదరు మీడియా సమావేశంలో పాల్గొనడమే ఇందుకు నిదర్శనం. లండన్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించిన భారతీయ జర్నలిస్ట్ అసోసియేషన్‌కు ఆశిష్ రే సారథ్యం వహించారు. అతను కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తినాయకుడు. ఇకపోతే ఆ మీడియా సమావేశంలో సిబల్‌కు ఏంపని? అక్కడ ఆయనేం చేస్తున్నాడు? ఏ స్థాయిలో అతను సమావేశానికి వెళ్లాడు? ఇదంతా చూస్తుంటే షుజా మీడియా సమావేశాన్ని కాంగ్రెస్సే నిర్వహించినట్లు అర్థమవుతుంది. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ కుట్రే అని కేంద్రమంత్రి రవిశంకర్ ఎదురుదాడికి దిగారు. నేషనల్ హెరాల్డ్‌లో ఆశిష్‌రే భాగస్వామి. సోషల్ మీడియాలో కాంగ్రెస్ తరపున అతను ప్రచారం చేస్తున్నాడు. గతంలో అనేక మార్లు ప్రధానిపై విమర్శలు చేశాడు కూడా. లండన్‌లో రాహుల్ గాంధీ బహిరంగ సభను నిర్వహించారు అని ఆరోపించారు. తాను కేంద్రమంత్రి హోదాలో ఈ వ్యాఖ్యలు చేస్తున్నానన్న ఆయన, సిబల్‌ను లండన్ ఈవెంట్‌కు వ్యూహకర్తగా పేర్కొన్నారు. వివాదానికి కారణమైన సయ్యద్ షుజా గురించి తానెప్పుడూ వినలేదన్నారు. రెండు నెలల కిందట బ్యాలెట్ ఎన్నికల పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టాలన్న పిటిషన్‌ను సుప్రీం కోర్టు కూడా తిరస్కరించిందని ఈ సందర్భంగా రవిశంకర్ ప్రసాద్ గుర్తుచేశారు.

## నాందేడ్ బరిలో రాహుల్ గాంధీ..?

### బీజేపీకి చెక్ పెట్టేందుకు సరికొత్త వ్యూహం



**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యూహాలకు పదును పెంచారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి షాక్ ఇచ్చేలా పాచికలు వేస్తున్నారు. వారసత్వ ఓటు బ్యాంక్ ఉన్న అమేథి నుంచి కాకుండా కాంగ్రెస్‌కు కంచుకోట లాంటి మరో ప్రాంతం నుంచి పోటీకి రాహుల్ సై అంటున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర లోని నాందేడ్ లేదా మధ్యప్రదేశ్ లో మరో కీలక లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికల బరిలోకి దిగాలని రాహుల్ యోచిస్తున్నట్లు సమాచారం. మధ్యప్రదేశ్ నుంచి కంటే మహారాష్ట్ర నుంచి పోటీ చేస్తేనే మంచిదని సీనియర్లు రాహుల్‌కు సూచినట్లు తెలుస్తోంది.

### నాందేడ్ ఎందుకు..?

లోక్‌సభ ఎన్నికల వేళ ఉత్తర్ ప్రదేశ్ కూటమిగా మారిన సమాజ్ వాదీ-బహుజన సమాజ్ వాదీ పార్టీలు కాంగ్రెస్ పార్టీని లెక్కచేయకపోవడంపై రాహుల్ సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో అమేథి నుంచి పోటీ చేసినా ఆ ప్రభావం ఆ నియోజక వర్గానికి పరిమితం అవుతుందని సీనియర్లు పేర్కొనడంతో నాందేడ్ వైపు దృష్టిపెట్టినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ నాందేడ్ నుంచి పోటీ చేస్తే పరిసర నియోజక వర్గాలైన లాతూర్, యవత్మాల్- వాసిమ్, పర్భని, హింగోలీలపై కూడా ఉండొచ్చని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

## వాళ్లుంటే రూ.4.50 లక్షల కోట్లు ఆవిరైపోయేవి

◆ నాలుగన్నరేళ్లలో ప్రజల ఖాతాల్లోకి రూ.5.80 లక్షల కోట్లు ◆ సంక్షేమమే మా అజెండా ◆ ప్రవాస భారతీయ దివస్‌లో ప్రధాని మోడీ



**వారణాసి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ అవినీతి నిర్మూలనలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం ఖర్చు ప్రతీ రూపాయిలోనూ 15 పైసలు మాత్రమే అసలైన లబ్దిదారులకు చేరుతుందన్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మాటలను ఉటంకిస్తూ.. అలాంటి వారి ప్రభుత్వాల వల్లే దేశంలో అవినీతి పెచ్చుమీరిపోయిందని మండిపడ్డారు. అలాంటి పరిస్థితి నుంచి దేశాన్ని బయట పడేసి ప్రపంచ దేశాల్లో భారత్‌పై విశ్వసనీయతను పెంచిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. వివిధ పథకాల రూపంలో ప్రజలకు గత నాలుగున్నరేళ్లలో తమ ప్రభుత్వం రూ.580000 కోట్లు అందించిందని మోడీ చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే 4.50 లక్షల కోట్లు ఆవిరైపోయి ఉండేవని చురకలంటించారు. వారణాసి వేదికగా 15వ ప్రవాసి భారతీయ దివస్‌ను ప్రారంభించిన మోడీ.. ఎన్ఆర్ఐలనుద్దేశించి ప్రసంగించారు. ప్రవాస భారతీయులే భారత్ బ్రాండ్ అంబాసిడర్లని అభివర్ణించిన మోడీ..ప్రపంచ దేశాల్లో ఎక్కడున్న వసుదైక కుటుంబం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ మార్పులపై భారత్ కృషిని ప్రపంచ దేశాలు గుర్తించాయన్న మోడీ.. గత పాలకుల హయాంలో భారత్‌పై విదేశాలకు ఉన్న చులకనభావాన్ని లేకుండా చేశామన్నారు. ప్రజలు నిజాయితీగా పన్నులు చెల్లిస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో యధేచ్ఛగా లూటీ జరిగాయని మోడీ ఆరోపించారు. ఇలాంటి చర్యలు గతంలోనూ చేపట్టినా.. వ్యవస్థను మార్చాలన్న ఉద్దేశం నాటి ప్రభుత్వాలకు లేదని దుయ్యబట్టారు.

### మోడీపై మారిషస్ ప్రధాని పొగడ్తలు

ప్రవాస భారతీయ దివస్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మారిషస్ ప్రధాని జగ్నౌత్ మోడీని పొగడ్తలతో ముంచె త్తారు.స్కిల్ ఇండియా, బేటీ బచావో..బేటీ పఢావో లాంటి పథకాల భారత్‌లో అద్భుతమైన ఫలితాలనిస్తున్నాయన్నారు. అంతర్జాతీయంగా మోడీ చేపట్టిన కార్యక్రమాలు ప్రపంచ దేశాలను ఆకర్షిం చాయని.. క్లీన్ ఎనర్జీ, అంతర్జాతీయ సౌర ఒప్పందం లాంటివి మోడీ గొప్పదనాన్ని తెలియజేస్తున్నాయన్నారు. వచ్చేఏడాది తాము నిర్వహించే భోజ్‌పురి ఫెస్టివల్‌లో భగవద్గీత మహోత్సవాన్ని చేపడామని జగ్నౌత తెలియజేశారు. ప్రతీ ఏడాది జనవరి 9వ తేదీన నిర్వహించే ప్రవాస భారతీయ దివస్‌ను ఈ ఏడాది 21 నుంచి23 వరకు నిర్వహిస్తున్నారు. ప్రయాగ్‌రాజ్ కుంభమేళ సందర్భంగా తొలిసారి ప్రవాస భారతీయ దివస్ షెడ్యూల్‌లో మార్పు చేశారు.

## ఎస్ఎస్‌టిఎస్ఈ ర్యాంకుల్లో నారాయణ విద్యాసంస్థల ఆధిపత్యం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రతియేటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌లో నారాయణ గ్రూపు పాఠశాలల్లోని విద్యార్థులు జైత్రయాత్ర కొనసాగించారు. జాతీయ స్థాయిలో 1, 2, 4, 5, 6, 8 ర్యాంకులను సాధించి అగ్రస్థానంలో నిలిచారు. 10లోపు 29 టాప్ ర్యాంకులు కైవసం చేసుకుని రికార్డు సృష్టించామని ఈ సందర్భంగా నారాయణ గ్రూపు సంస్థల అధిపతి డాక్టర్ పి.నారాయణ ధీమా వ్యక్తంచేశారు. జాతీయ స్థాయిలో నారాయణ ఆధి పత్యం కొనసాగించారని మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## సాయుధ పోలీసుల సంబరం!

### మాట నిలబెట్టుకున్న డీజీపీ ఠాకూర్

**అమరావతి, ఆంధ్రప్రభ :** 'సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తాను. వారు సంతోషంగా ఉన్నప్పుడే ప్రశాంత వాతావరణం నెలకొంటుంది' అంటూ బాధ్యతలు చేపట్టిన తొలి రోజుల్లోనే డీజీపీ ఆర్పీ ఠాకూర్ స్పష్టం చేశారు. అన్నట్టుగానే దశాబ్దాలుగా పదోన్నతులకు నోచుకోని కానిస్టేబుళ్లపై ప్రత్యేక దృష్టిసారించి ప్రభుత్వాన్ని మెప్పించడం ద్వారా సఫలీకృతం అయ్యారు. డీజీపీ చేపట్టిన చర్యలతో పోలీసు శాఖలో పదోన్నతుల 'పండుగ' నెలకొంది. దశాబ్దాలుగా పదోన్నతులకు నోచుకోని కానిస్టేబుళ్లు పదోన్నతుల సంబరాల్లో తేలియాడుతున్నారు. పదోన్నతులు అంటే బ్రహ్మ పదార్థంగా భావించే పోలీసు శాఖలో జనవరిలో చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. 60వేల మంది ఉన్న పోలీసు శాఖలో కానిస్టేబుల్ నుంచి అదనపు డీజీ స్థాయి వరకు సుమారుగా ఆరు వేల మందికి ప్రభుత్వం పదోన్నతులు ఇచ్చింది. పోలీసు శాఖలో అంతర్భాగమైన సాయుధ విభాగం(ఆర్మ్‌డ్ రిజర్వ్)లో 637మందికి హెడ్ కానిస్టేబుళ్లుగాను, 91మందికి ఎఎస్ఐలుగాను పదోన్నతి ఇచ్చేందుకు సోమవారం నాటి మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. రెండు మూడు రోజుల్లో ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. అంతకు ముందే సివిల్ విభాగంలో 2885 మందికి పదోన్నతి ఇచ్చారు. పలువురు ఐపీఎస్ అధికారులకు కూడా ఇప్పటికే పదోన్నతులను పూర్తి చేశారు. ఎపీఎస్పీ, మహిళా పోలీసుల పదోన్నతులు సాంకేతిక కారణాలతో నిలిచాయి. ఇప్పటికే 2092 మంది ఏపీఎస్పీ పోలీసులకు పదోన్నతులు కలిపించేందుకు పోలీసు శాఖ విధి విధానాలు రూపొందిస్తోంది.

## 'ఏపీ మెడ్‌టెక్ స్టాల్' భారత్‌కే గర్వ కారణం

### క్రికెటర్ సెహ్వాగ్ ట్వీట్

**అమరావతి, ఆంధ్రప్రభ :** ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు హాజరైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దావోస్‌లో ఏర్పాటు చేసిన 'ఏపీ మెడ్‌టెక్ జోన్' స్టాల్‌పై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ప్రశంసల వర్షం కురిపించారు. ఏపీ ఏర్పాటు చేసిన మెడ్‌టెక్ స్టాల్ మెరిసిపోతోందని వ్యాఖ్యానించారు. అత్యాధునిక మెడికల్ పరికరాల తయారీ కంపెనీలను ఆకర్షించేందుకు ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడ్‌టెక్ జోన్ అద్భుతమని కితాబిచ్చాడు. ఈ క్లస్టర్ జోన్ భారత్‌కు గర్వకారణంగా మారబోతుందని వ్యాఖ్యానించారు.

## నడిసంద్రంలో నౌకలకు అగ్ని

### భారత సిబ్బందితో సహా 14 మంది నావికులు మృతి

**మాస్కో:** రష్యా నుంచి క్రిమియాను వేరుచేసే కెర్చ్ స్ట్రెయిట్లో ఇండియన్, టర్కిష్, లిబియాన్ సిబ్బందితో ప్రయాణిస్తున్న రెండు నౌకలు అగ్నిప్రమాదంలో చిక్కుకున్నాయి. ఈ ప్రమాదంలో భారతీయులతో సహా 14మంది నావికులు ప్రాణాలు కోల్పోయారని స్థానిక మీడియా తెలిపింది. రష్యా పరిధిలోని జలాల్లో సోమవారం ఈ ప్రమాదం జరిగింది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ స్వల్పకాల టెండరు ప్రకటన
నిట్ నెం.ఇఇ/ఆర్ & బి/టిఎన్ఎల్/89 నుండి 100/18-19 తేది: 17-01-2019
సుమారు రూ.63.00 లక్షల విలువగల రహదారుల వార్షిక మరమ్మతు మరియు ఇతర పనులకు (మొత్తం పనులు 12) కొరకు టెండర్లు ఆహ్వానించడమైనది. పూర్తి వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.apeprocurement.gov.in వద్ద చూడగలరు. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 25.01.2019 మ.గం.3.30 వరకు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్ (ర.భ) విభాగం, తెనాలి
Ro.No.4010/CL/Advt/1/1/2018-19, Dt: 22.01.2019

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.ఇఇ/డిబి/19/2018-19 తేది: 18.01.2019
పనిపేరు : గుంటూరు జిల్లా, మాచవరం మండలం నందలి మల్లవోలు గ్రామము యొక్క చెరువు అలుగు పునర్నిర్మాణం పనిని చేపట్టుట గురించి. అంచనా విలువ :రూ. 18,70,000/-.టెండరు షెడ్యూలు లభ్యమగు తేది :25.01.2019 నుండి 08.02.2019 మ॥ 3.00గం॥ల వరకు. బిడ్ దాఖలు చేయు చివరి తేది :08.02.2019 సా॥ 5.00గం॥ల వరకు. ఫైన్ బిడ్ తెరచు తేది :11.02.2019 ఉ॥11.00గం॥లకు. మిగతా వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.inలో చూడగలరు.ఫోన్ నెం.0863-2234193
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, నీటి పారుదల విభాగము, గుంటూరు
Ro.No.4003/CL/Advt/1/1/2018-19, Dt:22.01.2019

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ప్రభుత్వ పరీక్షల శాఖ
టెండరు ప్రకటన
ఆర్‌సి. నెం.62/జె-2/2019 తేది: 18-01-2019
పని పేరు: ఎస్ఎస్‌సి పబ్లిక్ ఎగ్జామినేషన్స్, మార్చి -2019 మరియు ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సప్లిమెంటరీ ఎగ్జామినేషన్స్, జూన్-2019 నకు సంబంధించి రాష్ట్రంలో 13 స్పాట్ వాల్యుయేషన్ శిబిరాలకు వాల్యుయేషన్ యొక్క ప్రిన్సిపుల్స్ యొక్క ముద్రణ మరియు సరఫరా- రూ.4,00,000/-. టెండరు షెడ్యూళ్ళ జారీ : 24-01-2019 నుండి 06-02-2019 వరకు. టెండరు షెడ్యూళ్ళ స్వీకరణ: 07-02-2019 మ॥3.00గం.ల వరకు. సీలుచేసిన టెండర్లు తెరచుట: 07-02-2019 సా॥4.00గం.ల వద్ద. తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చు.
సం/- డైరెక్టర్
Ro.No.3987/CL/Advt/1/1/2018-19, Dt: 22.01.2019

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.41 నుండి 42/ఎటిఓ/2018-19 తేది: 18-01-2019
క్రిష్ణా జిల్లా విజయవాడలో 30.00 లక్షల వ్యయంతో 2 పనులు మరియు 2 రోడ్డు పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 25-01-2019 నుండి, బిడ్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 08-02-2019న మ॥3.00గం.ల వరకు. బిడ్ సమర్పణ ముగింపు తేది: 08-02-2019న సా॥5.00గం.ల వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేదీ : 11-02-2019న ఉ॥11.00 గం.ల వద్ద. ధర బిడ్ తెరుచు తేది: 13-02-2019న ఉ॥11.00గం.ల వద్ద. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వద్ద www.tender.apeprocurement.gov.in చూడవచ్చును. ఫోన్: 8886855119.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, పిఆర్, పిఐయు డివిజన్, విజయవాడ, క్రిష్ణా జిల్లా
Ro.No.3985/CL/Advt/1/1/2018-19, Dt: 22.01.2019

Andhraprabha business 2018
# బిజినెస్
BUSINESS

## రైతు రుణమాఫీలతో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ
# అతలాకుతలం

• పెరిగిపోనున్న ద్రవ్యలోటు
• ఎన్నికల సంవత్సరంలో ఉదారంగా రుణాలు

India Ratings & Research
A Fitch Group Company

**న్యూఢిల్లీ** : ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కాబట్టి కేంద్రంలో పాటు పలు రాష్ట్రప్రభుత్వాలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఉదారంగా రైతు రుణమాఫీలను పోటాపోటీగా ప్రకటించనున్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే 2019-20 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ జీడీపీలో 0.5 శాతం తగ్గవచ్చునని రేటింగ్ ఏజెన్సీ ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చి (ఇండ్‌రా) తాజా నివేదికలో వెల్లడించింది. రెవెన్యూ వసూళ్లు తగ్గడం.. అదే సమయంలో ప్రభుత్వం పెద్దెత్తున వ్యయం చేయడంతో దాని ప్రభావం ద్రవ్యలోటుపై పడుతుంది.

రేటింగ్ ఏజెన్సీ అంచనా ప్రకారం వచ్చే ఆర్థిక సంవత్సరం దేశ ద్రవ్యలోటు జీడీపీలో 3.2 శాతానికి ఎగబాకవచ్చునని అంచనా వేసింది. ఈ ఆర్థికసంవత్సరం ప్రధమార్థం అంచనా 2.8 శాతం కంటే కూడా ఇదే ఎక్కువే. ఈ ఏడాది మే నెలలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతోంది. ముఖ్యంగా రైతురుణ మాఫీలతో పాటు ఆర్థికంగా ఆదుకొనేందుకు పలు స్కీంలలను అందుబాటులోకి తేనుంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడం ఖాయమని వెల్లడించింది.ప్రభుత్వం పెద్దెత్తున సంక్షేమ పథకాలకు విచ్చలవిడిగా ఖర్చు చేసినా భారత ఆర్థిక వ్యవస్థకు తక్షణమే వచ్చిన ప్రమాదమేమీ లేదని, స్థిరంగా ఉంటుందని అంచనా వేసింది. ప్రభుత్వం ఆర్థికక్రమశిక్షణ పాటిస్తే ద్రవ్యలోటు జీడీపీలో 3 శాతానికి పరిమితం చేయవచ్చు. అయినా వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇది పెద్ద రిస్కు కాదని రేటింగ్ ఏజెన్సీ చెబుతోంది. మొత్తానికి వచ్చే ఆర్థికసంవత్సరంలో రెవెన్యూ జీడీపీలో 0.5 శాతానికి తగ్గవచ్చునని, ఎందుకంటే రెవెన్యూ వసూళ్ల కంటే ప్రభుత్వం సంక్షేమ పథకాలను పెద్దమొత్తంలో వ్యయం చేయడమే దీనికి కారణమని నివేదికలో వివరించింది.


### పోటాపోటీ సంక్షేమ పథకాలు

ఈ ఏడాది దేశంలోని పలు రాష్ట్రాల్లో మే నెలలో ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వాలు ఒకదానితో ఒకటి పోటీపడి సంక్షేమ పథకాలను ప్రకటించనున్నాయి. ముఖ్యంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి మధ్యప్రదేశ్, కేరళ, రాజస్థాన్ ప్రభుత్వాలకు ద్రవ్యలోటు పెరిగే అవకాశాలున్నాయని తెలిపింది. ఇక రెవెన్యూ వ్యయం విషయానికి వస్తే దేశ రెవెన్యూ వ్యయం ఏకంగా 18.9 శాతం పెరిగి (ఏడాది ప్రాతిపదికన) చూస్తే వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.33.2 లక్షల కోట్లకు చేరుతుంది. 2019 ఆర్థిక సంవత్సరంలో 11.2 శాతంతో పోల్చుకుంటే చాలా ఎక్కువ. దీనికి ప్రధాన కారణం డిసెంబర్ 2018లో రైతు రుణమాఫీల గు రించి మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, అస్సాం, రాజస్థాన్‌లు ప్రకటించేశాయి.

కష్టాల్లో ఉ న్న రైతులను ఆదుకొనేందుకు రుణమాఫీలను ప్రకటిస్తున్నామని రాష్ట్రప భు త్వాలు సమర్థించుకుంటున్నాయని ఇండియా రేటింగ్స్ నివేదికలో వివరిం చింది. తమిళనాడు, హర్యానా, పశ్చిమబెంగాల్, కేరళలు 2020 ఆర్థిక సంవత్స రంలో జీడీపీలో మూలధనం వ్యయం పరిమితి స్థాయిలో 3.0 శాతానికి పరిమి తం చేసు కోవచ్చునని, అదే ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా మాత్రం 3.07 శాతమని వెల్లడించింది. గరిష్ఠంగా అప్పుల విషయానికి వస్తే .. వచ్చే ఆర్థిక సంవత్సరం 25.1 శాతానికి పెరిగితే.. ఈ ఆర్థికసంవత్సరంలో అప్పులు జీడీపీలో 24.3 శాతమని నివేదికలో వివరించింది. మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వచ్చే ఆర్థిక సంవత్సరం అప్పులు మోత మరింత పెరిగిపోతుందని తేల్చి చెప్పింది. ఈ రాష్ట్రాలు వచ్చే ఆర్థిక సంవత్సరం మార్కెట్ నుంచి సుమారు రూ.5.7 లక్షల కోట్లు అదనంగా రుణాలు సేకరించుకోవాల్సి వస్తుందని.. ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనా ప్రకారం గరిష్ఠంగా రూ.4.4 లక్షల కోట్లు మాత్రమే మార్కెట్ల నుంచి రుణాలు సేకరించాలని నిర్ణయించాయి.

## ఈ- కామర్స్‌లో
# బిగ్ ఫైట్!
## ముఖేష్ × బెజోస్

amazon



భారత్ కన్స్యూమర్ మార్కెట్‌లో త్వరలోనే యుద్ధం తీవ్రరూపం దాల్చనుంది. ఇప్పటి వరకు ఈ-కామర్స్ మార్కెట్లో అమెరికన్ల హవా నడిచింది. దీనికి త్వరలోనే తెరపడనుందా? దీనికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. తాజాగా భారత్ ఆన్‌లైన్ మార్కెట్లో ప్రపంచంలోనే అతి పెద్ద కుబేరులు హవా నడిపిస్తున్నారు. తాజాగా ఫ్లిప్‌కార్ట్ ఆన్‌లైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను గతేడాది వాల్‌మార్ట్ ఐఎన్‌సీ టేకోవర్ చేసంది. ఇప్పటి వరకు దేశీయ మార్కెట్లో అమెజాన్ డాట్‌కామ్ ఐఎన్‌సీ బాగా స్థిరపడింది. ఈ అమెజాన్ డాట్‌కామ్ ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు జెఫ్ బేజోస్‌కు చెందిన కంపెనీ. అలాగే వాల్‌మార్ట్ విషయానికి వస్తే అది అమెరికాకు చెందిన కంపెనీయే. ఈ రెండు అమెరికాకు చెందిన కంపెనీలు భారత్ మార్కెట్లో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నా యి. వారి ఆధిపత్యానికి గండికొట్టడానికి భారతీయ బిలియనీర్ ముఖేష్ అంబానీ రంగంలోకి దిగుతున్నారు. ఆయన కూడా ఈ - కామర్స్ రంగం లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు.

గత వారం ముఖేష్‌కు చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ క్యూ3 ఫలితాలను వెల్లడించింది. అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. మొట్టమొదటిసారి నికరలాభం రూ.10వేల కోట్ల మార్కును దాటిపోయింది. త్వరలోనే ఆన్‌లైన్ మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే రిలయన్స్ ఇండస్ట్రీకి అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ దేశవ్యాప్తంగా స్టోర్‌లను నిర్వహిస్తోంది. దేశంలోని సువూరు 30 మిలియన్‌ల చిన్న రిటైలర్స్‌తో పాటు వినియోగదారులను తమ ఖాతాలో వేసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. కాగా రిలయన్స్ రిటైల్ లిమిటెడ్‌కు దేశవ్యాప్తంగా 10వేల స్టోర్‌లున్నాయి. ఈ స్టోర్‌లను అన్నిటికి వినియోగించుకుని, తమ రిటైల్ నెట్‌వర్కును మరింత విస్తరించుకోవాలనేది ముఖేష్ ఆలోచన.

టెలికంతో లింక్ : అంబానీకి కలిసొచ్చే మరో అంశం ఏమిటంటే ప్రస్తుతం ఆయన రిలయన్స్ జియోపేరుతో టెలికంరంగంలో ప్రవేశించి పోటీ కంపెనీలకు చుక్కలు చూపిస్తున్నారు. ఈ కామర్స్ రంగంలో వినియోగదారుల విషయానికి వస్తే పట్టణ ప్రాంతాల్లోని మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 500 మిలియన్‌ల ఇంటర్నెట్ యూజర్లున్నారు. వారిలో 200 మిలియన్‌లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నెట్ వినియోగదారుల్లో ప్రతి నలుగురిలో ఒకరు నెలకు ఒకసారి మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తుంటారు. ఈ సంఖ్య తక్కువే అయినా.. దేశంలో రోజు రోజుకు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వినియోగదారులు సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో కొనుగోలుదార్లు సుమారు 120 మిలయన్‌లకు చేరుతుందని రిలయన్స్ జియో ఇన్ఫోకా మ్ లిమిటెడ్ అంచనా వేస్తోంది. ప్రస్తుతం జియో వద్ద 280 మిలియన్‌ల డిజిటల్ సబ్‌స్క్రైబర్లు న్నారు. జియో 4జీ టెలికంరంగంలో ప్రవేశించి దేశంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది.

అతి తక్కువ ధరలకు డేటాను అందిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలు.. చిన్న పట్టణాల్లో కూడా ఈ షాపులు ఆన్‌లైన్ లావాదేవీల వల్ల లాభాలు గడించుకోవచ్చు.. సామాన్యుడు కూడా హైబ్రిడ్ ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ మోడల్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరుపుకొనే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది.

ఇక భారతీయులకు సినిమాలు, వీడియోలు అంటే ఎంతో మోజు. సరాసరి భారతీయులు నెలకు 5 బిలియన్ గంటల వీడియోలను తమ మొబైల్ ఫోన్ల ద్వారా వీక్షస్తుంటారు. రిలయన్స్‌కు చెందిన ఫైబర్ బ్రాండ్‌ద్వారా సినిమాలు చూస్తుంటారు. ఈ అవకాశాన్ని ముఖేష్ అంబానీ చక్కగా వినియోగించుకొని తన ప్రైవేట్ లేబుల్ ఫ్యాషన్ బ్రాండ్‌ను ప్రచారం చేసుకోవడానికి వీలుంటుంది. ప్రస్తుతం ఏజేఐఓ బ్రండ్‌తో ఫ్యాషన్ లేబుల్‌ను ప్రచారం చేస్తున్నారు.

Reliance RETAIL
Aapki khushi Hamari khushi

### రాజకీయ కోణం

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా! అంబానీ తలచు కుంటే ప్రభుత్వ విధానాలు రాత్రికి రాత్రి తనకు అనుకూలంగా మార్చుకొనే సత్తాను ఆయనకు ఉంది. రాజకీయ పలుకుబడి బాగాఉన్న ముఖేష్ అంబా నీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ముఖేష్‌కు చెందిన రిలయన్స్ ఈ- కామర్స్ రంగంలోకి ఎంట్రీ ఇస్తోందని ప్రచారం మొదలుకా గానే కేంద్రంలోని మోడీసర్కార్ కూడా అప్రమత్తమై ఈ - కామర్స్ రంగంలో నిబంధనలు మార్చేసింది. దీంతో విదేశీ ఈ-కామర్స్ కంపెనీలు, అమె జాన్, వాల్‌మార్ట్ - ఫ్లిప్ కార్ట్‌కు నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ఇప్పటి వరకు విదేశీ ఈ టెయిలర్స్ .. ఉదాహరణకు అమెజాన్‌నే తీసుకుంటే పాత సరకును అత్యంత తక్కువ డిస్కౌంట్‌తో వినియోగదారుడికి విక్రయించి చేతులు దులుపుకొనేది. వచ్చే నెల నుంచి ఈ-కమార్స్ రంగంలోకి కొత్త నిబంధనలు భారత ప్రభుత్వం అమల్లోకి తేనుంది. విదేశీ కంపెనీలు దేశంలోని కంపెనీలతో భాగస్వామ్యం చేపట్టి ఉత్పత్తి చేసే ప్రొడక్టును ఆన్‌లైన్‌లో విక్రయించరాదని నిబంధన తీసుకొచ్చింది. దీంతో పాటు అంబానీ భారతీయుల షాపింగ్ డేటాను స్థానికంగానే స్టోర్ చేయాలని విదేశాల్లో చేయరాదని పట్టుబడుతున్నారు. రియలన్స్ జియో పెట్టుబడులు ఇప్పటికే 4,000 కోట్ల డాలర్లు దాటిపోయింది. అయితే భారత్‌లో టెలికం మార్కెట్లో పోటీ మాత్రం తీవ్రంగా ఉంది. ప్రతి టెలికం కంపెనీ సరాసరి వినియోగదారుడి నుంచి రెవెన్యూ నెలకు రెండు డాలర్లు కంటే ఎక్కువ సాధించే అవకాశాల్లేకుండా పోయింది. ముఖేష్ అంబానీ తన టెలికం కంపెనీని, రిటైల్‌ను ఈ- కామర్స్‌కు వినియోగించుకునే పనిలోపడ్డారు. ఇక భారత ప్రభుత్వం మాత్రం అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్‌ను.. ఒక చెయ్యి కట్టేసి .. భారత్ మార్కెట్లో గట్టి పోటీ ఇవ్వాలని బలవంతం చేస్తోంది. అయితే బేజోస్ ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు కాబట్టి తేలికగా అంబానీని ఓడించే సత్తా అయితే ఉంది. కానీ, ఈ యుద్ధం బేజోస్‌కు అంత ఆషామాషీకాదు.. చావు తప్పి కన్ను లొట్టబోయే ప్రమాదం కూడా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి భవిష్యత్తులో ఈ-కామర్స్ రంగంలో ఎవరూ విజేత అనేది కాలమే నిర్ణయిస్తుంది. ఈ- టెయిటింగ్ రంగం రాబోయే రోజుల్లో గరం గరం కావడం ఖాయం.. ఈ యుద్ధంలో లాభపడేది మాత్రం ఖచ్చితంగా వినియోగారుడే!

## క్యూ3 ఫలితాలు

### టీవీఎస్ మోటార్ కంపెనీల లాభం రూ.178 కోట్లు
*క్యూ3లో 15 శాతం వృద్ధి*

**న్యూఢిల్లీ** : టీవీఎస్ మోటార్‌కంపెనీ డిసెంబర్‌తో ముగిసిన త్రైమా సికంలో నికరలాభంలో 15.57 శాతం వృద్ధితో రూ.178.39 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.154.35 కోట్లు నమో దు చేసింది. రెవెన్యూ విషయానికి వస్తే రూ.4,663.98 కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే త్రైమాసి కంలో రూ.3,698.67 కోట్లని బీఎస్ ఈకి సమా చారం అందించింది. రెవె న్యూలో 26.09 శాతం వృద్ధి కనిపించింది. బీఎస్ఈలో దీని షేరు 2.78 శాతం పెరిగి రూ.552 వద్ద ట్రేడ్ అయ్యింది.

### ఏషియన్ పెయింట్స్ లాభం రూ.647 కోట్లు
*క్యూ3లో 14 శాతం వృద్ధి*

**న్యూఢిల్లీ** : డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏషియన్ పెయింట్స్ నికరలాభంలో 14.09 శాతం పెరిగి రూ.641.15 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.567.21 కోట్లని బీఎస్ ఈకి సవమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే క్యూ3లో రూ.5,293.99 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.4,267.49 కోట్లని వెల్లడించింది. బీఎస్ఈలో దీని షేరు 0.99 శాతం క్షీణించి రూ.1406.55 వద్ద ముగిసింది.

### రిలయన్స్ నిప్పాన్ లైఫ్ అసెట్ లాభంలో 17 శాతం క్షీణత

**న్యూఢిల్లీ:** రిలయన్స్ నిప్పాన్ లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ (ఆర్ఎన్ఎఎం).. రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ అసెట్‌మేనేజర్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభంలో 17 శాతం క్షీణించి రూ.109.52 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.132.01 కోట్లు ఆర్జించినట్లు ఆర్‌నామ్ బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే క్యూ3లో రూ.349.85 కోట్లకు దిగిరాగా.. అంతకు క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.398.98 కోట్లని తెలిపింది. అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) ఏడు శాతం పెరిగి రూ.4.14 లక్షలకోట్లకు డిసెంబర్ చివరి నాటికి చేరిందని ప్రకటనలో వివరించింది.

### అలెంబిక్ ఫార్మా లాభం రూ.170 కోట్లు

**న్యూఢిల్లీ:** అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమా సికంలో నికరలాభంలో 30 శాతం పెరిగి రూ.169.83 కోట్లకు ఎగబాకింది. అమెరికా మార్కెట్లో అమ్మకాలు జోరందుకోవడంతో మంచి లాభాలను ఆ ర్జించగ లిగింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.130.60 కోట్లు ఆర్జిం చి నట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వ స్తే రూ. 1018.15 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 840.02 కోట్లని వెల్లడించింది. అమెరికా మార్కెట్లో అమ్మకాలు ఏకంగా 42 శాతం పెరిగి రూ.308 కోట్లకు ఎగబాకిందని కంపెనీ ఎండీ ప్రణవ్ అమిన్ తెలిపారు.


### హావెల్స్ ఇండియా లాభం రూ.196 కోట్లు
*క్యూ3లో ఫ్లాట్*

**న్యూఢిల్లీ** : ఎలక్ట్రికల్ వస్తువుల తయారీ కంపెనీ హావెల్స్ ఇండియా డిసెంబర్‌తో ము గిసిన త్రైమాసికంలో నికరలాభం రూ.168.67 కోట్లు ఆర్జించింది.క్రితం ఏడాది ఇదే త్రైమా సికంలో రూ.194.36 కోట్లు నమోదు చేసినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే రూ. 2,551.4 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,993.53 కోట్ల ని తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 4.68 శాతం పెరిగి రూ.709.60 వద్ద ముగి సింది.

### శ్రీసిమెంట్ డివిడెండ్ రూ.25
*నికరలాభం రూ.301 కోట్లు*

**న్యూఢిల్లీ:** శ్రీసిమెంట్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదిక నికరలాభంలో 9.61 శాతం క్షీణించి రూ.301.29 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.333.33 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే 18.65 శాతం పెరిగి రూ.2,835.94 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,390.01 కోట్లని ప్రకటనలో పేర్కొంది. మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో మధ్యంతర డివిడెండ్ షేరు రూ. 25గా ప్రకటించింది. బీఎస్ఈలో దీని షేరు 0.11 శాతం క్షీణించి రూ.15,667.85 వద్ద ముగిసింది.

### కోరమాండల్ ఇంటర్నేషనల్ లాభం రూ. 153 కోట్లు




**హైదరాబాద్** : కోరమాండల్ ఇంటర్నేషనల్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికరలాభం రూ.153 కోట్లు ఆర్జించగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.180కోట్లు నమోదు చేసింది. ఇక రెవెన్యూ విషయానికి వస్తే 11 శాతం వృద్ధితో రూ.3053 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,743 కోట్లని ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీ ఏకీకృత నికరలాభం విషయానికి వస్తే నికరలాభం రూ.154 కోట్లు సాధించగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.180 కోట్లు ఆర్జించింది. రెవెన్యూ విషయానికి వస్తే 11 శాతం వృద్ధితో రూ.3,059 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,747 కోట్లని ఒక ప్రకటనలో వెల్లడించింది.

### ఎన్ఎండీసీ పాల్వంచ యూనిట్లో ఉత్పత్తి పున:ప్రారంభం

**హైదరాబాద్** : ప్రభుత్వ రంగానికి చెందిన ఎన్ఎండీసీకి చెందిన పాల్వంచలోని స్పాంజ్ ఐరన్ యూనిట్ (ఎస్ఐయు)లో ఉత్పత్తిని తిరిగి పున:ప్రారంభమైంది. పరిపాలన పరమైన కారణాల వల్ల ఈ ప్లాంట్‌ను మూసివేశారు. దీర్ఘకాలం తర్వాత ప్రస్తుతం ఇక్కడ తిరిగి ఉత్పత్తి ప్రారంభించారు. ఈ ప్లాంట్‌లో రోజుకు నాణ్యమైన 100 టన్నుల స్పాంజ్ ఐరన్‌ను ఉత్పత్తి అవు తుంది.



షట్‌డౌన్ తర్వాత ప్లాంట్‌ను ఇప్పుడే ప్రారంభించాం కాబట్టి 50 శాతం మాత్రమే ఉత్పత్తి సామర్థ్యంతో కొనసా గుతోంది. త్వరలోనే 80 శాతానికి చేరుకుంటామని కంపెనీ ఈడీ టీ ఎస్ చెరియన్ ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలం తర్వాత ప్లాంట్‌ను ప్రారంభిస్తున్నందున ఈ కార్యక్రమానికి కంపెనీ సీనియర్ అధికారులు, యూనియన్ ప్రతినిధులు, ప్లాంట్‌లో పనిచేసే కార్మికులు తదితరులు హాజరయ్యారు.

## నిస్సాన్ కిక్స్ ఎస్‌యూవీ విడుదల
*ధర రూ.9.55 లక్షలు*




**న్యూఢిల్లీ** : జపాన్‌కు చెందిన ఆటో తయారీ కంపెనీ నిస్సాన్ మంగ ళవారం కొత్త మోడల్స్ ఎస్‌యూవీ కిక్స్‌ను భారత్ మార్కెట్‌కు పరిచయం చేసింది. దీని ధర రూ.9.55 లక్షల నుంచి రూ. 14.65 లక్షలు (ఎక్స్‌షోరూంగా) నిర్ణ యించింది. కొత్త మోడల్ భారతీ య రో డ్లకు అనుగుణంగా ఉండే విధంగా తయారు చేసింది. పెట్రోల్‌తో పాటు డిజెల్ వెర్షన్‌ను కూడా అందుబాటులో తెచ్చింది. ఇంజిన్ సామర్థ్యం 1.5 లీటర్. మార్కెట్లో కిక్స్ హ్యుందాయ్ క్రెటా, మారుతి ఎస్- క్రాస్‌లకు పోటీ ఇస్తుంది. వీటి ధరలు రూ. 8.85 లక్షల నుంచి రూ.15.1 లక్షలుగా ఉన్నాయి. కొత్త ఎస్‌యూవీ గురించి కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఛైర్మన్ మేనేజింగ్ కమిటీపేమన్ కార్గర్ మాట్లాడుతూ నిస్సాన్ గ్లోబల్ పొడక్టును, టెక్నాలజీని భారత్ మార్కెట్‌కు పరిచయం చేస్తున్నామన్నారు. తమ రీసెర్చి అండ్ డెవ లెప్‌మెంట్ (ఆర్అండ్‌డి) డిజైన్ టీం జపాన్, అమెరికా, బ్రెజిల్ టీం లు కలిసి భారత్ మార్కెట్లకు అనుకూలంగా ఉండే విధంగా కొత్త ఎస్‌యూవీని తీర్చిదిద్దారని అన్నారు. నిస్సాన్ ఇండియా ఆపరేషన్స్ ప్రెసిడెంట్ థామస్ కుహెట్ మాట్లా డుతూ.. ఆకర్షణీయమైన డిజైన్ ద్వారా ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో మంచి పోటీని ఇవ్వగలుగుతామన్నారు. ఇంధన సామర్థ్యం గురించి ప్రస్తావిస్తూ.. పె ట్రోల్ వెర్షన్ లీటరుకు రూ.14.23 కిలోమీటర్లకు, డిజెల్ వెర్షన్ లీటరుకు రూ.20.45 కిలోమీటర్లు మైలేజీ ఇస్తుం ది. పెట్రోల్ వెర్షన్ ధర రూ.9.55 లక్షల నుంచి రూ.10.95 లక్షల వరకు, డిజెల్ వెరియెంట్ రూ. 10.85 లక్షల నుంచి రూ.12.49 లక్షల వరకు, రూ.13.65 లక్షల నుంచి రూ.14.65 లక్షల వరకు నిర్ణయించింది.

## వర్చువల్ కన్సెల్టెన్స్‌కు శ్రీకారం
### ఏడు కొత్త ఆసుపత్రులతో ఎంఫైన్ ఒప్పందం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వర్చువల్ కన్సల్టేషన్లు, కనెక్టెడ్ కేర్ ద్వారా వైద్యసేవలు అందిస్తున్న ఎంఫైన్ సంస్థ హైదరాబాద్‌లో ఏడు కొత్త ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకుంది. కార్పొరేట్ ఉద్యోగుల కోసం ఔట్ పేషంట్ కేర్ ప్రోగ్రామ్ కింద వర్చువల్ కన్సల్టేషన్లు, కనెక్టెడ్ కేర్ అందుబాటులోకి తెస్తున్నట్లు ఎంఫైన్ సీఈవో ప్రసాద్ కొంపల్లి మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 80 ప్రీమియం ఆసుపత్రులలో 18 స్పెషాలిటీలతో, 300 మంది డాక్టర్లతో వర్చువల్ కన్సల్టేషన్లు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో మొత్తం 15 ఆసుపత్రుల ద్వారా ఈ సేవలు అందిస్తున్నామని, ప్రతినెలకు 12వేల కన్సల్టేషన్లు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం బెంగళూరు, హైదరాబాద్‌లో కేంద్రీకరించిన తమ సేవలను మరికొన్ని మెట్రో నగరాలకు విస్తరించనున్నట్లు ప్రసాద్ తెలిపారు.ఎంఫైన్ కార్పొరేట్ సబ్‌స్క్రిప్షన్ ద్వారా అపరిమితమైన కన్సల్టేషన్లు పొందవచ్చునని, దీంతోపాటు ఉద్యోగి, అతని కుటంబ సభ్యులకు వర్తిస్తుందని ఆయన తెలిపారు. గర్భిణీ స్త్రీలు, డయాబెటిస్, ఆర్థరైటిస్ లాంటి దీర్ఘకాల అనారోగ్యాలకు సంబంధిత వైద్య సేవలు కూడా పరిగణలోకి వస్తాయని ప్రసాద్ తెలిపారు. అలాగే ఇంటివద్దే ల్యాబ్ టెస్టింగ్, మెడిసిన్ డెలివరీ, అదనపు సేవలు లభిస్తాయని తెలిపారు.

## లాభాల స్వీకరణ
*•134 పాయింట్లు పతనం •గ్లోబల్ మార్కెట్లు బలహీనం*




**ముంబై** : స్టాక్ మార్కెట్ జోరుకు మంగళవారం బ్రేక్ పడింది. వరుసగా ఐదు రోజుల పాటు లాభాలతో దూసుకుపోయిన మార్కెట్లు.. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో మంగళవారం నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఇన్వెస్టర్లు లోహ, బ్యాంకింగ్, ఆటో రంగానికి చెందిన షేర్లపై లాభాలను స్వీకరిం చారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి ఈ ఏడాది, వచ్చే ఏడాది గ్లోబల్ వృద్ధిరేటు మందగమనంలో కొట్టుమి ట్టాడుతుందని తాజా నివేదికలో వెల్లడించడంతో దాని ప్రభావం గ్లోబల్ మార్కెట్లపై కనిపించింది. మా ర్కెట్లు ముగిసే నాటికి బీఎస్ఈ 134.32 పాయింట్లు క్షీణించి 36,444.64 వద్ద, నిఫ్టీ 39.10 పాయింట్లు నష్టపోయి 10,922.75 వద్ద స్థిరపడింది. ఇటీవల కా లంలో మార్కెట్లో ఏర్పడిన ర్యాలీపై ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారని మార్కెట్ విశ్లేషకులు అభి ప్రాయపడుతున్నారు. మొత్తానికి మార్కెట్లో సెంటి మెంట్ మాత్రం బలంగా ఉంది. క్యూ3 కార్పొరేట్ ఫలి తాలు అంచనాల కంటే మెరుగ్గా నమోదవుతున్నా యి. ఇక ట్రేడింగ్ విషయానికి వస్తే ఉదయం లాభా లతోనే 36,649.92 వద్ద మొదలై అటు తర్వాత 36,650.47కు ఎగబాకింది. దేశీయ సంస్థాగత మదు పరులు పెద్దెత్తున షేర్లు కొనుగోలు చేయడంతో పాటు రిటైల్ ఇన్వెస్టర్లు కూడా షేర్లు కొనుగోలు చేయడంతో సూచిలు ముందుకు దూసుకుపోయాయి. అయితే మధ్యాహ్నం నుంచి ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పా ల్పడ్డంతో క్రమంగా సూచి 36,282.93 మార్కుకు దిగివచ్చింది. చివరకు 134.32 పాయింట్లు క్షీణించి 36,444.64 వద్ద స్థిరపడింది. వరుసగా గత ఐదు ట్రేడింగ్ సెషన్‌లలో బీఎస్ఈ 725 పాయింట్ల వరకు లాభపడింది. నిఫ్టీ విషయానికి వస్తే 39.10 పాయింట్లు క్షీణించి 10,922.75 వద్ద స్థిరపడింది. ఇంట్రా డేలో 10,949.80 నుంచి 10,864.15 మధ్య తచ్చాడింది. గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది వచ్చే ఏడాది బల హీనంగా నమోదవుతుంద ని ఐఎంఎఫ్ ప్రకటించింది. అ యితే భారత్ ఆర్థిక వ్యవస్థ జోరందుకుంటుందని అంచనా వేసింది. భారత్ విషయానికి వస్తే.. ద్రవ్యలోటును కట్టడి చేయడం తలకు మిం చిన భారం అవుతుందని, డాలర్ మారకం తో రూపాయి బలహీనంగా నమోదు కావడం రెం డు ఇబ్బందికరమైన పరిస్థితులని మార్కెట్ విశ్లేషకులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నా రు. కాగా రూపాయి బలహీనపడ్డంతో ఐటి, ఫా ర్మా షేర్లు లాభాలతో దూసుకుపోయాయి. మిగిలిన ఇతర రంగాలకు చెందిన షేర్లు మాత్రం అ మ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. సోమవారం నాడు విదే శీ సంస్థాగత మదుపరులు రూ. 299.79 కోట్ల షేర్లు విక్రయిస్తే, దేశీయ సంస్థాగ త మదుపరులు రూ.520.80 కోట్ల షేర్లు కొను గోలు చేసినట్లు స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేశాయి. బీఎస్ఈలో నష్టపోయిన షేర్లలో వేదాంత 3.50 శాతం, టాటాస్టీల్ 3.13 శాతం, ఎంఅండ్ఎం 3.08 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 2.18 శా తం, భారతి ఎయిర్‌టెల్ 2 శాతం, మారుతి సుజుకి 1.84 శాతం, ఎల్అండ్‌టి 1.02 శాతం, ఏషియన్ పెయింట్స్ 0.99 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 0.86 శాతం, ప వర్‌గ్రిడ్ 0.73 శాతం, ఎస్‌బీఐ 0.70 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 0.63 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 0.61 శాతం, కోల్ ఇండియా, టాటామోటార్స్, టీసీఎస్, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఓఎన్‌జీసీలు కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

## అప్‌డేటెడ్ బలెనో బుకింగ్ షురూ

**న్యూఢిల్లీ:** మారుతి సుజుకి కి చెందిన అప్‌డేటెడ్ ప్రీమియం వెర్షన్ హెచ్‌బ్యాక్ బలేనో బుకింగ్‌లు మంగళవారం నుంచి ప్రారంభించింది. రూ.11వేలు చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చునని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నెలాఖరున లేదా వచ్చే నెల ప్రారంభంలో కొత్త కారును మార్కెట్లో విడుదల చేస్తుంది. అప్‌డేటెడ్ బలెనో విషయానికి వస్తే ముందుభాగంలో సరికొత్త డిజైన్‌తో కస్టమర్ల ముందుకు వస్తుంది. ఈ మోడల్‌కారుకు భద్రతా ఫీచర్లు అదనపు ఆకర్షణ. ముఖ్యంగా స్పీడ్ అలెర్ట్ సిస్టమ్, కో డ్రైవర్ సీట్ బెల్ట్ రిమైండర్, రెయిర్ పార్కింగ్ అసిస్ట్ సెన్సార్‌లు అదనపు ఆకర్షణ. దీంతో పాటు స్టాండర్డ్ డ్యూయెల్ ఎయిర్‌బ్యాగ్స్, చైల్డ్ సీట్ రెస్ట్రెయిన్ సిస్టమ్, ప్రీటెన్షనర్ అండ్ ఫోర్స్ లిమిటర్ సీట్‌బెల్ట్, ఏబీఎస్, ఈబీడి లాంటి ఫీచర్లు కూడా ఉంటాయని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. బలెనో విషయానికి వస్తే కేవలం 38 నెలల్లో 5 లక్షల యూనిట్లు విక్రయించి రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు మార్కెట్లో 5.2 లక్షల యూనిట్లు విక్రయించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

# ఏపీ రెవెన్యూ ఎంతో ఆదర్శం!

• భూ రికార్డుల నిర్వహణ, మీ సేవ భేష్ • అసోం రెవెన్యూ మంత్రి భాబేష్ కలిత్



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ శాఖలో చేపట్టిన సంస్కరణలు, ప్రజలు అమలు చేస్తున్న ఐటీ ఆధారిత సేవలపై అస్సాం రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి భాబేష్ కలిత్ ప్రశంసలు కురిపించారు. గత రెండు రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో భాబేష్ ప్రతినిధుల బృందం పర్యటించి, మంగళవారం మధ్యాహ్నం గుంటూరు జిల్లా వెలగపూడిలోని అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అస్సాం మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ ఆధారిత రెవెన్యూ సంస్కరణలు ఇతర అంశాలపై అధ్యయనం చేసేందుకు తమ రాష్ట్రం నుండి రెవెన్యూశాఖా ఉన్నతాధికారుల ప్రతినిధుల బృందంతో కలిసి తాను పర్యటిస్తున్నానని తెలిపారు. ఈపర్యటనలో భాగంగా కృష్ణాజిల్లా కంకిపాడు తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించి రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే తహశీల్దార్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల మధ్య ఏవిధంగా అనుసంధాన ప్రక్రియ నిర్వహిస్తున్నారో అస్సాం రాష్ట్ర ప్రతినిధుల బృందం పరిశీలించింది. రాష్ట్రంలో ఎక్కడి నుండైనా రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం పట్ల అస్సాం రెవెన్యూ శాఖామంత్రి భాబేష్ కలిత్ పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న రెవెన్యూ నూతన సంస్కరణలు, ఐటీ ఆధారిత సేవలను ఏవిధంగా ప్రజలకు వీలైనంత త్వరగా అందించాలో అనే విషయంపై అధికారులు సీఎస్ పునేఠతో చర్చించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రెవెన్యూ సంస్కరణలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న మొట్టమొదటి రాష్ట్రంగా ఏపీ కీర్తి గడించిందని చెప్పారు. ముఖ్యంగా ఆన్‌లైన్ విధానంలో భూముల రిజిస్ట్రేషన్ రాష్ట్రంలో ఎక్కడి నుండైనా చేసుకునే అవకాశం కల్పించామన్నారు. భూ రికార్డులన్నింటినీ డిజిటలైజేషన్ చేసి, ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచామని, తద్వారా భూములు అన్యాక్రాంతం కాకుండా నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రెవెన్యూశాఖలో సంస్కరణలతో ప్రజలు ఇబ్బందులు 90 శాతం తీర్చగలిగామన్నారు. సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రాన్ని అస్సాం రెవెన్యూ మంత్రితో కూడిన ప్రతినిధుల బృందం పరిశీలించింది. రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా ప్రజల నుండి వివిధ సమస్యలను తెలుసుకోవడం, వాటికి ఎప్పటికప్పుడు పరిష్కార మార్గాలు చూపించడంతో పాటు వారి స్పందనను తెలుసుకుంటున్నామన్నారు. ఈ భేటీలో అస్సాం రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి కలిత్‌తో పాటు అస్సాం ఎమ్మెల్యే నారాయణ డేక, రెవెన్యూశాఖ కార్యదర్శి లలిత్ గొగోయ్, డిప్యూటీసెక్రెటరీ ముకుట్ భుఖాన్, ధీరజ్ సౌధ్, అరుప్ జ్యోతి హజారిక, అస్సాం ముఖ్య మంత్రి ఏఎస్డీ రంజిత్ మంజుదార్, రెవెన్యూశాఖ మంత్రి ఓఎస్డీ భాస్కర్ సైకా, రాంజియ సబ్ రిజిస్ట్రార్ మంజిత్ దాస్, బొంగైగాన్, తిన్సుకియా సర్కిల్ ఆఫీసర్లు రింటూ సిహెచ్ బోరో. రెవెన్యూ సర్కిల్ అధికారి ప్రదీప్ కలిత్, రాష్ట్ర సీసీఎల్ఏ కార్యాలయానికి చెందిన రాంబాబు తదితరులు ఉన్నారు.

### మరికొన్ని రాష్ట్రాల ప్రతినిధులు: డిప్యూటీ సీఎం కేఈ

రాష్ట్ర రెవెన్యూశాఖలో ప్రవేశపెట్టిన సంస్కరణల అమలు తీరును పరిశీలించేందుకు దక్షిణ, ఉత్తర రాష్ట్రాలకు చెందిన రెవెన్యూశాఖ మంత్రులతోపాటు ఇతర అధికారులతో కూడిన ప్రతినిధుల బృందాలు పర్యటించేందుకు రావాలని ఉందంటూ తనకు లేఖలు రాస్తున్నారని డిప్యూటీ సీఎం (రెవెన్యూ-దేవాదాయ) కేఈ.కృష్ణమూర్తి తెలిపారు. గత రెండు రోజులుగా రాష్ట్రంలో అస్సాం రెవెన్యూశాఖ మంత్రితో కూడిన ప్రతినిధుల బృందం పర్యటించింది. ఇక్కడి పనితీరుపట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూనే, అస్సాం సంస్కరణలు చేపడతామని చెప్పడంపై కేఈ.కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు, ప్రభుత్వశాఖల్లో ప్రవేశపెట్టిన నూతన విధానాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారడాన్ని ఆయన స్వాగతిస్తూ.. ఇది చంద్రబాబు నాయుడు ఘనవిజయంగా పేర్కొన్నారు.

# పోటీ ప్రపంచంలో నవ్యాంధ్ర టాప్!

• వాణిజ్య గమ్యస్థానంలో అగ్రగామి

• గ్లోబల్ కాంపిటేటివ్ ఫ్లైయర్‌ను విడుదల చేసిన సీఎం



**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రపంచంలో నాల్గవ పారిశ్రామిక విప్లవం నేపథ్యంలో వివిధ రంగాల్లో పోటీతత్వాన్ని ప్రదర్శిస్తున్న దేశాల్లో భారత్‌కు మంచి పేరు ప్రఖ్యాతులు లభించగా అందులో నవ్యాంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచింది. ముఖ్యంగా అవశేష ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతుల కల్పన, వివిధ సంస్థల ఏర్పాటు, సులభతర వాణిజ్యం తదితర రంగాలలో పకడ్బందీ ప్రణాళికలను రూపొందించుకొని సాగుతున్న నేపథ్యంలో వాణిజ్య గమ్యస్థానంలో ఆంధ్రప్రదేశ్‌కు 49వ ర్యాంక్ లభించింది. వాణిజ్యంలో మన దేశంలోనే కాక, తూర్పు ఐరోపా ఆర్థిక వ్యవస్థలను మించి ఆంధ్రప్రదేశ్ వ్యాపార వాణిజ్యరంగాల్లో ఒక అడుగు ముందు ఉన్నదని వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశంలోనే నిరూపించుకుంది. దీనికి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ కాంపిటేటీవ్ ఇండెక్స్ 4.0 ఫ్లయర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం సచివాలయంలో విడుదల చేశారు. సీఐఐ రాష్ట్ర చైర్మన్ ఆర్.వీ.ఎస్.రుద్ధరాజు, రాష్ట్ర ప్రణాళికాశాఖ ప్రత్యేక కార్యదర్శి పి.చలపతి రావు, ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ దక్షిణామూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ అధ్యయన ఫలితాలను విశ్లేషిస్తే ఆంధ్రప్రదేశ్ ముఖ్యంగా లేబర్ మార్కెట్, ఆర్థిక నిర్వహణ నైపుణ్యాభివృద్ధి రంగాల్లో యావత్ దేశం సాధించిన దానికంటే అధిక వృద్ధిని సాధించినట్లు విధితమవుతుంది. భూ పరిపాలనాశాఖ పనితీరులో నవ్యాంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానాన్ని సాధించడమే కాకుండా వృద్ధి రేటును పెంచుకోవడంలోనూ ఇతర వ్యవస్థలతో పోటీ పడుతూ ఎదుగుతోందని ఈ అధ్యయన నివేదికలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్నట్లుగా 2029 నాటికి ప్రగతిని నమోదు చేసుకోవడంతో పాటు 2050 నాటికి వ్యాపార వాణిజ్య సంస్థల ఏర్పాటులో యావత్ ప్రపంచం ఆంధ్రప్రదేశ్ వైపే దృష్టిసారించే విధంగా ఈ అధ్యయన నివేదిక అద్దం పడుతోంది.

# మోడల్‌గా ఏపీ దేవాదాయశాఖ

దేవాదాయశాఖ ప్రభుత్వ సలహాదారు చెరువు రామకోటయ్య



**(కాకినాడ, ప్రభన్యూస్):** దేశంలోనే ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖను మోడల్‌గా తీర్చిదిద్దుతామని శాఖ ప్రభుత్వ సలహాదారు చెరువు రామకోటయ్య స్పష్టం చేశారు. తొలిసారి ఆయన మంగళవారం తూర్పుగోదావరిలో పర్యటించారు. కాకినాడలో కార్యనిర్వహణాధికార్లు, అర్చకులు, ఆలయాల సిబ్బందితో సమావేశం జరిపారు. వారెదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. త్వరలోనే ఆలయ సిబ్బంది, కార్యనిర్వహణాధికారుల డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తుందని రామకోటయ్య హామీనిచ్చారు. అర్చకులకు 2015పిఆర్‌సిని అమలు చేస్తామన్నారు. దాని పరిధిలోకి రానివారందరికీ నెలవారీ పదివేల కనీస వేతనం చెల్లిస్తామన్నారు. అర్చకులకు ఆరోగ్య బీమా అమలు చేయాలన్న డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇఓల పదోన్నతులకు త్వరలోనే డిపిసి ఏర్పాటు చేస్తామన్నారు. అర్చక ఈనాం భూముల పట్టాదార్ పాస్‌పుస్తకాలపై వారిపేర్లు నమోదు చేసేలా కలెక్టర్లకు ఆదేశాలు పంపిస్తామన్నారు. దీనివల్ల రైతులకిప్పుడు ప్రభుత్వమిస్తున్న ఆర్థికసాయం నేరుగా అర్చకులకు అందుతుందన్నారు. ఈ పుస్తకాలపై బ్యాంకులు, సొసైటీల్లో రుణాలు లభిస్తాయన్నారు. జిఓ 76అమలుకు సంబంధించి త్వరలోనే నిబంధనలు రూపొందిస్తామన్నారు. అర్చకుల రిటైర్మెంట్, వంశపారంపర్య హక్కులకు సంబంధించి నిర్ణయం తీసుకోవడం కష్టమన్నారు. ఈ విషయంలో ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తున్నారన్నారు. అందరికీ ఆమోదయోగ్య నిర్ణయానికి ప్రయత్నిస్తామన్నారు. తమ శాఖ ద్వారా హిందూధర్మ ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. దివ్యదర్శనం పేరిట భక్తుల్ని ఏడు పుణ్యక్షేత్రాలకు ఉచితంగా తీసుకెళ్తున్నామన్నారు. తానిచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత కూడా తనదేనన్నారు. అర్చకులు, ఆలయాల సిబ్బంది ప్రభుత్వానికి విశ్వసనీయంగా ఉండాలన్నారు.

# ఆర్జీవీకి హైకోర్టు నోటీసులు

• ఎమ్మెల్యే వర్మ పిల్‌ను స్వీకరించిన ఉన్నత న్యాయస్థానం

• లక్ష్మీస్ ఎన్టీఆర్ నిర్మాత, సెన్సార్ బోర్డులకు సైతం నోటీసులు

• నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం



**పిఠాపురం, ప్రభన్యూస్:** వివాదాస్పద సినీ దర్శకుడు రామగోపాల వర్మపై తీస్తున్న లక్ష్మీస్ ఎన్టీఆర్ చిత్రంను నిలుపుదల చేయాలని తాను హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వాజ్యాన్ని ఉన్నత న్యాయ స్థానం విచారణకు స్వీకరించినట్లు తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ తెలిపారు. చిత్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ, నిర్మాణ రాకేష్ రెడ్డిలతో పాటూ సెంట్రల్ సెన్సార్ బోర్డుకుసైతం నోటీసులు జారీ చేసిందని తెలిపారు. ఆయన మంగళవారం హైదరాబాద్ నుంచి స్థానిక విలేకరులతో మాట్లాడారు. దర్శకుడు తాను తీస్తున్న లక్ష్మీస్ ఎన్టీఆర్ చిత్రంలో కుట్ర దగా పాటపై వర్మ గత నెల 23నే అభ్యంతరం తెలిపారు. దీనిపై కోర్టులో రిట్ సైతం దాఖలు చేశారు. అయితే ఇది వ్యక్తిగతమైనది కాదని ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసుకోవాలని కోర్టు సూచించిన మీదట పిల్ వేసినట్లు వర్మ చెప్పారు. వర్మ చిత్రంలో కుట్ర దగా పాట అభ్యంతరకంగా వుందని, తెలుగు ప్రజలు దైవంగా భావించే ఎన్టీఆర్ జీవిత చరిత్రను తప్పుదారి పట్టించి భావి తరాలకు ఆయన పట్ల గౌరవం లేకుండా చేయడానికి ఆర్జీవీ కుట్ర చేస్తున్నాడని వర్మ ఆరోపించారు. వర్మ వెనుక వైకాపా వుండి నాటకం ఆడుతోందన్నారు. లక్ష్మీస్ ఎన్టీఆర్ నిర్మాత వైకాపా యువ నాయకుడని వర్మ చెప్పారు. అలాగే ఈ పాటలో ఒక పథకం ప్రకారం సీఎం చంద్రబాబు నాయుడును అవమానం చేయాలని, ఎన్నికల ముందు పార్టీ ప్రతిష్ట దెబ్బతీయాలని వర్మ కుట్ర చేశాడన్నారు. కొన్ని కోట్ల మంది ఆరాధించే సీఎం చంద్రబాబు ప్రతిష్టకు ఈ చిత్రం భంగం కలిగిస్తుందన్నారు. సెన్సార్ బోర్డు స్పందించి కుట్ర దగా పాటను బ్యాన్ చేయాలని కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కోర్టు నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ప్రతివాధులను నోటీసులో ఆదేశించినట్లు వర్మ చెప్పారు. న్యాయస్థానాలపై తనకు నమ్మకం వుందని, న్యాయస్థానం తనకు పూర్తి న్యాయం చేస్తుందని నమ్ముతున్నానని వర్మ చెప్పారు.

# 24న పీఎస్‌ఎల్‌వీ-సీ44 ప్రయోగం

• సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టిన ఇస్రో శాస్త్రవేత్తలు




**సూళ్లూరుపేట, ప్రభన్యూస్ :** భారత అంతరిక్షపరిశోధన సంస్థ కొత్త ఏడాదిలో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. రెండు స్ట్రాపాన్ బూస్టర్ల సహాయంతో అంతరిక్షానికి దూసుకువెళ్లే పీఎస్‌ఎల్‌వీ -సీ44 ఉపగ్రహ వాహక నౌకను ఈ ప్రయోగానికి సిద్ధం చేస్తున్నారు. శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన షార్‌లో ఇందుకు సంబంధించిన రాకెట్ అనుసంధాన పనులను పూర్తి చేశారు. ఈ నెల 24వ తేదీ రాత్రి 11.37గంటలకు పీఎస్‌ఎల్‌వీ -సీ44 ప్రయోగానికి శ్రీకారం చుట్టిన ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగానికి సంబంధించి ఎంఆర్‌ఆర్ సమావేశాన్ని బుధవారం కమిటీ చైర్మన్ బీఎస్ సురేష్ ఆధ్వర్యంలో ప్రయోగ సమాలోచనలు జరిపి ఇందుకు అవసరమైన సన్నాహాలలో నిమగ్నం కానున్నారు. ఈ సమావేశంలో రిహార్సల్స్ జరిగిన తీరును పరిశీలించిన అనంతరం రాకెట్ ప్రయోగానికి సిద్ధమైందని గుర్తించిన అనంతరం కౌంట్‌డౌన్ సమయాన్ని శాస్త్రవేత్తలు వెల్లించనున్నారు. ఆ తరువాత ప్రయోగానికి లాంచ్ ఆథరైజేషన్ బోర్డు మరోసారి సమావేశమై ప్రయోగానికి పచ్చజెండా ఊపుతారు. పీఎస్‌ఎల్‌వీ -సీ44 ప్రయోగం పీఎస్‌ఎల్‌వీ రాకెట్ సరీస్‌లో 46వ ప్రయోగంగా ఇస్రో వర్గాలు వెల్లడించాయి. గతంలో ఆరు స్ట్రాపాన్ బూస్టర్ల సహాయంతో నింగిలోకి రాకెట్ ప్రయోగాలను విజయవంతంగా చేపడుతున్న ఇస్రో శాస్త్రవేత్తలు కొత్త ఏడాది సరికొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టి రెండు స్ట్రాపాన్ బూస్టర్లతో రాకెట్ ప్రయోగం చేపట్టే విధంగా కృషిచేస్తున్నారు. ఉపగ్రహాల బరువు చాలా తక్కువ కావడంతో ఖర్చు తగ్గించుకునే ప్రయత్నంలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లతో ప్రయోగం చేస్తున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికకు సంబంధించిన మొబైల్ సర్వీస్ టవర్ నాలుగు దశల అనుసంధాన పనులను సంపూర్తిచేసి ప్రయోగ వేదిక వద్దకు రాకెట్‌ను చేర్చారు. 44.4 మీటర్ల ఎత్తున పీఎస్‌ఎల్‌వీ -సీ 44 రాకెట్ ప్రయోగ సమయంలో ఇంధనంతో కలిపి 290 టన్నుల బరువుతో నింగిలిలోకి దూసుకువెళ్లనుంది. ఈ ప్రయోగం 13.55 నిమిషాల్లోనే పూర్తి చేసేందుకు సర్వం సిద్ధం చేశారు.

తమిళనాడుకు చెందిన హైస్కూల్ విద్యార్థుల బృందం తయారు చేసిన కలాంశాట్, మైక్రోశాట్ -ఆర్ అనే రెండు తేలికపాటి ఉపగ్రహాలను భూమికి అత్యంత చేరువలోని సూర్యానువర్త కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఎన్నో భారీ రాకెట్ ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి భారతదేశ సత్తాను చాటిన ఇస్రో శాస్త్రవేత్తలు మరోసరికొత్త ప్రయోగానికి నాంది పలికి రెండు స్ట్రాపాన్ బూస్టర్లతోనే రాకెట్‌ను నింగిలోకి పంపేందుకు సమాయత్తం అవుతూ అందుచూపు ఇస్రో వైపు అన్నట్లుగా అడుగులు వేస్తున్నారు.

# జగన్ కుట్రలకు ప్రగతి ఆగదు

• మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఏపీకి సహాయ నిరాకరణ చేస్తున్న మోడీ, అభివృద్ధిలో పోటీ పడలేని కేసీఆర్‌లతో లాలూచీ ఒప్పందాలు చేసుకొని పరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి రాకుండా వైఎస్ జగన్ కుట్ర రాజకీయాలను చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమర్‌నాథ్ రెడ్డి తెలియజేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం 16 ప్రశ్నలతో కూడిన ఒక బహిరంగ లేఖను ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌కు రాశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మేనియాతో వందలాది పరిశ్రమలు ఏపీకి తరలివస్తుండటంతో పారిశ్రామిక రంగం ప్రగతిపథంలో దూసుకుపోతోందన్నారు. 2013-14లో ఏపీలో పారిశ్రామిక ప్రగతి మైనస్ 4 శాతంగా ఉండేదని, నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన గత నాలుగున్నరేళ్లలో ఆయన చేపట్టిన సంస్కరణలు, ఇచ్చిన ప్రోత్సహకాలు, రాయితీలతో నేడు జాతీయ స్థాయిలో 9.52 శాతంతో ప్రగతిపథంలో దూసుకుపోతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన మూడు పారిశ్రామిక భాగస్వామ్య ఒప్పందాలతో రూ.1.77 లక్షల కోట్లతో 210 ప్రాజెక్టులు తమ ఉత్పత్తులను ప్రారంభించాయని, వీటి ద్వారా 2.51 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను టీడీపీ ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనిని ఓర్వలేక ఢిల్లీ మోడీ, తెలంగాణ మోడీలతో జతకట్టి భాగస్వామ్య సదస్సును అడ్డుకునే కుట్రలు చేయడం, పారిశ్రామిక వేత్తలు వచ్చిన సమయంలో బంద్‌లు, అలజడులు సృష్టించడం, తప్పుడు మెయిల్స్ ద్వారా పెట్టుబడులు పెట్టకుండా అడ్డుకోవాలని ప్రయత్నాలు చేయడం ద్వారా పారిశ్రామిక రంగ ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు.

**కన్నా... కాపుల ద్రోహి : ఎమ్మెల్సీ సతీష్**

కాపుల రిజర్వేషన్‌ల కలను సాకారం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు కాపులకు దేవుడిలా మారితే సొంత సామాజిక వర్గానికి కేంద్రంలోని మోడీ సర్కార్ చేస్తున్న అన్యాయంపై నోరు మెదపక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కాపుల ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయాడని ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధి కోసం బీజేపీ పాలకులు అగ్రవర్ణాల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించగా, అందులో 5 శాతం కాపులకు కేటాయిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంపై యావత్ కాపుజాతి హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోందని తెలిపారు.

# అగ్ర వర్గాలకు 10శాతం రిజర్వేషన్‌పై నిరసన

• ఢిల్లీలో బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం




**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకంగా ఉన్నత కులాల వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఓబీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ప్రకటించారు. ఆర్థికంగా వెనకబడినప్పటికి బీసీ కులాల వారిని పది శాతం రిజర్వేషన్ నుంచి తప్పించడం రాజ్యాంగ విరుద్ధమని, ఈ అన్యాయంపై సుప్రీంకోర్టులో పోరాడతామని, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన ప్రకటించారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్ర వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ల కల్పనకు వ్యతిరేకంగా మంగళవారం ఢిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి 11 రాష్ట్రాల వెనకబడిన తరగతుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు చెందిన బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన తరగతులు అనేక్లాజ్ చెల్లదని వివరించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సమయంలో గళమెత్తుతామని ఆయన వెల్లడించారు.

# 104 సిబ్బంది మెరుపు సమ్మె



**అమరావతి, ఆంధ్రప్రభ:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 104 సిబ్బంది సమ్మెకు దిగారు. దీంతో మంగళవారం నుంచి 104 సర్వీసులు రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు సేవలందిస్తున్న 292 వాహనాలను నిలిపివేశారు. ప్రధానమైన రెండు డిమాండ్లతో పాటు మరో 11 సమస్యల పరిష్కరించాలని సమ్మెకు దిగారు. 104 సర్వీసుల ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సింహాచలం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ లను అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపారు. తాము కొత్తగా ఆశించడం లేదని స్పష్టం చేశారు.

# ఫైలేరియా లేని ప్రపంచాన్ని చూడటమే లక్ష్యం

• విశాఖ జిల్లాలో విదేశీ బృందం పర్యటన



**కశింకోట, ప్రభన్యూస్:** ఫైలేరియా లేని ప్రపంచాన్ని చూడడమే లక్ష్యంగా ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తున్నామని విదేశీ ప్రతినిధులు పేర్కొన్నారు. విశాఖ జిల్లా కశింకోటలో మంగళవారం వారు పర్యటించి వ్యాధిగ్రస్తుల స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫైలేరియా నివారణకు మల్టీ నేషనల్ కంపెనీ ఈసాయి ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో విదేశీ ప్రతినిధులైన డీఈసీ మేనేజర్లు జపాన్, మలేషియా, ఇండోనేషియాకు చెందిన ప్రతినిధులు కశింకోట పీహెచ్‌సీని సందర్శించి ఫైలేరియా వ్యాధిగ్రస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్‌రోస్టు టన్, అయ టోక్‌నాగా, ఇస్టియా సా హందాయనల్, శ్రీకాంత్ దేశ్ ముఖ్, రీషా, కమటా, చిహిరో టాక్యమా, సచికో నంబా, కజ్‌నూరి తాకాశిలతో పాటు ఈసాయి ఫార్మా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అచ్యుత రామారావు, మోటో హిరో సకేయి, జోసప్ కిరణ్‌కుమార్‌లు ఈ బృందంలో ఉన్నారు. ఫైలేరియా బాధితులకు ఈసాయి ఫార్మా సేవలు అభినందనీయమన్నారు. డీఈసీ విదేశీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 28 దేశాల్లో, 1.5 మిలియన్ల డీఈసీ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలోనే మతిమరుపు, క్యాన్సర్ వ్యాధులకు కూడా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. వ్యాధిగ్రస్తులైన మాణిక్యం, గోపాలం, బుద్ద సైదు, రమణ, మల్లలక్ష్మి, అక్క మ్మ, చేబ్రోలు వరలక్ష్మిలు మాట్లాడుతూ ఫైలేరియా కారణంగా వారు పడుతున్న ఇబ్బందులను వివరించారు. మల్ల లక్ష్మి అనే మహిళ తమ కుటుంబానికి ఫైలేరియా వారసత్వంగా వస్తుందని పేర్కొంది. డీఈసీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం అందిస్తున్న మందులు పనితీరు భవిష్యత్తులో మార్పులు చేయవలసిన ఆవశ్యకత ఉందని, కొత్తకొత్త మందులను కనుగొని ఫైలేరియా లేని ప్రపంచాన్ని చూడటమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని అన్నారు.

రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని వాటికి అనుగుణంగా భావితరాలలో ఇటువంటి ఇబ్బందులు లేకుండా చూడటమే లక్ష్యంగా పనిచేస్తు న్నామన్నారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో విదేశీ బృందం మొక్కలు నాటారు. విద్యార్థులు ప్రదర్శించిన తెలుగు సంస్కృతి కార్యక్రమాలు వారిని అలరించాయి. పీహెచ్‌సీ సిబ్బంది ఏర్పాటు చేసిన లార్వా ఉత్పత్తి ఏవిధంగా ఉంటుంది, వాటి నివారణకు ఏ చర్యలు తీసుకోవాలి ప్రదర్శన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పంచదార్ల లక్ష్మి, టీడీ పీ సీనియర్ నాయకులు పెంటకోట రాము, పీహెచ్‌సీ ఎన్‌పీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, స్టాప్ నర్సు సుమతి, హెల్త్ సూపర్‌వైజర్ సాంబశివరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనవరి-డిసెంబర్‌గా ఆర్థిక సంవత్సరం!

యోచనలో కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఏప్రిల్-మార్చిగా పరిగణిస్తున్న ఆర్థిక సంవత్సరాన్ని జనవరి-డిసెంబర్‌గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు త్వరలో ప్రకటన వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తి చక్రంతో ఆర్థిక సంవత్సరాన్నిఅనుసంధానించాలని ప్రభుత్వం భావిస్తోంది. గతేడాది నీతిఆయోగ్‌లో ముఖ్యమంత్రులు సమావేశంలో ఈ ప్రతిపాదనను ప్రధాని మోడీ సమర్థించారు. వ్యవసాయ ఆధారిత ఆదాయ దేశానికి చాలా ముఖ్యమని, వ్యవసాయం ఆదాయం వచ్చిన తర్వాత బడ్జెట్‌ను ప్రవేశపెడితే బావుంటుందని ప్రధాని వెల్లడించారు. రుతుపవనాలు జూన్ నెలలో వస్తుండడంతో పథకాలు, రాష్ట్రాల వ్యయాలను అక్టోబర్ వరకు అమలు చేసే పరిస్థితి లేదని, పథకాలను అమలు చేసేం దుకు కేవలం ఆరు నెలలు మాత్రమే మిగులుతోందని మోడీ అన్నారు. ఆర్థికసంవత్సరాన్ని మార్చే విషయమై రెండేళ్ల క్రితమే ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ తన నివేదకను ప్రభుత్వానికి అందజేసింది. ఆర్థిక సంవత్సరం మార్పును సమర్థిస్తూ కారణాలను నివేదికలో పొందుపరచింది. ఇదిలావుండగా ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టే విధానాన్ని కూడా బీజేపీ ప్రభుత్వం మొదలుపెట్టిన సంగతి తెలిసిందే.

# మాణిక్యాలరావు దీక్ష రాజకీయ ప్రేరేపితం

• మంత్రి కాల్వ శ్రీనివాసులు సెటైర్లు



**తణుకు, ప్రభన్యూస్:** రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అన్యాయాన్ని గ్రహించి ఎన్డీయే కూటమి నుండి విడిపోయినట్లు గ్రామీణ గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖామంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. తణుకు మండలం తేతలి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు చేస్తున్న దీక్ష కేవలం రాజకీయ కోణంలోనే జరుగుతోందన్నారు. ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. టీడీపీతో పొత్తు లేకుంటే అసలు ఆయన మంత్రి అయ్యేవారా అంటూ ఘాటుగా విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఒక చారిత్రాత్మక అవసరమని ఉద్ఘాటించారు. పేదలకు ఇళ్ళు కట్టించే పవిత్రమైన కార్యక్రమం చేపట్టింది ఒక్క టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 76వేల ఇళ్ళు కట్టిస్తామని హామీ నిచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్, 14వేల ఇళ్ళు మాత్రమే కట్టించారని, అటువంటిది కేవలం తణుకులోనే 10వేల ఇళ్ళు నిర్మించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. రాష్ట్రంలో 20లక్షల మంది పేదలకు ఇళ్ళు నిర్మించడమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారన్నారు. నాడు తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో నిలబెట్టడానికి ఎన్టీఆర్ కృషి చేస్తే, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న ప్రధాని మోడీని ఢీకొడుతున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు అంటే బిల్లు లేని ఇల్లు అంటూ ఎద్దేవా చేశారు. పేదలకు గూడు అనే సాకుతో సుమారు 4వేల కోట్లు స్వాహా చేశారని విమర్శించారు. దేశంలో గర్వించదగ్గ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలతో ప్రతిపక్షాల్లో గుబులు

- మోడీ భజనపరుల ఓటమి ఖాయం
- ఆటో,ట్రాక్టర్లపై లైఫ్ ట్యాక్స్ రద్దు శుభపరిణామం
- సీఎంగా చంద్రబాబు మరోసారి ఎన్నిక కావడం ఖాయం
- మంత్రి ఎన్ఎండీ ఫరుక్, జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్



**కర్నూలు, ప్రభ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతిపక్షాలలో గుబులు రేగుతోందని, వారి ఓటమి ఖాయమన్న విషయం తెలియడం వల్లే సీఎం చంద్రబాబునాయుడుపై అర్థంలేని విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర వైద్య, విద్య శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్‌లు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా తెదేపా కార్యాలయం వద్ద చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఆటోల యజమానులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, తెదేపా కార్యదర్శి నాగేశ్వరరావుయాదవ్, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మల్లికార్జునరెడ్డితో పాటు పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు. ఆటోవాలాలతో కలిసి క్షీరాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జిల్లా తెదేపా కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. సోమిశెట్టి మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం తీసుకోనటువంటి నిర్ణయాన్ని చంద్రబాబు తీసుకున్నారని, ఆటో, ట్రాక్టర్ల లైఫ్ ట్యాక్స్‌ను రద్దుచేసి ముఖ్యమంత్రి మంచి నిర్ణయం తీసుకున్నారని ఇదొక చరిత్రగా నిలిచిపోతుందన్నారు. పోలవరాన్ని పూర్తిచేయడానికి ముఖ్యమంత్రి గట్టి పట్టుదలతో వారానికి ఒకరోజు కేటాయిస్తూ పనిచేస్తుంటే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం అర్ధరహిత మన్నారు. కేంద్రంలోని బీజేపీ మంత్రి గడ్కరీ రాష్ట్రానికి వచ్చి ప్రభుత్వ పనితీరు బాగుందంటూ ప్రశంసలు చేస్తుంటే బీజేపీ నాయకులు మాత్రం దుమ్మెత్తిపోయడం నీచమైన చర్య అని పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల అనంతరం మోడీ గుజరాత్‌కు వెళ్లి టీ వ్యాపారం చేసుకోవాల్సిందేనని వ్యంగ్యంగా అన్నారు. ఆంధ్ర వారు కుక్కలు అన్న కేసీఆర్‌తో జగన్ అంటకాగుతున్నారని, ఫెడరల్ ఫ్రంట్‌లో జగన్, కేసీఆర్ తప్ప ఎవ్వరూ ఉండబోరన్నారు. చంద్రబాబు సమన్వయంతో దేశంలోనే అతిపెద్ద కూటమి ఏర్పడిందని, 22 పార్టీల నాయకులు అందరూ ఏకమయ్యారన్నారు. వివిధ సంక్షేమ పథకాలైన పింఛన్ల పెంపు, డ్వాక్రా మహిళలకు పసుపు-కుంకుమ కింద ఆర్ధిక సహాయం, రైతులకు పంట పెట్టుబడి సహాయం వంటి అనేక పథకాలను సమర్ధవంతంగా అమలుచేయబోతున్న చంద్రబాబుకే వచ్చే ఎన్నికలలో ప్రజలు మరోసారి సీఎం పీఠాన్ని అప్పగించ బోతున్నారన్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ, 1983లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్టీఆర్, అప్పట్లో ఉన్నటువంటి సైకిల్, ఎడ్లబండ్లపై ఉన్న ట్యాక్స్‌ను రద్దుచేశారని, ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఆటోలు, ట్రాక్టర్లపై లైఫ్ ట్యాక్స్ రద్దుచేసి వారికి చేయూతనందించారన్నారు. పోలవరం ప్రాజెక్టు కోస్తా జిల్లాలకు జీవనాడిగా ఉన్నా వాస్తవానికి రాయలసీమకు పోలవరం జీవనాడి వంటిదని, శ్రీశైలం నీటిని రాయలసీమకు పూర్తిగా వాడుకునేందుకు పోలవరం వల్ల సాధ్యమవుతుందన్నారు. పట్టిసీమ వల్ల శ్రీశైలం నుండి రాయలసీమకు ప్రస్తుతం నీటిని వాడుకుంటున్నామన్న విషయాన్ని మరువకూడదని, సీఎం చంద్రబాబు పట్టిసీమను నిర్మించినప్పుడు వ్యంగ్యంగా మాట్లాడిన వారే ప్రస్తుతం రాయలసీమకు వస్తున్న నీటిని చూసి నోరు మెదపలేకపోతున్నారన్నారు. ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి సీఎం కావడం తథ్యమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నంద్యాల నాగేంద్ర, సోమిశెట్టి నవీన్, హనుమంతరావుచౌదరి, మహేష్‌గౌడ్, బివికె పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర పర్యటనకు రాజధాని రైతులు

- 600 ఎకరాల్లో ఏర్పాటైన మగర్ పట్టా
- గ్రామ సందర్శనకు నేడు పయనం



**అమరావతి, ఆంధ్రప్రభ :** అమరావతి రైతులు మహారాష్ట్రలోని పూణే సమీపంలోని మగర్ పట్టా టౌన్‌షిప్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సందర్శించేందుకు గాను ఈ నెల 23వ తేదీన తుళ్లూరు నుంచి బయలుదేరనున్నారు. విజయవాడ ఏపీసీఆర్డీయే కార్యాలయంలో రాజధాని రైతులకు ఈ నెల 1వ తేదీ నుంచి 20 రోజుల పాటు ఎంటర్‌ప్రైనర్‌షిప్ ఆన్ రియల్ ఎస్టేట్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ శిక్షణలో భాగంగా రైతులను ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా తీర్చిదిద్దేందుకు, తద్వారా వారు ప్రత్యామ్నాయ వృత్తిని చేపట్టేందుకు అవసరమైన శిక్షణను అందించడం జరుగుతోంది. ఇంతవరకు రైతులు తిరిగి పొందిన ప్లాట్లను రియల్ ఎస్టేట్‌గా మార్చుకుని లబ్ధి పొందేందుకు ఏపీ రేరా చట్టం పైన, జోనల్ రెగ్యులేషన్స్, ప్లానింగ్, మార్కెటింగ్, ఫైనాన్సింగ్ వంటి అంశాల్లో అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా కేవలం రైతులు అభివృద్ధి పరచుకున్న మగర్ పట్టా టౌన్‌షిప్‌ను ఈ శిక్షణ పొందిన రైతులు సందర్శించి అక్కడి భాగస్వాములతో చర్చిస్తారు. మహారాష్ట్రలోని పూణే సమీపంలోని ఒక కుగ్రామం హడస్పర్. దీన్ని సతీష్ మగర్ అధ్యక్షతన అక్కడి రైతులు 600 ఎకరాల ఈ కుగ్రామాన్ని సంయుక్త భాగస్వామ్యంలో వాణిజ్య నివాస నగరంగా తీర్చిదిద్దుకున్నారు. 30 శాతం గ్రీన్‌స్పేసెస్‌తో సహా స్కూళ్లు, ఆస్పత్రులు, ఇతర వాణిజ్య సముదాయాలను అభివృద్ధి పరచుకున్నారు. డెస్టినేషన్ సెంటర్ పేరుతో పెద్ద వాణిజ్య సముదాయాన్ని నిర్మించుకున్నారు. ఇక్కడ అభివృద్ధిలో కీలకం భాగస్వామ్యమే. ఈ విజయ గాథను అమరావతి రైతులు స్వయంగా తెలుసుకోనున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు తుళ్లూరు నుంచి 45 మంది రైతులు బయలుదేరి విజయవాడ ఏపీసీఆర్డీయే కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హైదరాబాద్ మాదాపూర్ ఐటీ హబ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలిలను సందర్శించి 24వ తేదీన మగర్ పట్టా చేరుకుంటారు. మధ్యలో నాందేడ్ టౌన్‌షిప్‌ను సందర్శిస్తారు. తిరిగి 26 ఉదయం విజయవాడ చేరుకుంటారు. ఈ బృందంలో సీఆర్డీఏ సీనియర్ అర్బన్ ప్లానర్, ఆర్కిటెక్ట్ వెంకటరమణ, అమర్ రైతులతో సందర్శన యాత్రలో పాల్గొననున్నారు.

## ఏపీలో టీడీపీ ఖాళీ ఖాయం

- వైసీపీ నేత బొత్స

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ త్వరలోనే ఖాళీ కావటం ఖాయం అని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం పార్టీ కేంద్రకార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స మాట్లడుతూ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో చంద్రాబాబు తన మాయమాటలతో ప్రజలను మోసగించేందుకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంబించారన్నారు. పగలు కాంగ్రెస్‌తో రాత్రి బీజేపీతో చేతులు కలుపుతున్నారన్నారు. ఏపీలో అభివృద్ధి సంక్షేమం సన్నగిల్లిందన్నారు. అగ్రవర్ణ పేదలకు కేంద్రప్రభుత్వం పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తే అందులో ఐదు శాతం కాపులకు కేటాయిస్తామని సీఎం చంద్రబాబు చెప్పటమేమిటని ప్రశ్నించారు. ఇకనైనా మోసాలు , మాయమాటలు కట్టిపెట్టాలన్నారు. ప్రజలను గందరగోళపరచటం మానుకోవాలని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

## నవరత్నాలతో సంక్షేమ పాలన

- ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు



**అమరావతి, ఆంధ్రప్రభ :** రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంకల్ప యాత్రను చేపట్టిన వైఎస్ జగన్ ప్రజల కష్టనష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని వారికి సంక్షేమ పాలన అందించేందుకు నవరత్న పథకాలను ప్రకటించారని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్షనేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జగన్‌తోపాటు సుదీర్ఘ పాదయాత్ర చేసిన వైసీపీ కార్యకర్తలకు మంగళవారం గుంటూరులో ఘన సత్కారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యంకాని 600 హామీలను ఇచ్చిన చంద్రబాబు వాటిలో ఏ ఒక్కటినీ ఇంతవరకు సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు ముస్తఫా, అంబటి రాంబాబు, కిలారి రోశయ్య, లేళ్ల అప్పిరెడ్డి, లావు కృష్ణదేవరాయలు, చంద్రగిరి ఏసురత్నం, అన్నబత్తుని శివకుమార్, ఉండవల్లి శ్రీదేవి, మేకతోటి సుచరిత, డైమండ్ బాబు, రసూల్, చైతన్య, దుర్గాప్రసాద్, లాయర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ అర్హత పరీక్షపై145మంది అభ్యంతరం

- నేటి నుంచి మరోసారి ఓఎంఆర్ పరిశీలనకు అవకాశం

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్, జైళ్లశాఖ వార్డర్, అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్ ఉద్యోగాలకు నిర్వహించిన ప్రాథమిక అర్హతా పరీక్షపై 145 మంది అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు బోర్డు చైర్మన్ కుమార్ విశ్వజిత్ తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఓఎంఆర్ షీటు పరిశీలన కోసం డౌన్‌లోడ్ చేసుకునేందుకు 23వ తేదీ ఉదయం 11గంటల నుంచి 25వ తేదీ సాయంత్రం 5గంటల వరకు మరో అవకాశం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా కేటగిరీలోని ఉద్యోగాల భర్తీకి మూడు లక్షల 51వేల 860మంది దరఖాస్తు చేయగా, ప్రాథమిక అర్హతా పరీక్షలో లక్షా 09వేల 106 మంది అర్హత సాధించారని పేర్కొన్నారు.

అర్హతా పరీక్షలో విడుదల చేసిన 'కీ'పై వచ్చిన అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకొని మరోసారి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. పేపర్ సెట్(పీ2)లో 106వ ప్రశ్నకు సమాధానం రాసినా, రాయకపోయినా ఒక మార్కు కలపనున్నట్లు తెలిపారు. 143వ ప్రశ్నకు రెండు లేదా మూడును ఆన్సర్‌గా నిర్ణయించామన్నారు. మరోసారి ఓఎంఆర్ షీటు పరిశీలించుకునేందుకు రూ.1000 ఆన్‌లైన్‌లో చెల్లించడంతో పాటు నిర్దేశిత ప్రామాణికంలో దరఖాస్తు చేసి రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకోవచ్చని సూచించారు. ప్రతి అభ్యంతరానికి విడివిడిగా రూ.వెయ్యి ధరావత్తుగా చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు..94414 50639, 99494 18118, 99492 40688లో కాని, ఈ మెయిల్ ద్వారా కాని తెలుసుకోవచ్చని విశ్వజిత్ సూచించారు.

## నైపుణ్యాన్ని పెంచుకోండి

- భూగర్భ జలాల పెంపుపై శిక్షణా శిబిరం
- జలవనరుల అధికారులకు డైరెక్టర్ వేణుగోపాల్ ఉద్బోధ




**అమరావతి, ఆంధ్రప్రభ :** భూగర్భజలాల అభివృద్ధి, సమర్థ నిర్వహణపై అధికారులు అవగాహనను, నైపుణ్యాన్ని పెంచుకోవాలని గ్రౌండ్ వాటర్ అండ్ డబ్ల్యుఏడి సంచాలకులు డా.కె.వేణు గోపాల్ సూచించారు. భూమిలో ఎంతమేరకు జల లభ్యత ఉందో అవగాహనను పెంచుకోవడంతోపాటు అందుకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంగళ వారం జలవనరుల మంత్రి క్యాంపు కార్యాలయం ఆవరణలోని రైతు శిక్షణాకేంద్రంలో నూతనంగా ఎంపికైన భూగర్భజలశాఖ అధికారులకు నాలుగు రోజుల పాటు నిర్వహించే టైర్-2 శిక్షణా కార్యక్రమాన్ని వేణు గోపాల్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నేతృత్వంలో భూగర్భజాలల పరిరక్షణ, పెంపుదల కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఎన్నో వినూత్న ఆలోచనలకు తెరతీసినట్లు తెలిపారు. భూగర్భ జలాల స్థాయిని 3 మీటర్ల నుండి 8 మీటర్ల మధ్య ఉండేలాగా కృషి చేయాలని, పరిశీలన ద్వారానే ఉత్తమ నైపుణ్యాలను పెంపొందించుకోగలుగుతామన్నారు. నీటి సంరక్షణ చర్యల్లో భాగగా ప్రపంచ బ్యాంక్, ఇతర సంస్థలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, వాటి నుంచి అధికారులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర వాటర్‌బోర్డ్ ప్రాంతీయ సంచాలకులు వి.సుబ్బారావు, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ ఎత్తిపోతు పథకాల ద్వారా భూగర్భ జలాల స్థాయిని పెంపొందించడంలో దేశ స్థాయిలోనే ఆంధ్రప్రదేశ్ 'స్కోచ్' అవార్డులను గెలుచుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ముఖ్యమంత్రి ముందుచూపు, ఆదేశాలు, సహాయ సహకారాలతోనే ఇరిగేషన్ శాఖలోని వివిధ విభాగాలు జల సంరక్షణలో జాతీయ స్థాయి పురస్కారాలను దక్కించుకున్నాయని వారు వివరించారు.

## నాకేం జరిగినా కుర్చీలు కదులు తాయ్

- మాణిక్యాలరావు హెచ్చరిక

**తాడేపల్లిగూడెం ప్రభ న్యూస్:** నేను ముఖ్యమంత్రిని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు .. మాకిచ్చిన హామీలను నెరవేర్చమన్నాను... ఈ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు కోసం నేను ఢిల్లీ వెళ్ళి దీక్ష చేయాలా ... ఆలోచన నశించి మాట్లాడుతున్నారా అని మున్సిపల్‌ఛైర్మన్ బొలిశెట్టి నుద్దేశించి మాణిక్యాలరావు విమర్శించారు. తాము చేపట్టిన దీక్ష రెండవ రోజుకు చేరుకుందన్నారు తన రక్త పరీక్ష రిపోర్టులు తారుమారు చేస్తే సహించేది లేదన్నారు. ఇచ్చిన హామీలు కోసం ప్రాణ త్యాగం చేయడానికి తాను సిద్ధమన్నారు. టెంపరరీ రాజధానితో ప్రజల్ని మోసం చేస్తున్నారని, ప్రతీ సోమవారం పోలవరం అని ప్రజల్ని దగా చేస్తున్నారని మాణిక్యాలరావు విమర్శించారు. యువతకు ఉపాధి కల్పించే ఏ పరిశ్రమనైనా ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. తనకేదైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో పెకలిస్తారన్నారు. మాణిక్యాలరావు దీక్ష రెండవరోజుకు చేరినా ప్రభుత్వం దిగిరాకకపోవడంతో ధీక్షా శిబిరం వద్ద మాణిక్యాలరావు అభిమానులు కొవ్వొత్తులు ప్రదర్శన చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులు కార్యకర్తలు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈతకోట తాతాజీ, యెగ్గిన నాగబాబు, పోతుల అన్నవరం, పేరిచర్ల మురళీ కృష్ణ ,సిర్రాపు శాంతకుమార్, తదితరులు దీక్షా శిబిరం వద్ద మాణిక్యాలరావుకు అండగా ఉంటున్నారు.

### మోడీ హామీలకేం చెప్తారు?:.. మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి

మాజీ మంత్రి మాణిక్యాలరావు చేసే దీక్ష ఆయన కోసమే గానీ, ప్రజలు కోసం ఎంత మాత్రం కాదని మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.మంగళవారం ఆయన నివాసంలో మాట్లాడుతూ కేంద్రం నుండి రాష్ట్రానికి నిధులు రాకుండా అడ్డుకున్నది మాణిక్యాలరావేనని ఆరోపించారు. ముఖ్యమంత్రి హామీలు నెరవేర్చలేదని చెప్తున్న మాణిక్యాలరావు మోడీ ఇచ్చిన హామీలు గురించి ఏమి చెప్తారని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా విశాఖ రైల్వే జోన్, నల్లధనం తెస్తామన్న కేంద్రం పై మేమేందీక్షలు చేయాలన్నారు. మీరు చేస్తున్న దీక్షలు ఢిల్లీలో కేంద్రంపై చేస్తే రాష్ట్రం బాగుంటుందన్నారు. గూడెం పట్టణంలో 100 కోట్లు రూరల్ మండలానికి 200 కోట్లు ఇచ్చిన చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి మీకు కనిపించడం లేదా ఈ నాలుగున్నర ఏళ్ళలో జరుగుతున్న అభివృద్ధి ప్రజలకు బాగా తెలుసునన్నారు. మీ దీక్షలు వల్ల వరిగేదేమీ లేదన్నారు.

## రాజ్యాంగానికి లోబడి ఎస్సీ,ఎస్టీల ఉద్యోగాల భర్తీ

- కారెం శివాజీ డిమాండ్



**అమరావతి, ఆంధ్రప్రభ :** ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు ఎటువంటి అన్యాయం జరగకుండా రాజ్యాంగ పరిధికి లోబడి ఆయా సంస్థలు ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాల్లో పాటించాల్సిన నియమాలపై వారితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ముఖ్యంగా 65,66 జీవోల ప్రకారం 2019 మార్చి 31లోపు ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. అయితే ఈ బ్యాక్ లాగ్ ఖాళీలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాకుండా జనరల్ రిక్రూట్‌మెంట్‌లో సదరు ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా తాను ఏపీపీఎస్సీ కార్యదర్శికి లేఖ రాయగా కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా గైర్హాజరు కావడంపై ఈ సమీక్షకు హాజరైన అధికారుల వద్ద శివాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఏపీపీఎస్సీ అదనపు కార్యదర్శులు కళావతి, సోమరాజు, సహాయ కార్యదర్శి కె.వి ప్రసాద్, ఉప కార్యదర్శి లాల్ మోతి పాల్గొన్నారు.

## భారీ ఎర్రచందనం డంప్ స్వాధీనం

- స్మగ్లర్ తోట మహేంద్రరెడ్డి అనుచరుల అరెస్ట్
- దాదాపు రూ.5కోట్ల విలువగల దుంగలు స్వాధీనం



**కడప, ప్రభ న్యూస్ :** కడప పోలీసులు ఎర్రచందనం అక్రమ రవాణాదారుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తిస్తున్నారు. వారి జాడను ఎప్పటికప్పుడు కనుగొంటూ వారి అక్రమరవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. అందులో భాగంగా కడప పోలీసులు మంగళవారం దాదాపు రూ.5 కోట్లు విలువ చేసే ఎర్రచందనం డంప్‌ను స్వాధీనం చేసుకుని, స్మగ్లర్ మహేంద్రరెడ్డితోపాటు తన అనుచరులను అరెస్ట్ చేశారు. అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ ఈ కేసు గల వివరాలను వెల్లడించారు. కడప జిల్లా పుల్లంపేట మండలం తిప్పాయపల్లి పంచాయతీకి చెందిన ఎర్రచందనం స్మగ్లర్ తోట మహేంద్రరెడ్డిని ఈనెల 21న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు బైపాస్‌లోని ఓ హోటల్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. అతని సమాచారం ఆధారంగా ఆ దుంగలను పశ్చిగోదావరి జిల్లా ఏలూరు సమీపంలోని పెదవేగి మండలం రాత్నాలకుంట గ్రామానికి దగ్గర అప్పారావు గార్డెన్‌లోని పామాయిల్ తోటల్లో డంప్ చేసి అక్కడి నుండి అక్రమ రవాణా చేసినట్లు పోలీసులు కనుగొన్నారు. ఆ గార్డెన్ వద్ద గుడిపల్లి ప్రతాప్, షేక్షావలిని అదే రోజు రాత్రి అరెస్ట్ చేసి 5.6 టన్నుల బరువు గల 175 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మహేంద్రరెడ్డిపై పుల్లంపేట పీఎస్ పరిధిలో, మన్నూరు పీఎస్ పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.

## వలస బాటలో వైకాపా నేతలు

- కాపు నేత చలమలశెట్టి



**అమరావతి, ఆంధ్రప్రభ :** ప్రతిపక్షనేత జగన్ పార్టీ మొత్తం గల్లంతయ్యే పరిస్థితి వుందని, జగన్ పార్టీలో ఉన్న ఒక్కొక్కరు వలసబాట పడుతున్నారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చలమలశెట్టి రామానుజయ అన్నారు. మంగళవారం విజయవాడ టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అగ్రవర్ణాల రిజర్వేషన్ 10 శాతం నుండి కాపులకు 5శాతం కేటాయిస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడాన్ని హర్షం వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.3400కోట్లు వివిధ పథకాల ద్వారా రాష్ట్రంలోని కాపులకు సహాయం చేశారని, అదేవిధంగా సుమారు 2500మంది కాపులు విదేశాల్లో ఉన్నారంటే దానికి కారణం సీఎం చంద్రబాబు ఇచ్చిన రూ.10లక్షల పథకమేనన్నారు. పెన్షన్ రెట్టింపు చేయడం, డ్వాక్రామహిళలకు రూ.10వేలు, రైతులకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకరావడం వంటివి చూస్తుంటే ప్రతిపక్షపార్టీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చెప్పారు. ఈసమావేశంలో కృష్ణాజిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొత్త నాగేంద్రకుమార్, కాపు నాయకులు మాసబత్తి శ్రీనివాస్, అంజిబాబు, వేల్పూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు


**అమరావతి ఆంధ్రప్రభ :** కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. ఒడిశాలో నెలకొన్న అధిక పీడన ప్రభావం ఏపిలోని కోస్తా, రాయలసీమలపై పడుతోంది. అధిక పీడనం కారణంగా వీస్తున్న చలిగాలుల వల్ల రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో ప్రజలు చలితో వణకుతున్నారు. సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల వల్ల ఈ నెల 26 తర్వాత కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

**విశాఖపట్నం, ప్రభన్యూస్:** హిందూ మహాసముద్రం, దక్షిణ బంగాళాఖాతం ప్రాంతాల్లో అల్పపీడన ప్రాంతం ఏర్పడినట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టం నుంచి 3.1 కి.మీల ఎత్తు వరకు తుపాను ఆవర్తనం కూడా ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడ చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## స్థలం కేటాయింపు పట్ల ఏపీయూడబ్ల్యూజే హర్షం

**అమరావతి, ఆంధ్రప్రభ :** అమరావతిలో జర్నలిస్టులకు 30 ఎకరాలు కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల ఏపీయూడబ్ల్యూజే హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ.వి సుబ్బారావు, చందు జనార్ధన్, ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న మరికొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు కేటాయించిన స్థలాలను సొసైటీకి అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మండల, జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులకు గృహాల కేటాయింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంలో సమాచార శాఖా మంత్రి కాల్వ శ్రీనివాసులు తగిన చొరవ చూపించాలని కోరారు.




డిడి ఉచిత డిష్ కొరకు 38వ ఆన్‌లైన్ ఇ-వేలము

ప్రసార భారతి వారు దూరదర్శన్ యొక్క డిడి ఉచిత డిష్ డిటిహెచ్ సేవల యొక్క ఖాళీ ఎంపిఇజి-2 స్లాట్ల భర్తీ కొరకు 38వ ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుట కొరకు ప్రైవేట్ టివి ఛానళ్ళ నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

ఆసక్తిగల ప్రైవేట్ టివి ఛానళ్ళ వారు ఇ-వేలంలో పాల్గొనుట కొరకు అవసరమైన డాక్యుమెంట్లు మరియు డిమాండ్ డ్రాఫ్ట్‌లతోపాటు వారి దరఖాస్తులను 06.02.2019 (బుధవారం)న మ.గం.1.00 లోగా సమర్పించవలసిందిగా అభ్యర్థించడమైనది.

ఇ-వేలము 11.02.2019 నుండి నిర్వహించబడుతుంది.

38వ ఇ-వేలముల కొరకు వివరణాత్మక షరతులు మరియు నిబంధనల కొరకు దయచేసి మా వెబ్‌సైట్ దర్శించండి:
http://doordarshan.gov.in
మరియు
http://prasarbharati.gov.in

# రెండంకెల వృద్ధి రేటుతో దేశానికే ఆదర్శం

- ఫిబ్రవరిలో రైతుల ఖాతాల్లోకి రూ.8వేల కోట్ల రుణమాఫీ మొత్తం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి




**అమరావతి, ఆంధ్రప్రభ:** అనేక విభజన కష్టనష్టాలతో ఏర్పడిన నవ్యాంధ్రలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితంగా రెండంకెల వృద్ధి రేటును సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలియజేశారు. మంగళవారం గుంటూరులో నిర్వహించిన కిసాన్ మేళాలో రైతులకు పనిముట్లను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర సహాయ నిరాకరణ చేస్తున్నా, ఆర్‌బీఐ వద్దని చెప్పినా ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.24 వేల కోట్ల రైతు రుణ మాఫీని ప్రకటించి రైతుల పక్షపాతిగా నిలిచాడని చెప్పారు. రైతు రుణమాఫీ పథకం క్రింద ఇప్పటి వరకు రూ.15,147 కోట్లను అర్హులైన ఖాతాల్లో జమ చేశారని, రానున్న ఫిబ్రవరిలో 10 శాతం వడ్డీతో రూ.8 వేల కోట్లను అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఈ పథకం ద్వారా అర్హత ఉండి కూడా లబ్ది పొందని రైతులను గుర్తించి 14 దశల్లో రూ.725 కోట్లను అందజేయడం జరిగిందన్నారు. కరువు కాటకాలు, తుఫానుల ధాటికి పంట నష్టపోయిన రైతులకు రూ.3,200 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడిని ఇవ్వడం జరిగిందని, త్వరలో మరో రూ.2,200 కోట్లను కూడా చెల్లించేందుకు తగిన చర్యలు చేపట్టామని తెలిపారు.

### రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తుతం సాగు కోసం అందిస్తున్న 7 గంటల విద్యుత్‌ను 9 గంటలకు పెంచినట్లు మంత్రి సోమిరెడ్డి వెల్లడించారు. లాభసాటి సాగుకోసం భూసార పరీక్షలను నిర్వహించడం, రైతులకు సాయల్ హెల్త్ కార్డులను జారీ చేయడం, భూసారాన్ని పెంచేందుకు అవసరమైన మైక్రో న్యూట్రిషన్స్ సరఫరా చేయడం, ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ రుణాలను సమయానికి ప్రభుత్వం అందిస్తుండటంతో రాష్ట్ర రైతాంగా ప్రతి పంటలో అధిక దిగుబడులను సాధిస్తోందన్నారు. అలాగే వ్యవసాయ విద్యకు పెద్దపీట వేస్తు గడచిన నాలుగు సంవత్సరాల్లో వ్యవసాయ, ఉద్యాన విద్యాలయాలు, కళాశాల భవనాలు, నిర్మాణాలకు రూ.680 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. వ్యవసాయ విద్యను అభ్యసించాలన్న రైతు బిడ్డలకు గతంలో ఉన్న 3 ఏకరాల నిబంధనను ఎకరంకు తగ్గించడం ద్వారా వారిని వ్యవసాయ అధికారులుగా, శాస్త్రవేత్తలుగా, ప్రొఫెసర్లుగా తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఇటీవల పెథాయ్, తిత్లీ తుఫానుల ధాటికి దెబ్బతిన్న పంటలను పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోళ్లు చేపడుతూ క్వింటాకు రూ.1,550 రైతులకు చెల్లిస్తున్నామని, సాధారణ రకానికి రూ.1,750 చెల్లించడం జరుగుతోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైఎస్ ఛాన్సలర్ డాక్టర్ వల్లభనేని దామోదర్ నాయుడు, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, జడ్పీ ఛైర్‌పర్సన్ జానీమూన్, పలువురు వ్యవసాయ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# జలీల్‌ఖాన్ కుమార్తెకు తెదేపా టికెట్?

- చంద్రబాబు సమక్షంలో పార్టీ తీర్థం



**అమరావతి, ఆంధ్రప్రభ:** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ కుమార్తె షబానా ఖాతూన్ తెలుగుదేశం పార్టీతీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ అమెరికాలో నివశిస్తున్న తన కుమార్తె షబానాను వెంట బెట్టుకుని వచ్చి ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిశారు. ఈసారి ఎన్నికల్లో తనకు బదులుగా తన కుమార్తెకు సీటు ఇవ్వాలని జలీల్‌ఖాన్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. అనంతరం ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మీడియాతో మాట్లాడుతూ తన కుమార్తె షబానాకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పశ్చిమ నియోజకవర్గ సీటును కేటాయించారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో గెలిచి తమ సత్తా చాటుతామని అన్నారు. ఇదే సందర్భంగా షబానా మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మీద ఉన్న అభిమానంతోనే తెలుగుదేశం పార్టీలోకి చేరానని, అయితే తనకు రాజకీయాల గురించి అంతగా తెలియదన్నారు. తన తండ్రి జలీల్‌ఖాన్‌తో కలిసి నియోజకవర్గంలో పర్యటించి ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ప్రత్యేక హోదానే ప్రధాన అజెండా

- కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అజెండాగా రాష్ట్రంలో ఎన్నికలకు వెళ్తామని, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు తెలిపారు. ఏపీసీసీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్‌చాందీ, ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డితో సహా పలువురు కీలక నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు మాట్లాడుతూ సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించామని తెలిపారు. తెలంగాణా ఎన్నికలు, కేసీఆర్, జగన్ పొత్తులు, కోల్‌కతా సమావేశంపై ప్రధానంగా చర్చించామని తెలిపారు. ఎన్నికలకు సిద్ధం అయ్యేందుకు గాను కమిటీల ఏర్పాటుపై సమావేశంలో కార్యాచరణ చేశామని చెప్పారు. పొత్తులపై తాము ప్రధానంగా దృష్టి పెట్టలేదని, పొత్తులు కేంద్రస్థాయిలో జరుగుతాయని ఆయన తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రత్యేకహోదా అజెండాగానే ప్రజల్లోకి వెళ్తామని, రాష్ట్ర ప్రజలు రాహుల్‌ను ప్రధాని కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ప్రజల్లో బీజేపీపై తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు.

# నవరత్నాలను కాపీ కొడుతున్న బాబు

- పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్

**అమరావతి, ఆంధ్రప్రభ:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీరును చూస్తే గుండమ్మ కథలోని పాట గుర్తుకొస్తుందని పీఏసీ ఛైర్మన్, వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన విజయవాడలోని రాష్ట్రపార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రజలు చంద్రబాబు అండ్ కో అనుకున్నంత అమాయకంగా ఉండరన్నారు. జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ఎప్పుడో ప్రకటించిన వాటన్నింటినీ ఇప్పుడు తానేదో కనిపెట్టినట్లు ముఖ్యమంత్రి ప్రకటించి ఆనందం పొందుతున్నారన్నారు. రాజకీయాల్లో 40 సంవత్సరాల అనుభవం ఉందని పదేపదే చెప్పుకుంటున్న చంద్రబాబు ఆయన రాజకీయ పరిణతి అంతా పోయిందని మరచిపోయినట్లున్నారన్నారు. ప్రజలు ఆయన మాటలను చూసి నవ్వుకుంటున్నారన్నారు. వాస్తవానికి ఏ రాష్ట్రమైనా గానీ కేంద్రంతో కలిసి పనిచేయాల్సిందేనని, పక్కన ఉన్న రాష్ట్రాలతో మంచి సంబంధాలు కలిగి ఉండాల్సిందేనని చెప్పారు. నదీజలాలు అయితేనేం ఇతర అంశాల్లో అవి కొనసాగాల్సిందేనన్నారు. కానీ పక్క రాష్ట్రంలోని ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జగన్ మాట్లాడితే అదేదో నేరమైనట్లు, పాపమైనట్లు ఇక్కడ తెలుగుదేశం పార్టీ వారు గగ్గోలు పెడుతున్నారని, ఎందుకో అర్ధం కావడంలేదన్నారు. రాబోయే ప్రభుత్వంతో ఎవరైనా మాట్లాడుతారంటూ 2019 ఎన్నికల్లో అధికారం తమదేనని చెప్పారు. ఫెడరల్ ఫ్రంట్ అనే కాన్సెప్ట్‌తో పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేసీఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్ చర్చలకు జగన్ వద్దకు కేటీఆర్‌ను పంపితే చంద్రబాబు అది తట్టుకోలేకపోతున్నారన్నారు.. రైతు శ్రేయస్సు, రైతు బంధు అంటూ మాట్లాడుతున్నా వారికి పాత బకాయిలు కట్టలేదని అన్నారు. మరి మీకు ఇప్పుడు నిధులు ఎలా సరిపోతాయో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు.

# టీటీడీ అక్రమాలపై జోక్యం చేసుకోండి

- గవర్నర్‌కు భాజపా నేతలు ఫిర్యాదు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో చోటుచేసుకున్న అక్రమాలపై జోక్యం చేసుకుని అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను భాజపా తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ నేతృత్వంలో ఎంపీ బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి. టిటిడి బోర్డు మాజీ సభ్యుడు భాను ప్రకాశ్, మాజీ డిజిపి దినేష్‌రెడ్డి, ఆర్టీఐ మాజీ కమిషనర్ పి. విజయబాబు, మాజీ ఐఎఎస్ అధికారి దాసరి శ్రీనివాస్ తదితరులు కలుసుకుని వినతిపత్రాన్ని సమర్పించారు.

అనంతరం మీడియాతో డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తుల ప్రమేయంతో టిటిడిలో అవినీతి అక్రమాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆరోపించారు. గత ఏడాది సెప్టెంబర్ 27న దర్శన టిక్కెట్ల కొనుగోలు వ్యవహారంలో కొంతమంది సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. అక్రమాలకు పాల్పడే సిబ్బందిని ఉపేక్షించడం వలన భక్తుల మనోభావాలను గాయపరిచారని అన్నారు. టిటిడిలో జరుగుతున్న అక్రమాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ సంస్థ చే దర్యాప్తుకు ఆదేశించాలని గవర్నర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. టిటిడి మాజీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ భాజపా రాష్ట్ర కార్యదర్శి భానుప్రకాశ్ మాట్లాడుతూ.. టిటిడి ధనార్జన క్షేత్రంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రూ.500 విలువగల తోమాల, అర్చన, విఐపి, బ్రేకు దర్శనాల టిక్కెట్లను పది నుంచి ఇరవై వేల రూపాయలకు టిటిడి సిబ్బందిలో కొంతమంది అమ్ముతున్నారని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసే సిబ్బందితో టిటిడి జెఇవో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ములాఖత్ అయ్యి అధిక ధరలకు టిక్కెట్లను అమ్ముతున్నారని ఆయన ఆరోపించారు. ఈ అక్రమాలపై గతంలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. న్యాయం జరగకపోతే తాము న్యాయస్థానంలో న్యాయపోరాటం చేస్తామని ఆయన వెల్లడించారు. మాజీ డిజిపి, భాజపా నేత దినేష్‌రెడ్డి మాట్లాడుతూ.. 2010లో సేవా టిక్కెట్లు అమ్మకాలపై ఆరోపణలు వచ్చినప్పుడు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ వ్యవహారంపై అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబునాయుడు పెద్ద దుమారమే లేపారని చెప్పారు. టిటిడి అక్రమాలపై విజిలెన్సు నివేదికను తొక్కిపెట్టడం దారుణమన్నారు. ఎంపీ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. టిటిడి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే జి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యాపార కేంద్రంగా టిటిడి ఉండకూడదన్నారు. ధార్మిక పుణ్యక్షేత్రంను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్‌కు గుర్తు చేసినట్లు ఆయన చెప్పారు.

# దద్దమ్మలను తెలంగాణలోనే వదిలేశాం

- తలసాని ఓ సన్యాసి: మంత్రి జవహర్



**ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ కేబినెట్‌లో సమర్ధవంతమైన నాయుకులు ఉన్నారని, పవర్ పాలిటిక్స్ చేసే దద్దమ్మలను తెలంగాణాలోనే వదిలేశామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జవహర్ పేర్కొన్నారు. తెలంగాణా నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ సలహాలు, సూచనలు మాకవసరం లేదని, అతనికంటే మరో సన్నాసి ఎవరూ లేరని జవహర్ విమర్శించారు. రాష్ట్ర బీజేపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ ముగుసుతీస్తే వైసీపీ నాయకుడని, వైసీపీ అజెండాను బీజేపీ జెండాగా ఆయన మారుస్తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. కుర్చీల కోసం ఆశపడుతున్న నాయకులు తమ భ్రమలు వదులుకోవాలని, 2019 ఎన్నికలలో రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ పులివెందల సహా అన్ని నియోజకవర్గాలలోనూ అనూహ్య మెజారిటీతో విజయం సాధి స్తుందని ధీమా వ్యక్తం చేశఆరు. స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఉదయం జరిగిన ఎక్సైజ్ పోలీసుల ఔట్ పాసింగ్ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షం, కుర్చీ కోసం ఆశపడుతున్న కొందరు వ్యక్తులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నాయకులతో అవాస్తవాలు మాట్లాడిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు జరగడం లేదని పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని వారు మాట్లాడటం చూసి రాష్ట్రప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఈ రాష్ట్రంలో సమర్ధవంతమైన నాయకులకు లోటులేదని బీసీలకుగానీ, యాదవులకు కానీ మీ నాయకత్వం అవసరం లేదని తలసానిని ఉద్దేశించి మంత్రి పేర్కొన్నారు. మీ అంత సన్నాసి ఎవ్వరూ లేరని గతంలో తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నమాటను గుర్తుచేస్తూ తలసానిని ఆయన విమర్శించారు. మాజీ మంత్రి మాణిక్యాలరావు నిరాహార దీక్షపై వ్యాఖ్యానిస్తూ ఆయనకు అడ్రస్ తెలియక తాడేపల్లి గూడెంలో దీక్ష చేస్తున్నారని ఈ దీక్షేదో ఢిల్లీవెళ్లి అమిత్, మోడీల ముందు చేస్తే మేలని హితవు చేశారు.

రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఒకవైపు పనులు బాగున్నాయంటూ ప్రశంసిస్తూనే, మరోవైపు అభివృద్ధి పనులకు అనుమతి మంజూరు చేయలేదని జవహర్ విమర్శించారు. ఉత్తరాదిన రోడ్లకు నిధులిచ్చుకునే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను మాత్రం వివక్షతకు గురిచేస్తోందన్నారు. రానున్న ఎన్నికలలో భారతీయ జనతాపార్టీకి వచ్చేసీట్లు ఏమీ ఉండవని కన్నాకు మిగిలేది సున్నానేనని జవహర్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఎమ్మెల్సీ కరణం బలరాం తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన యువత దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

- పిలుపునిచ్చిన కర్నాటక గవర్నర్

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** గిరిజన యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కర్ణాటక గవర్నర్ వాజూభాయ్ వాలా పిలుపునిచ్చారు. కర్ణాటకలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ - యువజన క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ తరపున ముఖ్య అతిథిగా నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జాతీయ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు కుటుంబాల పిల్లలను నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, హోంమంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఇటీవల దత్తత తీసుకుంది. వారితో పాటు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన రెండు వందల మంది యువతీ యువకులను దేశ పర్యటనలో భాగంగా కర్ణాటక రాష్ట్రానికి తీసుకువెళ్లారు. బెంగళూరులోని రాజ్‌భవన్ సమావేశ మందిరంలో గవర్నర్ వాజూభాయ్ వాలా మాట్లాడుతూ... గిరిజన యువతను జనజీవన స్రవంతిలోకి తీసుకు రావడం, అభివృద్ధి కార్యకమాలలో భాగస్వాములను చేయడం గొప్ప విషయమని విష్ణువర్ధన్ రెడ్డికి అభినందనలు తెలిపారు. భారత ప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఇటువంటి నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టడాన్ని ఆయన ప్రశంసించారు. యువతకు మార్గనిర్దేశం చేయడానికి సమావేశం నిర్వహించినందుకుగానూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, హోంమంత్రిత్వ యువజన క్రీడల అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంస్కృతి అన్నింటి కంటే గొప్పదని, మంచి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల సద్భావనలు కలుగుతాయని గవర్నర్ యువతకు దిశానిర్దేశం చేశారు. యవతకు ఆతిథ్యమిచ్చిన గవర్నర్‌కు విష్ణువర్ధన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో డీఐజీ కమల్ సానంత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఎన్‌వైకేఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



### తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవానికి 3న సుప్రీం సీజే రాక

**అమరావతి, ఆంధ్రప్రభ :** ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవానికి మహూర్తం ఖరారైంది. వచ్చే నెల 3న తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ రానున్నట్లు ఇక్కడి అధికారులకు సమాచారం అందింది.

**హైకోర్టు పనివేళలు మార్పు:**

హైకోర్టు పనివేళల్లో మార్పులు చేశారు. ఇందుకు సంబంధించి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మానవేంద్ర రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా అమలులోకి వచ్చిన వేళల ప్రకారం ఉదయం 10.30గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.30 గంటల వరకు సాగుతుంది. తిరిగి మధ్యాహ్నం 2.15 గంటల నుంచి సాయంత్రం 4.15గంటల వరకు నిర్వహించనున్నారు.

# బెల్లం నీళ్లు జల్లి.. గంజాయి తరలింపు

- గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
- హైదరాబాద్‌లో ఇద్దరి అరెస్టు... నిందితులు విశాఖవాసులు
- 102 కేజీల గంజాయి స్వాధీనం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** విశాఖపట్నం నుండి పెద్దఎత్తున గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసులు అరెస్టు చేశారు. నిందితులనుండి రూ. పది లక్షల రూపాయల విలువైన 102 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి వాసన ఆధారంగా ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు నిందితులు బెల్లంనీళ్లు జల్లి తరలిస్తున్నారు. బెల్లం నీళ్లు తగిలితే గంజాయి వాసన బయటకు పొక్కదు. ఈ చిట్కాతో గంజాయి తరలిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు పకడ్బందీగా తనిఖీలు చేసి గుట్టు రట్టు చేశారు. నిందితుల నుంచి ఒక స్విఫ్ట్ కారు, రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సి.వివేకానందరెడ్డి ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మలక్‌పేట టి.వి.టవర్ ప్రాంతంలో నిఘావేసి దాడులు చేశారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వి.శ్రీనివాస్ అనే వ్యక్తి నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాస్‌ను విచారించిన తదుపరి అధికారులు శ్రీనివాస్ అనుచరుడు బి.అశోక్‌తేజను అధికారులు అదుపులోకి తీసుకుని మొత్తంగా 102 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఇద్దరు నిందితులు వైజాగ్ నుంచి కారులో గంజాయి నగరానికి తరలించి గంజాయి వ్యాపారులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, ముందే అనుకున్న విధంగా శివరాంపల్లి, కాటేదాన్ ప్రాంతాలలో గంజాయి విక్రయించే పాత నేరస్తుడికి శాంపిల్ అందజేసేందుకు వచ్చిన సమయంలో అధికారులకు చిక్కారు. అనంతరం శ్రీనివాస్ ఇచ్చిన సమాచారం మేరకు కారు ఆపిన బాటసింగారం గ్రామంకు వెళ్లి కారులో ఉన్న 100 కిలోల గంజాయి(రెండు కేజీలతో వున్న 50 ప్యాకెట్‌లు)ని పోలీసులు స్వాధీనంచేసుకున్నారు.

**నర్సీపట్నంలో కొనుగోలు...**


ఈ ఇద్దరు నర్సీపట్నం ప్రాంతంలో గంజాయి కిలో రూ.1500కు కొనుగోలు చేసి రూ.4000 వేలకు ఇక్కడి గంజాయి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. నిందితులిద్దరూ 5,6 నెలల నుంచి కారు మాట్లాడుకుని గంజాయిని తీసుకొచ్చి ఇక్కడి వ్యాపారులకు ఎక్కువ మొత్తంలో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు.

**బడా స్మగ్లర్ హస్తం?**

ఒక బడా స్మగ్లర్లు వీరి వెనుక ఉన్నట్లు తెలుస్తోందని అధికారులు అనుమానిస్తున్నారు. అరకు, పాడేరు తదితర ప్రాంతాల నుంచి గంజాయి స్మగ్లింగ్ ముఠాలు నగరానికి గంజాయిని తరలిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ప్రస్తుతం పట్టుబడ్డ 102 కేజీల గంజాయి విలువ రూ.10 లక్షల వరకూ ఉండవచ్చని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సి.వివేకానందరెడ్డి తెలిపారు.

# రూ.20 కోట్లతో కాలుష్య నియంత్ర మండలి ఆధునికీకరణ

- నేడు ప్రారంభించనున్న మంత్రి శిద్దా



**అమరావతి, ఆంధ్రప్రభ:** జల, వాయువు, పర్యావరణ చట్టాలను అమలు పరుస్తున్న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కొత్త హంగులను సంతరించుకోబోతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న క్షేత్రీయ ప్రయోగశాలను రూ. 20 కోట్ల ఖర్చుతో అధునాతన పరికరాలను సమకూరుస్తూ ఆధునిక పరిచారు. విశాఖలో ఉన్న ఈ ఆధునాతన శాస్త్రీయ, సాంకేతిక ప్రయోగశాలను రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖామంత్రి శిద్దా రాఘవరావు బుధవారం ప్రారంభించనున్నారు.

# సమ్మె బాటలో ఆర్టీసీ కార్మికులు

### యాజమాన్యంతో చర్చలు విఫలం

**అమరావతి, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ యాజమాన్యంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని, బుధవారం జరిగే జేఏసీ సమావేశంలో సమ్మె తేదీలను ప్రకటిస్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ సంఘ ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దర్మారావు వెల్లడించారు. వేతన సవరణలో ఉన్న డిమాండ్ల సాధన కోసం ఇప్పటికే ఆర్టీలో ఉన్న 8సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పడాయని, బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 13జిల్లాలో చేపట్టేబోయే షెడ్యూల్‌ని ప్రకటిస్తామన్నారు.

# క్రీడాప్రభ



## కోహ్లీ మెడలో అవార్డుల హారాలు

# క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా కోహ్లీ

- ఐసీసీ అవార్డులను స్వీప్ చేసిన కోహ్లీ
- విరాట్ ఖాతాలో వన్డే, టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు

**దుబాయ్:** కెప్టెన్‌గానేకాక బ్యాట్స్‌మన్‌గా అద్భుతంగా రాణిస్తూ కింగ్ విరాట్ కోహ్లీఐసీసీ వార్షిక అవార్డులను క్లీన్ స్వీప్ చేయడమేకాక, ప్రపంచ టెస్ట్, వన్డే జట్లకు కెప్టెన్ ఆఫ్ ద ఇయర్‌గా కూడా ఎంపికయ్యాడు. మంగళవారం అంతర్జాతీయ క్రికెట్ సమాఖ్య (ఐసీసీ) వార్షిక అవార్డుల జాబితాను వెలువరించింది. కోహ్లీ ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా వరుసగా రెండోసారి ఎంపిక కావడమేకాక, సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీను అందుకున్న తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అంతేకాక ఐసీసీ టెస్ట్, వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డులను కూడా సొంతం చేసుకున్నాడు. 2018 సీజన్లో టెస్టుల్లో, వన్డేల్లో అద్భుత ప్రదర్శనకు గాను కోహ్లీకి ఈ అవార్డులు దక్కాయి. ఎమర్జింగ్ క్రికెట్ ఆఫ్ ద ఇయర్ అవార్డు యువ క్రికెటర్ రిషభ్ పంత్‌కు దక్కింది. అంతర్జాతీయ క్రికెట్లో అద్భుత ప్రదర్శన చేసిన కోహ్లీ ఈ మూడు అవార్డులతో పాటు, ఐసీసీ టెస్ట్, వన్డే జట్లకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు అని ఐసీసీ తన ప్రకటనలో పేర్కొంది. 2018 కేలండర్ సంవత్సరంలో కోహ్లీ 13 టెస్టుల్లో సగటున 55.08 పరుగులతో మొత్తం 1,322 పరుగులు(ఐదు సెంచరీలున్నాయి) చేయగా, 14 వన్డేల్లో 133.55 సగటుతో 1202 పరుగులు చేశాడు. ఇందులో ఆరు సెంచరీలున్నాయి. 10 టీ20 మ్యాచుల్లో 211 పరుగు లు చేశాడు. కోహ్లీ తనకు వచ్చిన ఈ అవార్డులపై స్పందిస్తూ.. 'ఒక కాలెండర్ ఇయర్లో పడిన శ్రమకు దక్కిన గుర్తింపు. అంతర్జాతీయ స్థాయిలో ఐసీసీ నుంచి గుర్తింపు పొందినందుకు క్రికెటర్‌గా గర్వంగా ఉంది. ఈ అవార్డులను ఇచ్చి నాలో మరింత ఉత్సాహాన్ని, చైతన్యాన్ని పెంచారు. ఇదే స్థాయిలో నిలకడగా ఆడుతూ.. క్రికెట్ ప్రమాణాలను కాపాడుతూ.. ప్రపంచ దేశాల్లో క్రికెట్ విస్తరణకు పాటుపడతాను' అని చెప్పాడు.

### ప్రపంచ టెస్ట్, వన్డే జట్లకు కెప్టెన్‌గా కోహ్లీ

ఐసీసీ ప్రకటించిన ప్రపంచ టెస్ట్ జట్టులో భారత్, న్యూజిలాండ్‌ల నుంచి ముగ్గురేసి చొప్పున ఆటగాళ్లు ఉండగా, వన్డే జట్టులో ఇంగ్లండ్ నుంచి నలుగురు, భారత్ నుంచి నలుగురు ఆటగాళ్లు ఎంపికయ్యారు. టెస్టు జట్టుకు పంత్ ఎంపిక కాగా, ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా, కోహ్లీతో పాటు రెండు జట్లలో ఉన్నాడు. వన్డే జట్టులో కోహ్లీతోపాటు, ఓపెనర్ రోహిత్ శర్మ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, బుమ్రా చోటు పొందగా, ఇంగ్లండ్ నుంచి జో రూట్, జాని బెయిర్‌స్టో, జోస్ బట్లర్, బెన్ స్టోక్స్ ఉన్నారు. 30 ఏళ్ల కోహ్లీ తొలిసారిగా 2008లో ఐసీసీ అండర్ -19 ప్రపంచ కప్‌ను భారత్ అందించి వెలుగులోకి వచ్చాడు. 2018లో రెండు ఫార్మాట్లలో అత్యధిక స్కోరు చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ఈ ఏడాది టెస్టుల్లో కేవలం ఇద్దరు బ్యాట్స్‌మెన్ మాత్రమే 1000కి పైగా పరుగులు సాధించగా, వన్డేల్లో ముగ్గురు బ్యాట్స్‌మెన్ ఈ ఫీట్‌ను నమోదు చేశారు. సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ అవార్డుకోసం జరిగిన ఎంపికలో కోహ్లీ ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు. టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకోసం దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడా రెండో స్థానంలో నిలిచాడు. ఈ అవార్డు అద్భుత ప్రతిభకలిగిన కోహ్లీకే దక్కాల్సింది. అదే జరిగింది. టెస్ట్ క్రికెట్ పట్ల అతనికున్న నిబద్ధతను ఐసీసీ ప్రశంసిస్తోంది. ఐదోరోజుల ఆటకు కోహ్లీ ఇస్తోన్న ప్రాధాన్యతతో ఈ క్రీడకే అతను ప్రచారకర్తగా మారాడు అని సమాఖ్య చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ రిచర్డ్‌సన్ అన్నాడు. ఐసీసీ వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకోసం పోటీపడ్డ ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ రెండో స్థానంలో నిలిచాడు. భారత్ జనవరి 1 నుంచి డిసెంబర్ 31 2018వరకు ఆడిన వన్డేల్లో తొమ్మిదింట్లో గెలువగా, నాలుగు మ్యాచుల్లో పరాజయం పాలైంది. ఒక మ్యాచ్ టైగా ముగిసింది. కోహ్లీ వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును అందుకోవడం వరుసగా రెండోసారి. న్యూజి లాండ్‌లో జరిగిన అండర్ -19 ప్రపంచ కప్‌లో విజేతగా నిలిచిన భారత్ జట్టు 48 శాతం ఓట్లతో ఫ్యాన్స్ మూమెంట్ ఆఫ్ ద ఇయర్ అవార్డును పొందింది. అన్ని దేశాల కెప్టెన్లు, ఐసీసీ మ్యాచ్ రెఫరీలు కలిసి అంపైర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకోసం శ్రీలంకకు చెందిన కుమార్ ధర్మసేనను ఎంపిక చేశారు. ఈ అవార్డుతో పాటు ధర్మసేన డేవిడ్ షెఫ్‌హర్డ్ ట్రోఫీని రెండో సారి అందుకోనున్నాడు. ఐసీసీ స్పిరిట్ ఆఫ్ క్రికెట్ అవార్డు న్యూజిలాండ్ కెప్టెన్ కానె విలియమ్సన్‌కు దక్కింది. మైదానంలో రాణిస్తూ.. మైదానం వెలుపల అతని ఆదర్శ ప్రవర్తనతో మిగతా ఆటగాళ్లకు మార్గ నిర్దేశకుడిగా ఉన్నాడని ఐసీసీ ప్రశంసించింది.



**ఎమర్జింగ్ క్రికెట్ ఆఫ్ ద ఇయర్ పంత్**

21 ఏళ్ల రిషభ్ పంత్ 2018 సంవత్సరంలో టెస్టుల్లో రాణించడంతో ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. ఇంగ్లండ్‌లో టెస్టుల్లో వికెట్ కీపర్‌గా తొలి సెంచరీ చేసిన పంత్, అస్ట్రేలి యాలో కూడా అదే ఫీట్‌ను పునరావృతం చేశాడు. అంతేకాక, అడిలైడ్ టెస్ట్‌లో అత్యధిక క్యాచ్‌లు పట్టిన వికెట్ కీపర్‌గా ప్రపంచ రికార్డును సమం చేశాడు.

### అవార్డుల జాబితా

ఐసీసీ పురుషుల క్రికెటర్ ఆఫ్ ద ఇయర్: విరాట్ కోహ్లీ
ఐసీసీ పురుషుల టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్: విరాట్ కోహ్లీ
ఐసీసీ పురుషుల వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్: విరాట్ కోహ్లీ
ఐసీసీ పురుషుల ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్: రిషభ్ పంత్

**ఐసీసీ టెస్ట్ టీం ఆఫ్ ద ఇయర్( బ్యాటింగ్ ఆర్డర్ ప్రకారం)**

టామ్ లాథమ్( న్యూజిలాండ్, డిముత్ కరునరత్నే( శ్రీలంక), కానె విలియమ్సన్(న్యూజిలాండ్) విరాట్ కోహ్లీ(ఇండియా, కెప్టెన్), హెన్రీ నికోలస్(న్యూజిలాండ్), రిషభ్ పంత్(ఇండియా, వికెట్ కీపర్), జాసన్ హోల్డర్(వెస్టిండీస్), కగిసో రబాడా(దక్షిణాఫ్రికా), నాథన్ లియాన్( అస్ట్రేలియా), జస్ప్రీత్ బుమ్రా(ఇండియా), మహ్మద్ అబ్బాస్(పాకిస్తాన్).

**ఐసీసీ వన్డే టీం ఆఫ్ ద ఇయర్( బ్యాటింగ్ ఆర్డర్ ప్రకారం)**

రోహిత్ శర్మ(ఇండియా), జాని బెయిర్‌స్టో( ఇంగ్లండ్), విరాట్ కోహ్లీ( ఇండియా, కెప్టెన్), జో రూట్( ఇంగ్లండ్), రాస్ టేలర్( న్యూజిలాండ్), జోస్ బట్లర్(ఇంగ్లండ్, వికెట్ కీపర్), బెన్ స్టోక్స్( ఇంగ్లండ్), ముస్తాఫిజుర్ రహ్మాన్(బంగ్లాదేశ్), రషీద్ ఖాన్( ఆఫ్ఘనిస్తాన్), కుల్దీప్ యాదవ్( ఇండియా), జస్ప్రీత్ బుమ్రా(ఇండియా).



## హాకీ మాజీ ఆటగాడు రఘుబీర్ బోలా కన్నుమూత

**న్యూఢిల్లీ:** మాజీ హాకీ ఆటగాడు, రెండు సార్లు ఒలింపిక్ పతకాలు సాధించిన జట్టులో సభ్యుడు రఘుబీర్ సింగ్ బోలా కన్నుమూశాడు. 92 ఏళ్ల బోలా సోమవారం తుది శ్వాసం విడిచారని అతని కుటుంబ సభ్యులు తెలిపారు. 1956 మెల్‌బోర్న్, 1960 రోమ్ ఒలింపిక్స్ పాల్గొన్న భారత జట్టులో బోలా అసమాన ఆటతో రాణించాడు. 1956లో భారత్ స్వర్ణం సాధించగా, 1956లో రజతాన్ని అందుకుంది. మైదానంలోనే కాక మైదానం వెలుపక బోలా పలు కీలక భూమికలు పోషించాడు. ఐహెచ్‌ఎఫ్ సెలెక్షన్ కమిటీ సభ్యుడిగా, ఎఫ్‌ఐహెచ్ అంతర్జాతీయ అంపైర్‌గా, ఇండియా హాకీ టీం మేనేజర్‌గా, టీవీ కామెంటేటర్, ఒలింపిక్స్‌లో ప్రభుత్వ పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వహించాడు. ఇండియా ఎయిర్ ఫోర్స్ హాకీ, సర్వీసెస్ టీంకు కెప్టెన్‌గా ఉంటూ 1954 నుంచి 1960వరకు ఇంటర్ సర్వీసెస్ హాకీ చాంపియన్‌షిప్‌ను మూడుసార్లు, జాతీయ హాకీ చాంపియన్‌షిప్‌ను రెండుసార్లు గెలిచాడు. బోలాకు భార్య కమలాదేవి, ముగ్గురు కూతుళ్లు, ముగ్గురు మనవళ్లు ఉన్నారు.

## ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీ సెమీ ఫైనల్లో నాదల్, క్విటోవా

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీలో స్పెయిన్ స్టార్ వరల్డ్ నెంబర్ 2 ఆటగాడు రఫేల్ నాదల్ సెమీస్‌కు చేరాడు. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో నాదల్ అమెరికాకు చెందిన ఫ్రాన్సెస్ టియాఫోను 6-3, 6-4, 6-2 తేడాతో ఓడించాడు. మరో క్వార్టర్ ఫైనల్లో గ్రీక్ క్రీడాకారుడు స్టెఫానొస్ టిసిట్‌సిపాస్ 7-5, 4-6, 6-4, 7(7)-6(2)తేడాతో స్పెయిన్‌కు చెందిన రాబర్టో బాటిస్టా అగట్‌ను ఓడించి చివరి 4 మంది ఆటగాళ్లలో చోటు సంపాదించాడు. కాగా మహిళల సింగిల్స్‌లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన పెట్రా క్విటోవా 6-1, 6-4 తేడాతో ఆస్ట్రేలియా క్రీడాకారిణి ఆష్లే బార్టీని ఓడించి సెమీ ఫైనల్లోకి అడుగుపెట్టింది. కాగా, అమెరికా క్రీడాకారిణి డి కోలిన్స్ 2-6, 7-5, 6-1 తేడాతో రష్యా క్రీడాకారిణి పెవ్లుచెన్ కొవాను ఓడించి సెమీస్‌కు చేరింది. గురువారం జరిగే సెమీ ఫైనల్లో క్విటోవా అమెరికాకు చెందిన డి కోలిన్స్‌తో తలపడనుంది. టిసిట్‌సిపాస్ 20 ఏళ్ల వయసులో గ్రాండ్ స్లామ్‌లోకి ప్రవేశించి గతంలో స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ 2003లో నెలకొల్పిన అతి తక్కువ వయసులో సెమీస్‌చేరిన రికార్డును తుడిచివేశాడు.



## క్రికెట్ సెలెక్టర్లకు బోనస్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాలో చారిత్రాత్మక సిరీస్ విజయం సాధించడంలో ఆటగాళ్లను ఎంపిక చేసిన సెలెక్టర్ల పాత్ర ఎనలేనిదని బీసీసీఐ పేర్కొంది. వారి కృషికి గుర్తింపుగా ప్రతీ సెలెక్షన్ కమిటీ సభ్యునికి తలా రూ.20లక్షల నగదు నజరానాను ప్రకటించింది. మంగళవారం బీసీసీఐ ఈమేరకు ఒక ప్రకటన చేస్తూ..

సెలెక్షన్ కమిటీలోని ఐదుగురు సభ్యులకు తలా రూ.20 లక్షలు బోనస్‌గా ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది అని పేర్కొంది. బీసీసీఐ పాలక కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ సెలెక్షన్ బోర్డు సభ్యులను ప్రశంసించాడు. ఆస్ట్రేలియాలో వన్డే, టెస్ట్ సిరీస్‌ను అందించే జట్టును ఎంపిక చేసిందని అభినందించాడు.



## ఇక్కడా గెలుస్తాం

- కోహ్లీ ధీమా
- నేడు న్యూజిలాండ్‌తో భారత్ తొలి వన్డే
- ఉ. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



*ఆస్ట్రేలియా పర్యటనలో విజయం సాధించి న్యూజిలాండ్‌లో కోహ్లీ సేన అడుగు పెట్టింది. ఆతిథ్య దేశంతో నేడు ప్రారంభం కానున్న ఐదు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి వన్డేలో గెలిచి శుభారంభం చేయాలని కోరుకుంటోంది. ఇప్పటివరకు భారత్ ఇక్కడ ఏడు వన్డే సిరీస్‌లు ఆడగా 2008-09లో ఒక్క సిరీస్‌లో మాత్రమే గెలిచింది. దీటైన ఆటగాళ్లను కలిగిఉన్న న్యూజిలాండ్ ఇటీవల సొంత గడ్డపై శ్రీలంకతో ఆడిన వన్డే సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి భారత్ తో పోటీకి సిద్ధమైంది.*

**నేపియర్:** ఆస్ట్రేలియాపై చారిత్రాత్మక విజయాలతో ఊపుమీదున్న భారత్ నేడు న్యూజిలాండ్ పర్యటనలో ఐదు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా అతిథ్య జట్టుతో తొలి వన్డే ఆడనుంది. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగుతున్న భారత్‌కు ఇంకా మిడిలార్డర్ సమస్య తీరలేదు. ఆస్ట్రేలియా గడ్డపై అదే లోటుతో ఆడి తొలిసారిగా వన్డే సిరీస్‌ను గెలుచుకున్న కోహ్లీ సేన ఇంకా మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌కోసం అన్వేషిస్తూనే ఉంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల్లో ధోనీ హ్యాట్రిక్ అర్ధ సెంచరీలు చేయడంతో భారత ఆటగాళ్లలో ఆనందం వెల్లివిరిసింది. న్యూజిలాండ్‌లో మైదానాలు చిన్నవిగా ఉండటంతో ధోనీ, కోహ్లీ వంటి పిచ్ హిట్టర్లకు అనుకూలమే. అయితే న్యూజిలాండ్ సీమర్లు ట్రెంట్ బోల్ట్, లాకి ఫెర్గుసన్, టిమ్ సోథీలు సొంత గడ్డపై రెచ్చిపోతే భారత బ్యాట్స్‌మెన్‌కు సవాలే. భారత్ చివరిసారిగా న్యూజిలాండ్‌లో 2014లో పర్యటించి 0-4తేడాతో వన్డే సిరీస్‌ను కోల్పోయింది. ఇప్పటివరకు న్యూజిలాండ్‌లో ఇరు దేశాలు ఆడిన 35 వన్డేల్లో భారత్ 10 మ్యాచుల్లో గెలిచింది. న్యూజిలాండ్ గడ్డపై ఆడిన మొత్తం ఏడు వన్డే సిరీసుల్లో భారత్ 2008-09లో 5 వన్డేల సిరీస్‌ను (3-1తో) మాత్రమే గెలిచింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. న్యూజిలాండ్ జట్టులో దీటైన ఆటగాళ్లు ఉన్నారని కోహ్లీకి తెలుసు. ముఖ్యంగా న్యూజిలాండ్ జట్టు కెప్టెన్ కానే విలియమ్సన్ నిలకడగా రాణి రాణిస్తూ.. తన జట్టుకు గెలుపును అందిస్తున్నాడు. ఇటీవల ఆదేశంలో పర్యటించిన శ్రీలంకతో ఆడిన సిరీస్‌లో అది స్పష్టమైంది. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌ల్లో మూడో స్థానంతో ఉన్న కివీస్ జట్టు గత రెండేళ్లుగా మంచి ప్రదర్శన చేస్తోంది. 2017-18 సీజన్‌లో న్యూజిలాండ్, భారత్‌లో పర్యటిస్తూ ముంబైలో ఆడిన తొలి వన్డేలో భారత్‌ను ఓడించింది. సిరీస్ 2-1తో భారత్ చేజిక్కించుకున్నప్పటికి.. న్యూజిలాండ్‌ను తక్కువ అంచనావేయలేమని కోహ్లీ మంగళవారం ప్రీ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అన్నాడు. అది సొంత గడ్డపై న్యూజిలాండ్‌కు మంచి రికార్డు ఉందన్నాడు. ఇప్పటివరకు న్యూజిలాండ్‌లో ఏడు వన్డే సిరీస్‌లను ఆడిన భారత్ నాలుగు సిరీస్‌లు గెలుచుకుంది. రెండు డ్రాగా ముగిశాయి. ఒక సిరీస్ భారత్ గెలిచింది.

**జట్లు: భారత్:** విరాట్ కోహ్లీ( కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, మహేంద్రసింగ్ ధోని(వి.కీ), కేదార్ జాదవ్, దినేష్ కార్తిక్, విజయ్ శంకర్, శుభ్‌మన్ గిల్, యజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమీ, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్, రవీంద్ర జడేజా.

**న్యూజిలాండ్:** కానే విలియమ్సన్( కెప్టెన్), రాస్ టేలర్, టామ్ లాథమ్, మార్టిన్ గుప్తిల్, కోలిన్ డి గ్రాండ్‌హోమ్మి, ట్రెంట్ బోల్ట్, హెన్రీ నికోలసన్, డోగ్ బ్రాస్‌వెల్, లాకీ ఫెర్గున్‌సన్, మట్ హెన్రీ, కోలిన్ మన్రో, ఐష్ సోథీ, మిచెల్ సాంట్‌నెర్, టిమ్ సోథీ.

### మిడిలార్డర్‌లో నెం.4 ఎవరిదో ?

భారత జట్టులో ఓపెనర్ శిఖర్ ధావన్ ఫామ్ ఆందోళనకు గురిచేస్తోంది. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా నిషేధానికి గురై విచారణ ఎదుర్కొంటున్న నేపథ్యంలో అతని స్థానాన్ని భర్తీ చేయడంలో భారత జట్టు టీం మేనేజ్‌మెంట్‌కు సమస్యగా మారింది. అతని స్థానంలో విజయ్ శంకర్‌ను ఆడించాలని కోహ్లీ భావిస్తున్నాడు. శంకర్ ఆస్ట్రేలియాతో ఆడిన చివరి వన్డేలో ఆరు ఓవర్లు బౌలింగ్ చేసి పర్వాలేదనిపించినప్పటికి వికెట్లు పడగొట్టలేదు. ధోని నాలుగో స్థానం బ్యాటింగ్‌లో బాగా కుదురుకున్నప్పటికి.. కోహ్లీ న్యూజిలాండ్‌తో సిరీస్‌లో నాలుగు, ఐదు, ఆరు, ఏడు బ్యాటింగ్ లైనప్‌లో వరుసగా అంబటి రాయుడు, ధోనీ, కార్తిక్, రవీంద్ర జడేజాలనే దించాలని భావిస్తున్నాడు. ఇది వరకే కోహ్లీ ఈ విషయాన్ని స్పష్టం చేశాడు. నేపియర్ మైదానంలో భారీ స్కోరు నమోదుచేసే అవకాశమున్నదని న్యూజిలాండ్ కోచ్ డేవిడ్ స్టెడ్ పేర్కొన్న నేపథ్యంలో దినేష్ కార్తిక్, కేదార్ జాదవ్‌లను బ్యాటింగ్ ఆర్డర్‌లో పైకి తెచ్చే అవకాశముంది. బౌలింగ్ విభాగంలో భువనేశ్వర్‌కుమార్, మహ్మద్ షమీలతో పాటు మూడో సీమర్‌గా మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్, అల్ రౌండర్ విజయ్ శంకర్‌లలో ఎవరో ఒకరికి అవకాశం లభించవచ్చు. న్యూజిలాండ్ టాప్ ఆర్డర్‌లో ప్రపంచంలో ఉన్నతమైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. స్కిప్పర్ విలియమ్సన్, ప్రమాదకరమైన రాస్ టేలర్ ఉన్నారు. టేలర్ 2018 సీజన్లో బ్యాటింగ్ సగటు 92తో కోహ్లీ తర్వాత స్థానంలో ఉన్నాడు. ప్రీ మ్యాచ్ మీడియా సమావేశంలో విలియమ్సన్ మాట్లాడుతూ.. మేము ఇటీవల శ్రీలంకతో ఆడిన సిరీస్‌ను పరిశీలిస్తే.. కొన్ని అంశాల్లో మరింత పురోగతి ప్రదర్శించాల్సి ఉంది. భారత్‌తో తొలి మ్యాచ్‌లో ఆదిశగా కదులుతాం. మునపటి స్థాయిని అందుకుంటాము అని అన్నాడు.





మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారం-2019 అవార్డుల ప్రదానం జరిగింది. చిత్రంలో విజేతలతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్. ఇన్‌సెట్లో క్రీడల విభాగంలో అవార్డును అందుకున్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు మాస్టర్ ప్రియమ్ టాటెడ్. ఈ అవార్డులను క్రీడలు, కళలు, సామాజిక సేవ, సాహస కార్యాలు, వినూత్న ఆవిష్కరణలు తదితర రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన బాల బాలికలకు ఇస్తారు.

## ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లను రెచ్చగొట్టను



**నేపియర్:** ఇకముందు ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయనని కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో భాగంగా కోహ్లీ సేన న్యూజిలాండ్‌తో తలపడనుంది. మంగళవారం కోహ్లీ మీడియాతో మాట్లాడాడు. ఇక ముందు బూయింగ్ (ఆటగాళ్లను రెచ్చగొట్టే శబ్దాలు, వ్యాఖ్యలు) పాల్పడనని.. తన శక్తిని ఆటకోసమే ఉపయోగిస్తానన్నాడు. ఉన్నతమైన జట్టుకు కెప్టెన్‌గా ఉన్న నేను ఇటువంటి చర్యలకు తావివ్వనన్నాడు. తన కెరియర్ మధ్యలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నాడు. '2014-15 సీజన్‌లో ఆస్ట్రేలియాలో పర్యటించిన సమయంలో.. నన్ను నేను ప్రేరేపించుకోవడానికి ఈ తరహా చర్యలకు పాల్పడ్డాను. ప్రస్తుతం నేను కెప్టెన్‌గా ఉన్నాను. అటువంటి పనులపై దృష్టిపెట్టాల్సిన అవసరం లేదు ' అని కోహ్లీ చెప్పాడు. నాపై గొప్ప బాధ్యత ఉంది. దేశం తరపున ఆడటం నాకు గర్వంగా భావిస్తున్నాను. ప్రేక్షకులు నా వైపు ఉన్నా లేదా మా జట్టుకు వ్యతిరేకంగా ఉన్నా.. నేను మైదానంలోకి దిగాల్సిందే.. నా బాధ్యత నెరవేర్చాల్సిందే. అని కోహ్లీ చెప్పాడు. న్యూజిలాండ్‌తో భారత్ ఐదు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు భారత్ ఆడనుంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.



# నాకు నేను... నచ్చలేదు!

రమణి తన మూడేళ్ల కూతురిని వీపుమీద దబదబా బాదుతోంది...తన గదిలో. తను ఎందుకు తన్నులు తింటున్నదో తెలియని ఆ పిల్ల గుక్కపట్టి ఏడుస్తోంది. రమణి పిల్లని కొడుతూనే తనూ ఏడుస్తోంది...ఏడుస్తూ ఆయాసపడుతోంది.... ఆయాసపడుతూ మాట్లాడుతోంది... 'నీకు నాకు మిగిలింది ఏడుపే...ఏడువు' అంటూ.. ఆమె మళ్లీ కొట్టబోతుంటే వాణి పరుగున వచ్చి పాపని తీసుకుని బయటకు వెళ్లింది. వాణి రమణికి తోడికోడలు. కందిపోయిన పిల్ల చెంపలను చూస్తే వాణికి కూడా కళ్లు చెమ్మగిల్లాయి. 'ఎందుకలా పిల్లని కొడుతున్నావ్.. ఏమైంది ఇప్పుడు...ఈ మధ్య నువ్వు పిల్లని బాగా కొడుతున్నావ్...ఏం చేసింది ఈ పసిది' అంటూ రమణిని గట్టిగానే అడిగింది వాణి. వాళ్లిద్దరి అత్తమామలు కూడా ఆ పక్కనే ఉన్నారు. వారి ప్రశ్నకూడా అదే. కానీ రమణిని అడిగే ధైర్యం చేయలేరు. ఎందుకంటే...రమణి బాధకి కారణమైన వ్యక్తి తమ కుమారుడే మరి.

'పెళ్లి చేస్తేనన్నా బాగుపడతాడేమో...'ఈ మాట చాలా ఇళ్లలో వినబడుతుంటుంది. అలా రామారావు ఇంట్లో కూడా ఈ మాట అతని గురించి గత నాలుగయిదేళ్లుగా వినబడి.... చివరికి అది కార్యరూపం దాల్చింది. రామారావుకి పెళ్లి చేశారు...అతని తల్లిదండ్రులు. అతను ఒక ఇంటివాడయ్యాడు. రమణి అతనికి ఇల్లాలయింది. పెళ్లయిన వారానికే రమణికి ఒక విషయం అర్థమైంది...భరించువాడు భర్త అనే నానుడి తనభర్తకు ఏమాత్రం వర్తించదని. రామారావు డిగ్రీ సెకండియర్‌తో చదువు ఆపేశాడు. చదువుని పూర్తిచేయగలననే నమ్మకం తనమీద తనకు కలగలేదు. దాంతో ఇక దానిజోలికి వెళ్లలేదు. తల్లిదండ్రులకు కూడా ఆ నమ్మకం లేదు కనుక వాళ్లూ కొడుకుని చదువుకోమని బలవంతపెట్టలేదు. అతను వారికి చిన్నకొడుకు. రామారావు వ్యక్తిగత జీవితం ఏమవుతుందనే చింతకంటే... తమకు సంపాదించిపెట్టే పెద్దకొడుకు ఉన్నాడనే భరోసా ఆ తల్లిదండ్రులకు ఎక్కువగా ఉంది. అందుకే చిన్నకొడుకు జీవితంలో స్థిరపడకపోవటం వారికి పెద్ద సమస్యగా అనిపించలేదు. పెద్దకొడుకు నారాయణ అప్పటికే బాగా చదువుకుని ఒక కార్పొరేట్ కంపెనీలో పెద్ద హోదాలో పనిచేస్తున్నాడు. అతని భార్య వాణి కూడా మంచి ఉద్యోగంలోనే ఉంది. కాబట్టి రామారావు సంపాదించకపోవటం ఎవరికీ పెద్దగా సమస్యగా కనిపించలేదు. రామారావుకి కూడా అది అలవాటుగా మారింది. ఏదో ఒక చిన్నపాటి ఉద్యోగంలో చేరటం...అక్కడ కాస్త కష్టమనిపించగానే మానేయటం...తిరిగి రెండుమూడునెలలు స్నేహితులతో ఎంజాయ్ చేస్తూ తిరగటం...తరువాత మరో ఉద్యోగం వెతుక్కోవటం ఇలా. జీవితం అతనికి అలా కులాసాగా సాగిపోతున్నపుడే రమణి అతని జీవితంలోకి వచ్చింది. ఎందుకంటే అప్పటికే రామారావు తాగుడుకి అలవాటు పడ్డాడు. పెళ్లి చేస్తేనన్నా బాగుపడతాడేమో అనే చివరి ఆశతో వాళ్లు రామారావుకి రమణిని ఇచ్చి వివాహం చేశారు. ముగ్గురు ఆడపిల్లలు ఉన్న కుటుంబంలో పెద్దమ్మాయి రమణి. కట్నకానుకలు ఏ మాత్రం ఆశించని సంబంధం దొరకడమే వారికి పెద్ద వరంగా అనిపించింది. పైగా రామారావు ఏ బాధ్యతలు లేని మనిషి. వాళ్లు అంతవరకు మాత్రమే చూశారు. కానీ అతని బాధ్యతలే ఇంట్లో వేరొకరు మోస్తున్నారన్న సంగతి వారు తెలుసుకోలేకపోయారు. అలా రమణి రామారావు భార్య అయింది. ఒకపాపకి తల్లయింది.



ఆ ఇంట్లో ఇప్పుడు అందరూ ప్రశాంతంగానే ఉన్నారు ఒక్క రమణి తప్ప. పెళ్లయి నాలుగేళ్లవుతున్నా ఆమెకు తన జీవితం ఏమిటో అర్థం కావటం లేదు. ఇప్పటికీ రామారావులో పెద్దగా మార్పేమీ రాలేదు. అతను ఇంకాస్త ఎక్కువగా తాగుడుకి బానిస అయ్యాడు. అప్పుడప్పుడు సంపాదిస్తున్నా అది అతని ఖర్చులకే సరిపోవటం లేదు. అతని నుండి ఇంటి ఖర్చులకు ఎవరూ ఆశించడం లేదు. వాణి కూడా సహృదయున్న వ్యక్తి. మరిది కుటుంబాన్ని తామే పోషించాల్సి వస్తోందని మాట వరుసకు కూడా అనదు. ఆమెకు ఇద్దరూ మగపిల్లలే కావటంతో రమణి పాప అంటే...వాణికి చాలా ఇష్టం. తన పిల్లలతో సమానంగా ఆ పాపకు అన్నీ తెస్తుంటుంది. అది కూడా దయతో ఇస్తున్నట్టు కాకుండా ప్రేమగా బాధ్యతగా పాపని చూస్తున్నామనే భావనని రమణికి కలిగించే ప్రయత్నం చేస్తుంటుంది. తోడికోడలి పెద్దమనసు గురించి రమణికి తెలుసు. వాణియే కాదు...అత్తమామలు కూడా రమణిని ఆదరంగానే చూస్తున్నారు. రామారావు మనస్తత్వం గురించి పూర్తిగా చెప్పకుండా పెళ్లి చేశామే అనే అపరాధభావన వారిని కూడా వెంటాడుతూనే ఉంది.

ముగ్గురు ఆడపిల్లలు ఉన్న కుటుంబంలో పెద్దమ్మాయి రమణి. కట్నకానుకలు ఏ మాత్రం ఆశించని సంబంధం దొరకడమే వారికి పెద్ద వరంగా అనిపించింది. పైగా రామారావు ఏ బాధ్యతలు లేని మనిషి. వాళ్లు అంతవరకు మాత్రమే చూశారు. కానీ అతని బాధ్యతలే ఇంట్లో వేరొకరు మోస్తున్నారన్న సంగతి వారు తెలుసుకోలేకపోయారు. అలా రమణి రామారావు భార్య అయింది. ఒకపాపకి తల్లయింది.

తనచుట్టూ అందరూ మంచి మనుషులే ఉన్నారని రమణికి తెలుసు. కానీ ఆమె మనసే ఎప్పుడూ రగులుతున్నట్టుగానే ఉంటోంది. ఆమెకు తెలుస్తోంది...ఇప్పుడంటే మామగారి పెన్షన్ కూడా వస్తోంది కనుక ఈ ఇంట్లో తనకి ఎంతో కొంత హక్కు ఉంది...ఆయన తదనంతరం తమ పరిస్థితి ఏమిటి... అనేది ఆమెకు అర్థం కావటం లేదు. తనే ఏదన్నా ఉద్యోగం చేద్దామంటే అంత చదువు లేదు...టెంత్ కూడా పాస్ కాలేకపోయింది. తండ్రి చదువు విషయంలో ఎంతగా మొత్తుకున్నా అప్పుడు వినిపించుకోలేదు. భర్త సంపాదించకపోవటం ఒకబాధయితే..తోడికోడలు తమని ప్రేమగా చూడటం కూడా రమణకి బాధగానే ఉంది. వాణి ఏమీ అనకపోయినా బంధువులు, చుట్టుపక్కలవాళ్లు ఈ విషయంలో రమణిని ఏదోఒక విధంగా దెప్పిపొడుస్తూనే ఉన్నారు. నాలుగురోజుల క్రితం వాణి తల్లి కూతురిని చూసిపోవడానికి వచ్చింది. రమణితో పిచ్చాపాటి మాట్లాడుతూ...'నీ పనే బాగుందమ్మా...సంపాదించకపోయినా నీకు ఏ లోటూ లేదు...నా కూతురు రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా రూపాయి మిగుల్చుకోలేకపోతోంది' అంది. అదే రోజు పక్కింటావిడ...వాళ్లబాబుని ప్రీస్కూల్లో చేర్చిన విషయం చెబుతూ...'మీ పాపని ఎప్పుడు చేరుస్తున్నారు...వాణికి ఈ విషయం నేను చెప్పనా'...అంది జాలిగా చూస్తూ.

ఈ రెండు విషయాలు రమణిని మరింతగా ఉక్కిరి బిక్కిరి చేశాయి, కసి, కోపం...ఎవరిమీద చూపించాలో తెలియని ఆవేశం..తనమీద తనకు జాలి, అసహ్యం...అన్నీ కలిసి పాప వీపుమీద వాతలుగా తేలాయి.

పాపని కొట్టిన రోజు రాత్రి రమణికి కంటిమీద కునుకులేదు. గుండెల్లోని బాధ కరిగి కన్నీరై పారింది. తను తన పాప జీవితాంతం ఇతరులపైన ఆధారపడి జీవించాలనే చేదు నిజాన్ని ఆమె జీర్ణం చేసుకోలేకపోతోంది. అదే రోజు రాత్రి ఆ పక్క గదిలో ఉన్న వాణి కూడా నిద్రపోలేదు. తను రమణిని సొంత చెల్లెలికంటే ఎక్కువగా చూస్తున్నా ఆమె ఎందుకలా ప్రవర్తిస్తుందో వాణికి అర్థం కావటం లేదు. ఈమధ్యకాలంలో రమణి చేతుల్లో పాప చాలాసార్లు దెబ్బలు తింది. పెద్దవాళ్ల సమస్యలకు ఆ చిన్నారిదెబ్బలు తినటం వాణికి అసలు నచ్చటం లేదు. ఒకసారి అడిగింది రమణిని...'ఎందుకు కొడుతున్నావ్ ఆ పసిదాన్ని' అని. 'నా ఇష్టం నా పిల్లని నాఇష్టమొచ్చినట్టు కొట్టుకుంటా...'అంటూ ఏదేదో వాగిందామె. వాణి చెబుతున్నది అసలు వినిపించుకోలేదు. వాణి ఈ విషయం గురించి అత్తమామలతో మాట్లాడింది...మరిదిని కూర్చోబెట్టి చెప్పింది...తన భర్తతో కూడా చెప్పింది. అతను నిరాసక్తంగా 'ఏం చేస్తాం...వాడు మారడు...ఏ లోటురాకుండా చూస్తున్నాం...కదా...ఎందుకు ఇంకా ఆ అమ్మాయికి బాధ' అని ఊరుకున్నాడు. కానీ వాణి అలా నచ్చచెప్పుకుని ఊరుకోలేకపోతోంది. తరువాత రోజు...'పాపని స్కూల్లో వేద్దాం...రమణీ' అంది. కానీ రమణి ఒప్పుకోలేదు. దాని తండ్రికి ఎప్పుడు దాన్ని స్కూల్లో చేర్చాలని అనిపిస్తే...అప్పుడే చేరుస్తాడు...మీరు ఇక మాకోసం ఏమీ ఖర్చుపెట్టవద్దని చెప్పేసింది. అంతేకాదు...ఆ మరుసటి రోజు రమణి మరో బాంబు పేల్చింది. పాపని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోతానని అంది. అందరూ తెల్లబోయారు. 'ఎందుకవమ్మా అలాంటి నిర్ణయం...నీకు ఏ లోటు రాకుండా చూసుకునే బాధ్యత నాది' అన్నారు మామగారు. 'ఇక్కడ ఎందుకు ఉండాలో నాకు అర్థం కావటం లేదు...మా అమ్మానాన్న ఊళ్లో లేరు. వారు రాగానే వెళ్లిపోతాను' అంది.

వాణి తల్లి అన్న మాటలు రమణి మనసుని బాగా గాయపరచాయి. అందుకే అలాంటి నిర్ణయం తీసుకుంది. రమణి నిర్ణయాన్ని ఎలా మార్చాలో వాణికి అర్థం కావటం లేదు. ఆఫీస్‌లో తనకు బాగా సన్నిహితురాలైన హిమజకు ఈ విషయం మొత్తం చెప్పింది. హిమజ భర్త సైకాలజిస్టుగా ప్రాక్టీసు చేస్తున్నాడు. హిమజ సలహా మేరకు రమణి విషయంలో అతని సలహా తీసుకోవాలని నిర్ణయించుకుంది వాణి. ఆ సాయంత్రమే హిమజతో పాటు వాళ్లింటికివెళ్లి విషయం మొత్తం ఆమె భర్తకు వివరించింది. అంతా విన్నాక...అతను చెప్పటం మొదలుపెట్టాడు...'జీవితంలో మనకు నచ్చని విషయాలు చాలా ఉంటాయి. వస్తువులు, వంటలు, సినిమాలు, మనుషులు...ఇలా. అయితే ఇలాంటప్పుడు మనం మనకు నచ్చని విషయాలకు మనుషులకు దూరంగా ఉంటాం. కానీ మనమే మనకు నచ్చకపోతే...అప్పుడే వస్తుంది సమస్య. రమణికి నచ్చనిది మీరంతా కాదు...ఆమెకు తనకు తానే నచ్చటం లేదు. సంపాదించని భర్త మారడు. మీరంతా ఆమెపైన ప్రేమనే చూపిస్తున్నా...అదిఆమెకు జాలి దయలాగే కనబడుతున్నాయి. ఆమె లేమిలో పెరిగినా ఆత్మాభిమానంతో పెరిగిన అమ్మాయిలా ఉంది. దాంతో హక్కుగా దక్కనిది ఏదీ తనది కాదని భావిస్తోంది. మీరంతా... తనమీద మేము చాలా ప్రేమని చూపిస్తున్నాం కదా...ఇంకేం బాధ అనుకుంటున్నారు....మీరు ఎంతగా ఆమెని ప్రేమిస్తుంటే...అంతగా ఆమెకు తనమీద తనకు ద్వేషం పెరుగుతోంది. ఆ ద్వేషంతోనే తనకి ప్రతిరూపమైన పాపని కొడుతోంది. పాపని కొట్టటమంటే తననితాను హింసించుకోవడమే. ఆమెకు మేము అండగా ఉన్నాం...అని మీరు అనుకుంటున్నారు...కానీ ఆమె మీ అండని చూడటం లేదు...మీపైన ఆధార పడాల్సిన పరిస్థితులను చూస్తోంది. ఆమె తనని తాను విక్టిమ్‌గా అంటే బాధితురాలిగా చూసుకోవటం వలన మీరంతా ఆమెకు ప్రత్యర్థుల్లాగే కనబడుతున్నారు. అందుకే అందరూ తనకు అనుకూలంగానే ఉన్నా ఆనందంగా ఉండలేకపోతోంది. ఆమెకు ఆత్మాభిమానం ఉంది...కానీ...జీవితాన్ని మార్చుకునే దిశగా ఆలోచించే ఆత్మవిశ్వాసం లేదు. చదువు తక్కువగా ఉండటం...చిన్నతనంనుండీ పేదరికంలో పెరగటం వలన ఆ పరిస్థితిలో ఉండవచ్చు. కానీ రమణి తన జీవితంలో మార్పుకోసం పెనుగులాడుతోంది. అందుకే మీరంతా ఎంత బాగా చూస్తే అంతగా బాధపడుతోంది. మన సామాజిక పరిస్థితులు అలాగే ఉన్నాయి... అన్నంపెడుతున్నాం...కదా అనుకుంటారు...ఆత్మ విశ్వాసం నింపనిదే మనసు ఆకలి తీరదని గుర్తించము. మనం భౌతిక అవసరాలపైనే దృష్టి పెడతాం...తప్ప మానసిక అవసరాలను పట్టించుకోము అందుకే మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మానసిక సమస్యలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి...అన్నాడతను.



అతను చెప్పింది మననం చేసుకుంటూ ఇంటికి బయలుదేరింది వాణి. రమణికి ఎందులో ఆసక్తి ఉందో కనుక్కుని... అందులో తనచేత ఒక చిన్న కుటీర పరిశ్రమని మొదలుపెట్టించాలి. దానికి పెట్టుబడి కూడా తను ఇవ్వటం కాకుండా...ఏదైనా బ్యాంకు లోన్ ద్వారా వచ్చేలా ప్రయత్నం చేయాలి...అప్పుడే రమణిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది...ఇలా అనుకున్నాక వాణి మనసు తేలికపడింది....ఆమె ఉత్సాహంగా అడుగులు ముందుకువేసింది.

**- వడ్లమూడి దుర్గాంబ**

---



## సారా... ఆరువందల స్కర్టు!

ఎప్పుడైనా ఏ కాలంలో అయినా సినీతారలు ధరించిన దుస్తులు జనంలో బాగా పాపులర్ అవుతుంటాయి. ఇప్పటికీ తారలు ధరించిన దుస్తులకు అలాంటి క్రేజ్ ఉంది. అయితే...ఎక్కడో టాలీవుడ్ బాలీవుడ్ తారలు ధరించే డిజైనర్ దుస్తులు తమకు అందుబాటులో ఉంటాయా...అనే అనుమానం చాలామందికి ఉండవచ్చు. అలాంటి సందేహాలకు చెక్ పెడుతూ...అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో లభించే ఫ్యాషన్ దుస్తులతో కనబడుతుంటుంది.... బాలీవుడ్ యువతార, సైఫ్ ఆలీ ఖాన్ కుమార్తె సారా అలీఖాన్. ఆమె ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పింక్ షర్టు, పూల స్కర్ట్‌తో కనిపించింది. ఆమె ధరించిన స్కర్టు ఖరీదు కేవలం రూ. 643. బ్రిటీష్ ఫ్యాషన్ రిటైలర్ టాప్‌షాప్ వెబ్‌సైట్‌లో దీని ధర 7పౌండ్లు. అంటే...రూ. 643. సారా ఫ్యాషన్లను ఇష్టపడేవారికి ఈ స్కర్టు అందుబాటు ధరలోనే లభిస్తోంది. అయితే దీనిపై ఆమె ధరించిన పింక్ షర్టు ధర మాత్రం రూ.5,700. ఇది ముంబయి డిజైనర్ కంపెనీ మాడిసన్ రూపొందించినది. ఇంతకుముందు కూడా సారా రూ.2,100 విలువ చేసే తెల్లని మ్యాక్సీలో కనిపించి ఇలాగే వార్తల్లోకి ఎక్కింది.

---

## బడిబాటలో నడిచి నడిపించి...!

విద్య పరమార్థం చదువును బోధించడం మాత్రమే కాదు.... ఒక తరాన్ని నిర్మించి జాతీయ సంపదను సృష్టించడం. అలాంటి విద్యని అందించే తరగతి గదికి రథసారథులు ఉపాధ్యాయులే. అంతటి గుర్తింపునే తెచ్చుకున్నారు...హైదరాబాద్ విద్యాశాఖాధికారి బి. వెంకటనర్సమ్మ. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన సూర్యాపేట జిల్లాకు విద్యాశాఖాధికారిగా పనిచేసినప్పుడు విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొనివచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి పాటుపడ్డారు. బడిబయట పిల్లలను పాఠశాలలో చేరేలా శ్రమించారు. ఉపాధ్యాయుల గైర్హాజరును తగ్గించి సమయపాలన పాటించేలా చేశారు. బాలికల విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఆమె కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఇటీవల ఆమెకు జాతీయ ఉత్తమ విద్యాశాఖాధికారి పురస్కారాన్ని ప్రదానం చేసింది. వెంకటనర్సమ్మ వ్యక్తిగత...వృత్తిగతమైన ప్రయాణం గురించి-



కేంద్ర ప్రభుత్వపు ఉత్తమ విద్యాశాఖాధికారి పురస్కార గ్రహీత హైదరాబాద్ డిఈఓ వెంకటనర్సమ్మ



గతంలో విద్యాశాఖాధికారిగా పనిచేసిన ఖమ్మం జిల్లా, భద్రాది కొత్తగూడెం జిల్లా, సూర్యాపేట జిల్లాలతోపాటు ప్రస్తుతం పనిచేస్తున్న హైదరాబాద్ జిల్లాల్లోను పాఠశాల విద్యను కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. గ్రామీణ విద్యార్థినిగా చదువు కొనసాగించి, విద్యాశాఖాధికారిగా ఎదిగి జాతీయ ఉత్తమ విద్యాశాఖాధికారి పురస్కారాన్ని అందుకున్నారు బెసవ వెంకటనర్సమ్మ.

### తండ్రి ప్రోత్సాహంతో... చదువుల్లో రాణించి

తూర్పుగోదావరి జిల్లా ముమ్మడివరం మండలంలోని గాడిలంక మారుమూల గ్రామంలో ఓం శివాజి, కాశీ అన్నపూర్ణ దంపతుల ఐదుగురు కుమార్తెల్లో పెద్దకూతురు వెంకటనర్సమ్మ. అదే గ్రామంలో 7వ తరగతి వరకు విద్యనభ్యసించారామె. 8వ తరగతి చదువుకోసం గ్రామం నుండి మెయిన్‌రోడ్డుకు కిలోమీటరున్నర కాలినడకన నడిచి అక్కడి నుండి బస్ ఎక్కి ముమ్మడివరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముమ్మడివరం ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తిచేసి 442 మార్కులతో మండల టాపర్‌గా నిలిచారామె. ఇందులో తన తండ్రి ఓం శివాజి సహకారం ఎంతో ఉందంటారామె. అప్పటి సామాజిక పరిస్థితులను బట్టి ఆ గ్రామంలో ఎవరూ ఆడపిల్లలను ఇంటర్ విద్యకు పంపించడానికి ఇష్టపడేవారు కాదు. వెంకటనర్సమ్మ పదవతరగతిలో సాధించిన మార్కులను చూసిన ఆమె బాబాయి నమః శివాయ ఇంటర్ విద్యను చదివించాలని వెంకటనర్సమ్మ తండ్రికి సలహా ఇవ్వటంతో ఇంటర్ చదవగలిగారామె. ఇంటర్మీడియట్ ఎంపిసిలో 718 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. తల్లిదండ్రులు, బాబాయి ఇచ్చిన ప్రోత్సాహంతో వెనక్కు తిరిగి చూడకుండా తన చదువును కొనసాగించారు. డిగ్రీ విద్యను అమలాపురంలోని ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాలలో పూర్తిచేసి....ఆపై రాజమండ్రిలోని ఐఎఎస్ఇ బిఇడి కళాశాలలో ప్రవేశం పొందారు. చదువుకి ఆటంకాలు ఎదురవుతున్నా...తండ్రి ప్రోత్సాహంతో బిఇడి విద్యను, విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీని పూర్తిచేశారు.

### సమర్థత కలిగిన అధికారిగా....గుర్తింపు

పిజి పూర్తిచేసిన అనంతరం ఎస్‌జిటి టీచర్ పోస్టును సాధించారు. 2000 సంవత్సరంలో స్కూల్ అసిస్టెంట్ టీచర్ ఉద్యోగం పొందారు. 2008లో డిప్యూటీ డిఇఓ పోస్టులకు దరఖాస్తు చేసుకొని సోదరి చందు, భర్త కుమార్ ఇచ్చిన ప్రోత్సాహంతో డిప్యూటీ డిఇఓ కాగలిగారు. తరువాత రాష్ట్రవిద్యాశాఖ కల్పించిన అవకాశాన్ని బట్టి 2009లో ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక విద్యాశాఖగా పేరుపొందిన ఖమ్మం జిల్లా విద్యాశాఖలో అత్యంత చాకచక్యంగా పనిచేసి అందరిచేత ప్రశంసలు పొందారు. జిల్లాలోని పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు పనితీరు, విద్యార్థుల హాజరు తదితర విషయాలను పర్యవేక్షించి పనితీరు మెరుగుపరిచారు. కార్యాలయంలో సిబ్బంది మధ్య గతంలో ఉన్న వర్గ రాజకీయాలను తగ్గించి పనివైపు మళ్లించారు. ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహనతో కార్యాలయ సిబ్బంది పనితీరును వేగవంతం చేయించారు. బదిలీలు, ప్రమోషన్లు, డిఎస్సీ కౌన్సిలింగ్‌లు పారదర్శకంగా సూర్యాస్తమయ సమయానికి పూర్తిచేసిన ఘనత వెంకటకనర్సమ్మకే దక్కింది. తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాగా ఏర్పడిన సూర్యాపేటకు 2 సంవత్సరాల క్రితం తొలివిద్యాశాఖాధికారిగా నియమితులై సూర్యాపేట జిల్లా పాఠశాల విద్య సమగ్రాభివృద్ధికి కృషి చేశారు. ప్రధానంగా పాఠశాల విద్యలో నైపుణ్యాలను పెంచడం, డిజిటల్ వ్యవస్థను అభివృద్ధి చేయడం, బాలికల విద్యకోసం శ్రమించడం, ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చేయటం...వంటి అంశాల్లో కృషి చేసి... స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ జిల్లా అధికారి పురస్కారం అందుకున్నారు. గత ఏడాది నుంచి హైద్రాబాద్ జిల్లాకు విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

**- గుంజులూరి దేవేందర్**
**ప్రభాన్యూస్, ఖమ్మం**

# ప్రస్థానత్రయము అంటే ఏమిటి?

చింతన



**ఉపనిషత్తులు-బ్రహ్మ సూత్రములు భగవద్గీత ఈ మూడు గ్రంథములను "ప్రస్థానత్రయము"అందురు. ఈ మూడింటి మధ్యలో అభిప్రాయ భేదములు లేవు. తత్త్వార్థములు ఈ మూడింటి యందును విశదముగా విపులీకరించబడి యున్నవి. హైందవ మతమునకు శాస్త్రమేదని అడిగినచో "ప్రస్థానత్రయము" అని చెప్పవలెను.**

శాస్త్రములన్నిటికిని వేదములే మూలమని చెప్పెదరు. వేదములందు ఎక్కువ భాగము అందుబాటులో లేదు. అయినప్పటికి వేదముల నుండి సంగ్రహింపబడిన ఉపనిషత్తులు జాగ్రత్తగా కాపాడబడుచున్నవి. భగవంతుని సాన్నిధ్యము పొందుటకు ఉపనిషత్తుల పాత్ర ఎట్టిదని బ్రహ్మసూత్రములు వివరించుచున్నవి. దీనికి వేదాంత సూత్రములని నామాంతరము గలదు. ఉపనిషత్తుల యందు చెప్పబడిన విషయములను విశదముగా వివరించునట్టిది ''భగవద్గీత''.

### భగవద్గీతోపనిషత్తు

ఉపనిషత్తులన్నియు నాలుగు వేదముల నుండి వచ్చినవి. కాని భగవద్గీత మహాభారతము నుండి వచ్చినది. అయినను ఇది ఉపనిషత్తు అని పిలవబడుచున్నది. ఎందుకనగా భగవద్గీత యందు అన్ని ఉపనిషత్తుల యొక్క సారాంశము మిళితమైయున్నది. ఉపనిషత్తులన్నియు ఆవు అన్నచో, భగవద్గీత ఆ ఆవులిచ్చెడి పాలు అనవచ్చును. ఆ పాల నుండి పెరుగు, వెన్న, నెయ్యి మొదలైనవి చేసికొనవచ్చును. అదే రీతిగా గీతా శాస్త్రము ఇహపరములు రెండింటికి తగిన మార్గదర్శకముగా నుంచుకొనవచ్చును.

### శృతి-స్మృతి

భగవద్గీత యొక్క ప్రాశస్త్యమునకు ఒక ముఖ్యమైన కారణము గలదు. అది ఒకే కాలములందు శృతిగాను, స్మృతిగాను నున్నది. శృతి, స్మృతి అనగానేమి?

ఉపనిషత్తులకు శృతి అని పేరు గలదు. కర్ణపరంపరగా చెవి ద్వారా విని జ్ఞాపకములోనుంచుకొని పదిలపరచుటను శృతియందురు. చాలాకాలముగా ఒకరి ద్వారా ఒకరు విని నేర్చుకొన్నదిగానున్నను అందలి పదభావములను మార్చివేయుట ఉండదు. కావున మూలభావము కూడ మార్పు లేకుండయుండును. గణితము నందు ఎట్లు అంకెలను ఎక్కములను ఎవరివలనను మార్చడానికి వీలుకాదో అట్లే శృతి భావములను ఎవ్వరును మార్చలేరు. సత్య స్వరూపమును, పరమార్థమును వివరించునట్టి ఈ శృతి భాష ఎన్నటికి మార్పు లేకుండగనున్నది. కావున శృతి శాశ్వతమైనది.

**స్మృతి:** అనగా జ్ఞాపకములో నుంచుకొనునది అని అర్థము. సాంఘీక జీవనమునకు కావలసిన కట్టుబాట్లను సంప్రదాయాలను స్మృతియందురు. బాగుగా అమర్చిన స్మృతులు ఎప్పటికి పరతత్త్వములను ఆధారముగా కొనియున్నది. పరాశర స్మృతి, మనుస్మృతి మొదలైనవి ప్రసిద్ధమైనవి. స్మృతులు శాశ్వతమైనవి కావు. కాలము, స్థలము, సందర్భములకు తగ్గట్లు అవి మారుబడు చుండును. కావున స్మృతి యనునది అప్పటికపుడు మార్పుపొందునట్టి స్వభావము గల సాంఘీక పద్ధతులనవచ్చును.

శ్రీమద్భగవద్గీత ఏకకాలము నందు శృతివలెను, స్మృతివలెను ఏర్పడి యున్నది. పరతత్త్వమును అతి చక్కగా వివరించుటచే స్మృతియనవచ్చును. పరతత్త్వమునకు తగినట్టి జీవితమును జీవించుటయే సనాతనధర్మము. ఈ గ్రంథము ద్వారా సనాతన ధర్మమును యధాతథముగా నేర్చుకొనవచ్చును.

సనాతన ధర్మము బంగారము వంటిది. బంగారు కాసువంటిది యుగధర్మము: ఇక స్మృతియు బంగారపు కాసువంటిదే. తక్కిన స్మృతులు కాలమునకు తగ్గట్లు మార్పులు చెందును. కాని భగవద్గీతను మాత్రము మార్చడానికి వీలుపడదు. మార్పులు చెందు ప్రపంచము నందు మార్పులు చెందని తత్వములనే గీతాశాస్త్రము వివరించుచున్నది. కావుననే ఇది అన్ని కాలముల యందు అన్ని సమాజముల యందు ఉపయోగింపదగ్గ స్మృతియగును.

### భాష్యములు

ఒకే గ్రంథము యొక్క తాత్పర్యమును అందరికి అర్థమగురీతిగా విశదముగా వివరించుట చేత ఆ వివరణకు భాషము అని పేరు వచ్చెను. ఉన్నతమగు తత్త్వములు గల గ్రంథములకు ఇట్టి భాష్యములు పలువురచే చెప్పబడుట సహజము. ప్రస్థానత్రయమైన ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత మూడింటికి భాష్యకారులు పలువురు గలరు. ప్రస్థాన త్రయము నందు భగవద్గీతకు మాత్రమే ఇట్టి భాష్యములు అనేకములున్నవి.

- కోసూరు హయగ్రీవరావు
9949514583

## గీతాపఠనంతోనే జీవితానికి నిజమైన సాఫల్యత




**య ఏవం వేత్తి పురుషం
ప్రకృతిం చ గుణైస్సహ।
సర్వథా వర్తమానోపి
న స భూయోభిజాయతే॥**

**అధ్యాయం-13, శ్లోకం -24**


**అర్థము :** భౌతిక ప్రకృతి, జీవుడు, త్రిగుణముల అంతఃప్రక్రియకు సంబందించిన ఈ తత్త్వమును అవగాహన చేసికొనిన వాడు నిశ్చయముగా మోక్షమును పొందును. అతని వర్తమాన స్థితి ఎట్లున్నను అతడు తిరిగి జన్మింపడు.

**భాష్యము :** ఇంతవరకూ వివరించిన జ్ఞానము యొక్క లక్ష్యమేమనగా జీవుడు తన పొరపాటు వలన ఈ భౌతికసంసారములో పడిపోయి తిరిగి గురువు, సాధువు ప్రామాణికుల సాంగత్యములో వారి కృప కొరకు కృషి చేసి భగవద్గీతను అర్థము చేసుకుని తన నిజస్థితిని తెలుసుకున్నట్లయితే ఈ భౌతిక సంసారమునకు తిరిగి రావలసి ఉండదు. ఆధ్యాత్మిక ప్రపంచమునకు తరలించబడి, జ్ఞానము మరియు ఆనందములతో కూడుకుని ఉన్న శాశ్వత జీవితమును అనుభవించ గలుగుతాడు. అదే జ్ఞానము యొక్క నిజమైన సాఫల్యత.

**అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.**

android Google play | iOS iTunes

# అశ్వత్థామకు కృష్ణుని శాపం



## శాపగ్రస్తుల కథా కమామిషు-14

మైత్రేయ మహర్షి శాపం వల్ల దుర్యోధనుడు తొడలు విరుగుతాయనే శాపం పొందినట్లు తెలుసుకున్నాం. యుద్ధంలో దుర్యోధనుడి తొడలను భీముడు విరగ్గొట్టిన సంగతి తెలిసిందే. అనంతరం పాండవులు కృష్ణునితో కలిసి అక్కడి నుంచి నిష్క్రమించారు. దుర్యోధనుని పరామర్శించడానికి అశ్వత్థామ వచ్చాడు.

ఇన్నేళ్లు తనకు, తన తల్లిదండ్రులైన ద్రోణాచార్యులు, కృపికి ఆశ్రయం ఇచ్చిన కౌరవుల రుణం తీర్చుకోవాలనుకున్నాడు. పంచ పాండవులను చంపాలని వారి కుటీరంలో అర్ధరాత్రి ప్రవేశించాడు. చీకట్లో కనబడక కసితో, కోపంతో, పగతో అక్కడ నిద్రిస్తున్న ఆరుగురిని వధించి వేగంగా పోయి, పాండవులను చంపానని దుర్యోధనునితో చెప్పాడు. అతను ఆనందంగా కన్ను మూశాడు. కాని అశ్వత్థామ చంపింది ఐదుగురు ఉపపాండవులను, ధృష్టద్యుమ్నుని.

ఉపపాండవుల హత్యను చూసి ద్రౌపది, పాండవులు, కృష్ణుడు నిర్ఘాంత పోయారు. ఇది అశ్వత్థామ ప్రతీకార చర్య అని చెప్పాడు కృష్ణుడు అందరితో. ద్రౌపది ఆగ్రహించింది. అతడు పాండవులకు గురు పుత్రుడు అవుతాడు కనుక చంపడం మహాపాపం. అయితే అశ్వత్థామ తలలో అతనికి ఆకలిదప్పులు, అనారోగ్యం, అస్త్ర శస్త్రాల బారి నుంచి రక్షించగల మణి ఉంది. అది నాకు తెచ్చిస్తే అతను చనిపోయి నట్లేనని అది తెమ్మని ద్రౌపది అర్జునుని కోరింది. అశ్వత్థామను వెతుకుతూ అంతా వెళ్ళారు. అతడు వ్యాసుని ఆశ్రమం వెనుక దాక్కున్నాడు. అర్జునుడు తనను ఏమీ చేయకుండా ఉండేందుకు అతను **'అపాండవం అగుగాక'** అని తన వద్ద ఉన్న బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. దానిని నిరోధించేందుకు అర్జునుడు అదే అస్త్రాన్ని ప్రయోగించాడు. వాటి వలన సమస్త ప్రకృతి విలయం దాపురించబోగా నారదుడు, వ్యాసుడు వాటిని ఉపసంహరించమని ఇద్దరినీ కోరారు. అర్జునుడు ఉపసంహరించగా అశ్వత్థామ ఉపసంహారం తెలియదన్నాడు. దానిని పాండవుల వంశాకురం ఉన్న ఉత్తర గర్భంలోని శిశువు పైకి మళ్లించాడు అశ్వత్థామ. అతనిని శ్రీకృష్ణుడు తన శక్తితో కాపాడాడు. ఆ శిశువే పరీక్షిత్తు. ఉపపాండవుల నుంచి పరీక్షిత్తు వరకూ అందరిపై కసితో ఉన్న అశ్వత్థామపై శ్రీకృష్ణునికి కోపం వచ్చింది. ఆయన అశ్వత్థామతో **'నీవు నిర్దయుడైన బ్రాహ్మణుడివి. చిరంజీవిగా మూడు వేల సంవత్సరాలు బ్రతుకుతావు. అయితే అనాథగా, నికృష్టంగా, దిక్కులేకుండా, నీ శరీరం కుళ్లిపోతున్నా నిన్ను పట్టించుకునే వారెవరూ ఉండరు'** అని శపించాడు. అశ్వత్థామ తన తలలోని మణిని ధర్మరాజుకిచ్చి తపస్సు చేస్తూ శేష జీవితం గడపడానికి అడవులకు వెళ్లిపోయాడు.

(సౌప్తిక పర్వంలోనిదీ వృత్తాంతం).

### గాంధారి శాపం

కురుక్షేత్ర యుద్ధానంతరం పాండవుల్ని గాంధారి వద్దకు తీసికెళ్లాడు కృష్ణుడు. ఆ సందర్భంగా ఎంతో వ్యధతో ఉన్న గాంధారి, తన నూరుగురు కొడుకులను కృష్ణుడు దేవుడై ఉండి కూడా కాపాడలేకపోగా కురుక్షేత్ర యుద్ధంతో దగ్గరుండి చంపించాడని, అక్కసు వెళ్ళగక్కింది. **'నా పుత్రులు ఎలా మరణించారో** అలాగే నీ **యదు వంశమూ సర్వ నాశన మవుతుంది'** అని ఆమె శపించింది. దానికి కృష్ణుడు **'అత్తా నీవన్నట్లే జరుగుగాక'** అని అన్నాడు. ఆ శాపం సాకార మవడానికి మరో శాపం దోహదం చేసింది. ఒకసారి యాదవులు శ్రీకృష్ణుడి మనుమడైన సాంబుడికి స్త్రీ వేషం వేసి, తమ గురువైన గర్గ మహర్షి వద్దకు తీసుకుపోయి, 'మునివర్యా మీరు భవిష్యత్తు చెప్పడంతో దిట్టలని విన్నాము. ఈ స్త్రీకి పుట్టబోయే శిశువు ఆడో మగో చెప్పమ'ని బలవంతపెట్టారు. దివ్య దృష్టితో చూసిన ముని విషయం తెలుసుకుని ఆగ్రహించి 'మూర్ఖులారా! మీరు నన్ను, నా పాండిత్యాన్ని, అనుభవాన్ని అవహేళన చేశారు. మీకు శాపం ఇస్తున్నాను. ఈ స్త్రీకి ముసలం పుడుతుంది. అది మీ వంశాన్ని నాశనం చేస్తుంది అని శపించాడు. వారంతా ఆయన కాళ్లమీద పడ్డా, ప్రాధేయపడ్డా ఫలితం లేకపోయింది. సాంబుడు స్త్రీగా మారాడు. నవమాసాలూ మోసి ఒక రోకలిని కన్నాడు. దానిని అరగదీసి సముద్రంలో కలిపేస్తే సరి అని అరగదీసారు. అలా అగరతీయగా వచ్చిన రజను, పొట్టుతో సముద్ర తీరంలో రెల్లు గడ్డి మొలిచింది. చివరలో ఇంకా చిన్న ముక్క మిగిలి ఉండగా అదేమి చేస్తుందిలే అని సముద్రంలోకి విసిరేశారు. ఒక పర్యాయం యాదవులు సముద్ర స్నానానికి వెళ్లారు. అక్కడ మద్యం తాగారు. ఆ మత్తులో మాటా మాటా పెరిగి ఘర్షణపడి పదునుగా ఉన్న రెల్లు గడ్డినే ఆయుధాలుగా వాడి ఒకరినొకరు కొట్టుకుని చని పోయారు. అంతకు ముందు వారు సముద్రంలోకి విసిరేసిన రోకలి ముక్క ఒక బోయవాడికి లభించింది. అతడు సూదిగా ఉన్న రోకలి ముక్కను ఒక బాణం చివరన కట్టాడు. అడవిలో పడుకుని ఉన్న శ్రీ కృష్ణుని కాలి బొటనవేలిని మృగంగా భావించి ఆ బాణంతో కొట్టాడు. శాప ఫలితంగా ఆ రోకలి ముక్కే శ్రీకృష్ణుని అవతారసమాప్తికి కారణ మయింది. అలా గాంధారి, గర్గ మహాముని శాపాలు యదు వంశ వినాశనానికి కారణమయ్యాయి. భారత భాగవతాలు ఆ కథను వివరిస్తున్నాయి.

- డాక్టర్ దేశిరాజు లక్ష్మీ నరసింహారావు
9985844558

## దిన ఫలాలు

**మేష రాశి:** కోర్టు సంబంధిత వ్యవహారాలలో సానుకూలత ఉంటుంది. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభ మవుతుంది.

**వృషభ రాశి:** అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగు తాయి. ప్రయాణాల విష యంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కా రాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించ గలుగుతారు.

**మిథున రాశి:** వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహ కార్యాలు, కార్య క్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నా లతో ఆదాయపరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

**కర్కాటక రాశి:** దూరప్రయా ణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబ రీత్యా ఆనందాన్ని కలిగి స్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటా యి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

**సింహ రాశి:** ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

**కన్యా రాశి:** ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్ప ర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి

**తులారాశి:** విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

**వృశ్చిక రాశి:** వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ ప్రతికూలతలు ఉంటాయి.

**ధనూ రాశి:** ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

**మకర రాశి:** ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పని సరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికి పోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

**కుంభరాశి:** నూతన స్నేహాల ద్వారా లబ్ది చేకూరుతుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

**మీనరాశి:** విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

## శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

(గత సంచిక తరువాయి భాగం)

కోసుకుంటే కోసుకోండి, నెత్తురు కారుతుంటే నిత్యబంగారం పండుతోంది. శమంతకమణి అని తన పుండును వర్ణించటం.

డాక్టర్లు ఈ వ్రణమింత ఘోరంగా వున్నదే. మీరు తపశ్శక్తిచేత మాన్పించుకోరాదా అంటే, మహర్షి ఇలా అన్నారు. ''ఈ శరీరం వున్నదని దానికి చేయి వున్నదని, దానికి పుండు వుందని, మీరంటుంటే నేను కూడ ఆ దృష్టితో చూస్తే వున్నవి. లేకపోతే నాకేమీ వున్నట్లు లేదే. ఎవరికొరకు చేయమంటావు''అంటే ప్రక్కన కొందరు ''మా కొరకు'' అన్నారట. మహర్షి వారి వంక చూచి, ''ఓహో తమరొకరున్నారా?''అన్నారట.

మహర్షి యొక్క లీలలు వ్రాసిన లేఖలు చదివిన అనుభవమే యిట్లా వుంటే లేఖలు వ్రాసిన అనుభవం ఎట్లాంటిదో?

అంతయునైన తరువాత నొక ప్రశ్న మిగిలినది. తానే వటచ్ఛాయందపమాచరించుచుండెనో ఆ వటత్రదర్శనమునకు మాత్రమే యోగ్యత కలిగియుండుటకు శ్రీరమణ మహర్షి యంతవాడు కావలసి వచ్చెనో, ఆయరుణగిరినాథుడెవరు? ఎవరికిగన్పించును.


ఈ తత్త్వము నిరవధికమా?

విజయవాడ విశ్వనాథ సత్యనారాయణ

## పీఠిక

### మంగళము

"మంగళయోగి హృదయాబ్జ మందిరమునకు
మంగళము సచ్చిదానంద మయునకెపుడు
మంగళము చిత్కళాపూర్ణ మహితకాంతి
మండనునకు సదా జయమంగళంబు॥
"జయ శ్రీరమణ జయభవహరణ
జయజయ సన్ముని సేవితచరణ॥ ॥జ॥
జ్ఞానామృతమున దీనులదనుపగ
పూని నరాకృతి బొందిన పరుడవు॥ ॥జ॥
శాంతి భూములను చరియించెడు నిను
చేరి భజించెద చిన్మయ రమణ॥ ॥జ॥
పాదకమలమధుపానము సేయుచు
పొడెద మధుపము భంగిని రమణ। ॥జ॥
తను వాఙ్మనముల నిను సేవింపుచు
ఘనతర శాంతిని గనియెద రమణ॥ ॥జ॥
సుందరనందన సూరిజనావన
వందనశతముల నందవె రమణ॥ ॥జ॥
కైమోడ్చుచు నా గతి నీవను నా
గాంబను కరుణతో నరయవె రమణ॥
॥జ॥
జయసుఖరూపా!జయపరమేశా!
జయజయ అరుణాచల శ్రీరమణ॥ ॥జ॥




**సర్వం సంపూర్ణము
ఓం తత్సత్
ఓ రమణార్పణమస్తు.**

- సూరినాగమ్మ

**శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో**

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



విజేత

తన ఆసక్తికి ప్రాధాన్యత ఇవ్వకుండా తల్లిదండ్రుల ఆసక్తికి ప్రాధాన్యత ఇచ్చింది. వారు చూపించిన మార్గంలో పూర్తి శ్రద్ధాసక్తులతో శిక్షణ తీసుకుని లక్ష్యాన్ని సాధించింది. చెస్ ఆట ఎలా ఆడతారో కూడా తెలియని ఆమె ఈరోజు మంచి ఆటనైపుణ్యంతో స్వర్ణపతకం సాధించింది. ఆమే రాజమండ్రికి చెందిన తెలుగమ్మాయి గోలిసంధ్య. గత శనివారం ఆసియా మహిళల(ఔత్సాహిక) చదరంగ పోటీలలో ఆమె స్వర్ణపతకాన్ని సాధించింది. ఈ స్థాయికి రావడానికి ఆమెకి ప్రోత్సాహమిచ్చినదెవరు, సాధించాల్సిన లక్ష్యాలేమిటనే వివరాలు ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.




# చదరంగంలో 'సంధ్యో'దయం



**నా** పదమూడేళ్ల వయసులోనే మొట్టమొదటిసారిగా చెస్ ఆడడం మొదలుపెట్టాను. ఇప్పుడు నా వయసు 27 సంవత్సరాలు. 14 సంవత్సరాల నా కఠిన శ్రమకు తగిన ఫలితం ఈనాటికి దక్కింది. మాది మారుమూల గ్రామం కావడం వల్ల ఆడపిల్లలకు ఎన్నో కట్టుబాట్లు ఉండేవి. ఏదైనా సాధించాలని ఉన్నా వాటికి ఎన్నో అవాంతరాలు, అడ్డంకులుండేవి. మా గ్రామంలో నా ఆటకు కావలసిన మెరుగైన సదుపాయాలుండేవి కావు. అయినా వీటన్నింటిని ఖాతరు చేయకుండా అమ్మానాన్నల ఇచ్చిన ప్రోత్సాహంతో, మనోధైర్యంతో ముందుకు నడిచి అనుకున్న లక్ష్యాలను చేరుకున్నాను. నా లక్ష్యం ఎప్పటికైనా మహిళల గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను సాధించడమే. దానిని తప్పకుండా సాధిస్తాను.

మనదేశంలో ఇప్పటివరకు చెస్‌లో ఎక్కువమంది పురుషులే ముందంజలో ఉన్నారు. అది చూసి నేను వెనుకంజ వేయలేదు. పదమూడేళ్ల వయసులోనే చెస్‌ను ఒక హాబీగా మొదలుపెడితే 27 సంవత్సరాల వయసులో విజయం దక్కింది. గత ఐదు సంవత్సరాలలో జాతీయ మహిళల ఛాంపియన్, ఆసియన్ మహిళల ఛాంపియన్స్‌లో పేరు సంపాదించుకున్నాను. ఈవిజయంతో ర్యాంకింగ్‌లో నేను రెండవస్థానాన్ని సంపాదించుకున్నాను.

## బాల్యం

మాది రాజమండ్రి. నాన్నగారు రాజమండ్రి సెంట్రల్ జైలులో చీఫ్ హెడ్ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. ''మా నాన్నగారే నాకు రోల్‌మోడల్. ఆయన ప్రతి వ్యక్తితో ఎంతో సౌమ్యంగా, ప్రేమగా మాట్లాడతారు. అలాగే నేను కూడా అందరితో సౌమ్యంగా, ప్రేమగా మాట్లాడాలని కోరుకునేవారు. ఆయన జైలులో పనిచేయడం వల్ల ఎంతోమంది ఖైదీలతో చాలా సౌమ్యంగా మాట్లాడ వలసి వస్తుంది. వారందరితో కూడా ఆయన ఎంతో గౌరవభావంతోనే మాట్లాడేవారు. నేను చెస్‌లోకి రావడానికి మా అమ్మ ఆసక్తే కారణం. ఆమెకు చెస్ అంటే ఎంతో ఇష్టం. ఆమెకు పద్నాలుగేళ్ల వయసులోనే పెళ్లయిపోయింది. దానివల్ల స్కూల్ వయసులోనే చెస్ ఆటను వదిలి వేయాల్సి వచ్చింది. తను సాధించలేని లక్ష్యా లను నేను సాధించాలన్నదే ఆమె కోరిక. స్కూలులో నా చదువుతో పాటు ఏదైనా రంగంలో పేరుతెచ్చుకోవాలన్న ధ్యేయం తోనే నన్నెప్పుడూ ప్రోత్సహించేది. డాన్స్, డ్రాయింగ్, మ్యూజిక్ క్లాసెస్‌లో పాల్గొని వాటికి సంబంధించిన పోటీలలో పాల్గొనాలనే చెప్పేది. ఆమె ప్రోత్సాహంతో అన్నింటిలో ఉత్సాహంగా పాల్గొనేదాన్ని.

## ఆట ప్రారంభమైందిలా...

ఒకసారి నేను నాన్నగారితో వారి స్నేహితుడి ఇంటికి వెళ్లాను. అక్కడ వారందరూ చెస్ ఆడుతున్నారు. వారి ఆటను గమనిస్తూ కూర్చున్నాను. ఇంతలో నాన్నగారి స్నేహితుడు నన్ను కూడా చెస్ ఆడమని అడిగారు. అప్పటివరకు నాకు చెస్ అంటే ఓనమాలు కూడా తెలియదు. అదేవిషయం వారికి కూడా చెప్పాను. దానికి మా నాన్నగారు నా స్నేహితుడు తనవంతు సాయం అందిస్తాడు ఆడమని ప్రోత్సహించారు. ఆటమొదలైన కొద్దిసేపటి తర్వాత కూడా నాకు మా తమ్ముడికి ఆట ఆడేవిధానం అస్సలు అర్థం కాలేదు. ఆ విషయం నాన్నగారు గ్రహించారు. ఇంటి వచ్చాక చెస్ ఎలా ఆడాలనేది మా నాన్నగారు నాకు, తమ్ముడికి ఇద్దరికి నేర్పడం మొదలుపెట్టారు. మా తమ్ముడు, నేను స్కూల్ చెస్ పోటీలలో పాల్గొనేవాళ్లం. మొదటి రౌండ్‌లోనే ఓడిపోయేవాళ్లం. అలా ఓడిపోయినందుకు నిరుత్సాహపడకుండా సంవత్సరమంతా ఇద్దరం కలిసి ప్రాక్టీసు చేసేవాళ్లం. ఆ మరుసటి సంవత్సరానికి మా ఆటతీరులో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకున్నాం. అలా ఒకసారి మొదటి స్థానాన్ని సంపాదించుకున్నాను. చెస్‌మీద నాకున్న ఆసక్తిని గమనించిన మా అమ్మానాన్న చెస్ కోచింగ్ క్లాసులకు పంపించేవారు. 2005లో హైదరాబాద్‌లో జాతీయస్థాయి పోటీలో నేను పాల్గొన్నాను. అందులో అండర్ 19 బాలికల రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్‌షిప్‌లో మొదటి స్థానాన్ని పొందాను. మాకున్న ఆర్థిక పరిస్థితులలో నన్ను చెస్ టోర్నమెంటులకు, కోచింగ్‌కి పంపించడం, చాలా కష్టతర మయ్యేది.

నా చెస్ ఆట కోసం మా నాన్నగారు తన సొంత ఇంటిని అమ్మేయడమే కాకుండా పిఎఫ్ ఫండ్‌లోంచి లోను పెట్టి నాకు మెరుగైన శిక్షణ ఇప్పించారు. ఆయన చేసిన ఈ పనికి స్నేహితులందరూ ఎగతాళి చేశారు. ప్రావిడెంట్ ఫండ్ నువ్వు రిటైర్ అయ్యాక నీకు ఉపయోగపడు తుందని, ఆటకోసం ఈవిధంగా డబ్బును ఖర్చు చేయడం మంచిది కాదని ఎంతో నచ్చచెప్పారు. కాని నాన్నగారు నాకు కూతురు తప్పకుండా విజయం సాధిస్తుం దనే నమ్మకం ఉందని దృఢంగా చెప్పేవారు.



## చదరంగం కదలికలు

గ్రాడ్యుయేషన్ సమయంలో కూడా నేను చెస్‌ను సమయం దొరికినప్పుడల్లా ఆడుతూనే ఉండేదాన్ని . అదే ఆసక్తితో ఆంధ్రాయూనివర్శిటీలో ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్స్‌లో పాల్గొనేదాన్ని. ఎమ్.సి.ఎడిగ్రీని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్శిటీ అనంతపూర్ నుంచి పొందాను.

నా అంతర్జాతీయ కెరియర్‌ని 2013లో జరిగిన శ్రీలంక ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో మొదలుపెట్టాను. ఆ పోటీలో నేను వుమెన్స్ ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకున్నాను. ఈ పోటీల తర్వాత నా మనసు, మెదడు చెస్ ఆటకే అంకితమయ్యాయి. ఆ తరువాత కాలంలో ఐదు సంవత్సరాలు వరుసగా వరల్డ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్, 2014సం.లో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో యోగేష్ గౌతమ్‌తో కలిసి ఆడి మొదటి స్థానాన్ని దక్కించుకున్నాను. 2015సం.లో గ్రీస్‌లో జరిగిన ప్రపంచ మహిళల (ఔత్సాహిక) ఛాంపియన్‌షిప్‌లో రజతపతకాన్ని గెలుచుకున్నాను. 2016లో ఇరాన్‌లో జరిగిన ఆసియన్ మహిళల (ఔత్సాహిక) ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించాను. గత సంవత్సరం జాతీయ మహిళల (ఔత్సాహిక) ఛాంపియన్‌షిప్ పోటీలు థాయ్‌లాండ్‌లో జరిగినప్పుడు అందులో మొదటి స్థానాన్ని దక్కించుకున్నాను. 2017లో జరిగిన ఆసియన్ మహిళల టోర్నమెంట్ చాలా కష్టసాధ్యమైనది. ఫిలిప్పిన్‌కి చెందిన క్యూజాన్ లోరేషీల్‌కి నాకు మధ్య పోటీ చాలా రసవత్తరంగా జరిగింది. రెండవరౌండ్‌లో 7.5 పాయింట్లతో విజయం సాధించాను. మూడవరౌండ్‌లో 7.5 పాయింట్ల సంపాదించాను. మేమిద్దరం ఒకే స్కోరు సాధించడంతో మరొకపద్ధతైన బచోలోజ్ విధానంలో నన్ను రెండవస్థానానికి ఎంపికచేశారు.

నాకు శిక్షణనిచ్చినది రఘునందన్ గోఖలే. మా కోచ్ నా ప్రతి ఆటకు తప్పకుండా వచ్చేవారు. టోర్నమెంట్‌కి ముందు ఆయన నాకు క్లాస్ తీసుకునేవారు. రోజుకి ఏడెనిమిది గంటలు ప్రాక్టీసు చేయమని పదేపదే చెప్పే వారు. ఆన్‌లైన్‌లో ఎవరైనా ప్రత్యర్థి ఆడడానికి సిద్ధంగా ఉంటే నాచేత ఆడించేవారు. వాళ్లు ఆడే విధానాల ద్వారా నేను మెలకువలు నేర్చుకోవాలన్నదే ఆయన ఆలోచన. ప్రొఫెషనల్ చెస్ ఆటగాళ్లకు ఈ ఆట ఎంతో లాభదాయకమైనది. కాని నేను ఆవిధమైన మార్గంలోకి వెళ్లాలనుకోవటం లేదు. నాకు వచ్చిన పబ్లిసిటీతో డబ్బు సంపాదించే ఉద్యోగంలో చేరాలని నేను అనుకోవడం లేదు. నా లక్ష్యం ఉమెన్స్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్‌ను సంపాదించడమే. అది సాధించి నప్పుడే నా ఆట నాకు లాభదాయకమైంది. మా అమ్మానాన్నల కోరిక నెరవేరేది.

## చెస్‌లో నేను నేర్చుకున్న అంశాలు...

చెస్ ఆటలో ముందుగా మనం గమనిం చాల్సినవి మూడు లేదా నాలుగు విధానాలుంటాయి. వాటినే ప్రత్యర్థులు అవలంబిస్తారు. వాటిని గమనించి నిజజీవితంలో కూడా అవలంబించవచ్చు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు నేనెప్పుడు మూడు లేదా నాలుగు పరిష్కారాలను వెతుకుతూ ఉంటాను. దానిలో ఏది నన్ను మానసికంగా బలంగా చేయగలదో గమనించుకుని దానిని అనుసరిస్తాను. అలా తీసుకున్న నిర్ణయం నన్ను మానసికంగా, శారీరకంగా దృఢంగా చేస్తుంది. మెక్సికోలో జరిగే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో గెలుపొందాలన్నదే నా లక్ష్యం.

---

# దక్షిణ ధ్రువం ఆమెకు పాదాక్రాంతం!

**మహిళలు తమ లక్ష్య సాధనలో చాలా ఉత్సాహంగా ముందంజ వేస్తున్నారు. ఒక లక్ష్యాన్ని చేరుకోగానే సంతృప్తి చెంది అక్కడితో ఆగిపోవడం లేదు. తరువాత లక్ష్యమేమిటనేది ఆలోచించి ఆ దిశగా అడుగులు సాగిస్తున్నారు. అలాంటి కోవకి చెందిన వారే ఐపిఎస్ అపర్ణాకుమార్. ఆమె ఇప్పటివరకు ఆరుఖండాల్లోని ఆరు పర్వత శిఖరాలను విజయవంతంగా అధిరోహించినా సంతృప్తి చెందలేదు. ఇంకా ఏదైనా సాధించాలనే తపన ఆమెలో మరింత ఎక్కువైంది. ఆ తపనతోనే దక్షిణ ధ్రువం చేరాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకుని విజయవంతంగా చేరుకుని దక్షిణ ధ్రువాన్ని చేరుకున్న మొట్టమొదటి ఐపిఎస్ మహిళగా రికార్డు సృష్టించింది. ఆవివరాలు మీకోసం...**

**మ**హిళలు తమకు అడ్డుగా ఉన్న గోడలను తెంచుకుని సరికొత్త విజయాలను, సంచలనాలను సృష్టిస్తున్నారు. ఒకే రంగంలో కాకుండా భిన్నరంగాల్లో తమ



ప్రత్యేకం

ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారు. ఈ సంవత్సరం లెఫ్టినెంట్ భావనా కస్తూరి పురుషులకే ప్రాధాన్యత ఉన్న ఎఎస్‌సి కాంటింజెంట్ కేటగిరీలో నాయకురాలిగా నియామకమైంది. ఆర్మీదినోత్సవాల్లో ఈ సంతోషాలను వారందరూ జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం జనవరి 15వతేదీన ఈ వేడుకలను జరుపుకుంటారు. రిపబ్లిక్‌డే సంబరాలంత ఘనంగా వీటినీ జరుపుకుంటారు.

కెప్టెన్ శిఖా సురభి ఇప్పటివరకు ఎన్నో సున్నితమైన స్టంట్స్ చాకచక్యంతో చేసి ప్రపంచ రికార్డులను సృష్టించింది. ఈ సంవత్సరం మొట్టమొదటిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని చరిత్ర సృష్టించనున్నారు.

అదేవిధంగా అపర్ణాకుమార్ దక్షిణ ధ్రువం మీద అడుగుపెట్టిన మొట్టమొదటి మహిళ ఐపిఎస్‌గా రికార్డు సృష్టించారు. ఆమె ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) డిజీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ బోర్డర్‌లో పనిచేస్తూ దక్షిణ ధ్రువంపై కాలుమోపిన మొట్టమొదటి ఐపిఎస్ అధికారిణిగా ఆమె పేరు సంపాదించుకున్నారు. భుజాలమీద 35 కిలోగ్రాముల బరువును మోస్తూ పూర్తిగా మంచుతో కప్పివున్న ప్రాంతంలో దాదాపు 111 కిలోమీటర్లు నడిచింది. ఆమె ఈ దక్షిణ ధ్రువాన్ని చేరుకోవటం మొదటి అచీవ్‌మెంట్ కాదు. ఇప్పటివరకు ఆరు ఖండాల్లో ఉన్న ఆరు పర్వతాలను అతి సునాయాసంగా అధిరోహించింది. ఆమె బెంగళూరుకి చెందినది. ఇద్దరు పిల్లలు. ఎవరెస్ట్ పర్వతాన్ని 2016సం.లో అధిరోహించిన పోలీస్‌మహిళగా రికార్డు సృష్టించింది. ఆమె జనవరి 13వతేదీన జాతీయజెండాతో దక్షిణ ధ్రువాన్ని చేరుకుంది. పోలీసు అసోసియేషన్ ఆమె చేసిన ఈ సాహసంలో తమ వంతు సాయాన్ని అందజేసింది.

భారతదేశంలోని ప్రజలు, ఐటిబిపి అధికారులు ఆమె సాధించిన విజయానికి ప్రశంసలు అందజేశారు. కేంద్ర హోంమినిస్టర్ రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ప్రశంసలు అందజేశారు. ఉత్తర్‌ప్రదేశ్ కేడర్ ఐపిఎస్ అధికారిగా ఆమె 2002సం.బ్యాచ్‌లో ఎంపికైంది. ఆమెను డెహ్రాడూన్‌లో ఉన్న ఐటిబిపి నార్తరన్ ఫ్రంటైర్ హెడ్‌క్వార్టర్స్‌లో బాధ్యతలు నిర్వహించమని నియమించారు. ఐటిబిపి ఆధ్వర్యంలో ఇప్పటివరకు 211 విజయవంతమైన పర్వతారోహణలు నమోదైనట్లు నివేదికలో తేలింది. మహిళలే కాదు చాలామంది ప్రజలు ఈ కాలంలో పర్వతారోహణకు సిద్ధమవుతారు. ఆ ప్రయాణంలో ఎంతో ఆనందాన్ని పొందు తున్నారు. ఎవరి గైడెన్స్ లేకుండా దక్షిణ ప్రాంతంతో ముఖ్యఖండమైన అంటార్కిటికాను ఒంటరిగా ఈమధ్యనే 33సంవత్సరాల కోలిన్ ఓ బ్రాడీ అధిరోహించి పేరు తెచ్చుకున్నారు. ఆమె తన గమ్యం 1600కిలోమీటర్ల దూరాన్ని 54రోజులలో పూర్తిచేశారు. ఆమె సాధించిన విజయాన్ని గుర్తించిన ఐటిబిపి అధికారులు ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో శనివారం నాడు ఘనస్వాగతం పలికారు. మహిళలందరూ ఎంతో ఆనందాలతో ఆమెకు ఆహ్వానం పలికారు.

# ఇసుకాసురులపై వీడియో అస్త్రం

## 17 ఏళ్ల బాలిక సాహసం

**ఈ తరం యువతీయువకులంటే నిరంతరం సెల్ ఫోన్‌లో వీడియోలు, టిక్‌టాక్స్, జోక్స్ వంటివి చూసి ఆనందించేవారేనని అనుకుంటాం. కాని ఆ అమ్మాయి అలాంటి సరదాలవైపు ఆసక్తి చూపి తన సమయాన్ని వృథా చేసుకోకుండా తన గ్రామంలో జరుగుతున్న అక్రమ ఇసుక మైనింగ్‌ను వీడియోలో చిత్రీకరించి వాట్సప్‌లో అప్‌లోడ్ చేసింది. ఆ వీడియో ఇప్పుడు సంచలనం అయ్యింది. ఆ వీడియో ఏమిటి. అక్కడ జరిగే అక్రమ కార్యకలాపాలేమిటో తెలుసుకుందాం.**





చైతన్యం

**కా**వ్య పన్నెండవ తరగతి చదువుతుంది. వారిది కేరళ లోని కొల్లామ్ జిల్లాలోని తీరగ్రామమైన అలప్పడ్. ఈకాలంలో పిల్లలు ఎక్కువగా టిక్‌టాక్స్, ఫన్నీ జోక్స్‌తో వీడియోలను పెడుతున్నారు. కాని కావ్య పెట్టిన వీడియో మామూలైనది కాదు. దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో ఇసుక మాఫియా జరుగుతుంది. దానిని అరికట్ట డానికి ఉద్యమం కూడా జరుగుతుంది. అక్రమ ఇసుక మైనింగ్ వల్ల పర్యావరణానికి ఎంతో నష్టం కలిగి తద్వారా మానవ మనుగడకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కావ్య గ్రహించింది. మూడు వారాల క్రితం ఒక వీడియోను రికార్డు చేసి తన అక్కకు, వాళ్ల స్నేహితురాళ్లకు వాట్సప్‌లో పంపించింది. కావ్యది చిన్న వయసైన ఆమె రికార్డు చేసిన వీడియో సంచలనం సృష్టిస్తుందని, అక్కడి ప్రజలలో చైతన్యాన్ని కలిగిస్తుందని ఆలోచించింది. ఈ వీడియోని చూసి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆ ప్రాంతంలో ఇన్వెస్టిగేషన్ చేసి ఆ పనులను సత్వరమే నిలిపేలా చేయాలని కోరుకుంది. ఆమె తీసిన వీడియోలో మైనింగ్ జరుగుతున్న ప్రాంతంలోని ప్రజల భయాన్ని తన మాటల ద్వారా వ్యక్తం చేసింది.

మన కాళ్లకింద భూమి రోజురోజుకీ క్షీణించిపోతుండడం చాలా బాధాకరం. ప్రస్తుతం ఈ మైనింగ్ పనులు అలప్పడ్‌కి ఉత్తరదిశలో కొనసాగుతున్నాయి. ఏరోజు తన ఇంటిముందు తవ్వడానికి జెసిబి వస్తుందోననే ఆందోళనతో అలప్పడ్ గ్రామ ప్రజలు జీవిస్తున్నారు. ఈ తవ్వకాల వల్ల భూకంపాలు వచ్చే అవకాశమెక్కువగా ఉందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. అలప్పడ్, అలప్పూజా, కొల్లాం, కేరళలో ఎక్కువగా నల్లఇసుక లభ్యమవుతుంది. ఈ ఇసుకలో ఎక్కువగా ఇల్మినైట్, జిర్‌కాన్, మోనోజైట్, రుటైల్ వంటి ఖనిజాలు లభ్యమవుతాయి. అలప్పడ్ సముద్రానికి, నేషనల్ వాటర్‌వేకి మధ్యలో ఉంది. ఈవిధంగా మైనింగ్ జరిగితే తీర ప్రాంతం కోతకు గురయ్యే అవకాశాలెక్కువ. 2004సం.లో సంభవించిన సునామీ వల్ల 143మంది ప్రజలు తమ నివాసాలను కోల్పోయారు. ఈ మైనింగ్ వల్ల బెస్తవారి నివాసాలకు కూడా నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని కావ్య తన వీడియోలో

ప్రతిరోజూ రెండు ప్రభుత్వరంగ సంస్థలు అక్కడ ఈ చర్యలకు పాల్పడుతున్నాయి. ఆమె వీడియో అప్‌లోడ్ చేసిన చాలా తక్కువ సమయంలోనే దానిమీద అక్కడి ప్రజలు స్పందించడం మొదలుపెట్టారు. ఆ వీడియో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు ప్రేరణగా నిలిచింది. ప్రజలే కాకుండా మలయాళం నటీనటులు టొవినో థామస్, పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా తమ మద్దతును తెలియజేశారు.

తెలియజేసింది. ఈ వీడియోని ప్రామాణికంగా తీసుకుని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ మొదలుపెట్టింది. న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ఆ బెంచ్‌కి జడ్జిగా ఆదర్శ్‌కుమార్ గోయెల్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకనెలలోపుల అక్కడ జరిగే అక్రమ కార్యకలాపాల పూర్తి వివరాలను కొల్లామ్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ ముందు ఉంచాలని ఆర్డరు వేశారు. దీని మీద తదుపరి విచారణ మార్చి 29కి ఉంది.

''ఈ వీడియోలో మా ఊరి ప్రజల భయాందోళనలను అందరికీ తెలిసేలా వ్యక్తపరిచాను. ఇది ఓట్ల కోసం ఇచ్చే రాజకీయ ప్రసంగం కాదు. నాకున్న పరిధులలో నేను ఈ విషయాన్ని మీకందరికీ తెలియజేయగలుగుతున్నందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది. నా వీడియోని చూసి ఈ ఉద్యమానికి మద్దతును అందజేస్తున్న కేరళ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను'' అని కావ్య ఆనందంగా చెబుతుంది.

వీడియో అప్‌లోడ్ చేయడంతోనే తన బాధ్యత తీరి పోయిందని అనుకోలేదామె. స్కూల్ అయిపోయిన వెంటనే తన గ్రామంలో జరిగే అక్రమ ఇసుక మైనింగ్ పోరాటంలో పాల్గొంటుంది. సోషల్‌మీడియా వేదిక మీద సరైన సమస్యను వెలుగులోకి తీసుకురావడంలో ఆమె విజయం సాధించింది. చిన్నవయసులోనే తన ప్రతిభతో పెద్దసమస్య పరిష్కారం కోసం పోరాడుతున్న కావ్య నేటి యువతకు ఆదర్శం.


మెహ్రీన్

# రెండు సినిమాలకు కసరత్తు


నాగార్జున

రెండు విభిన్నమైన కథాచిత్రాలలో నటించేందుకు నాగార్జున సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. రాజుగారిగది-2, ఆఫీసర్, దేవదాస్ చిత్రాలు బాక్సాఫీసు వద్ద అంచనాలకు చేరువకాలేకపోవడంతో నూతనంగా తాను చేయబోయే చిత్రాల స్క్రిప్టు విషయంలో ఆయన ఆచితూచి అడుగులేస్తున్నారు. చాలాకాలంగా వినిపిస్తున్నట్లుగా బంగార్రాజు టైటిల్ పాత్రలో ఆయన నటించబోయే చిత్రాన్ని సెట్స్‌పైకి తెచ్చేందుకు తెరవెనుక సన్నాహాలు జరుగుతున్నాయని అంటున్నారు. మూడేళ్ల క్రితం వచ్చిన సోగ్గాడే చిన్నినాయన చిత్రంలో బంగార్రాజు పాత్రలో నాగార్జున ఎలా అలరించారో తెలిసిందే. అప్పట్నుంచి దానికి ప్రీక్వెల్ చిత్రాన్ని నాగార్జున చేయబోతున్నట్లు వార్తలు వస్తుండేవి. మరోవైపు స్క్రిప్టు బాగా కుదిరితే చేసేందుకు తాను సిద్ధమే అంటూ నాగార్జున కూడా చెబుతుండేవారు. ఎట్టకేలకు స్క్రిప్టు ఓ కొలిక్కి రావడంతో ఈ చిత్రానికి రంగం సిద్ధమైందని, మార్చిలో షూటింగ్‌ను ప్రారంభిస్తారని పరిశ్రమలో వినిపిస్తోంది. సోగ్గాడే చిన్నినాయన చిత్రానికి దర్శకత్వం వహించిన కల్యాణ్‌కృష్ణ దీనికి దర్శకత్వం వహించనున్నారు. అన్నపూర్ణా స్టూడియోస్ పతాకంపై నాగార్జునే ఈ చిత్రాన్ని నిర్మిస్తారని, మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలుస్తాయని అంటున్నారు. ఇదిలావుం డగా...ఇంకోవైపు నాగార్జున వేరొక చిత్రాన్ని కూడా లైన్‌లో పెడుతున్నారు.. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నట్లు...ఆ చిత్రం స్క్రిప్టు పనుల్లో ఉన్నట్లు నాగార్జున పలు సందర్భాలలో చెప్పారు కూడా. గతంలో వచ్చిన మన్మధుడు చిత్రానికి సీక్వెల్‌గా మన్మధుడు-2 పేరుతో ఈ చిత్రం ఉంటుందని కూడా నాగ్ చెప్పుకొచ్చిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇటీవలే నాగార్జునకు మన్మధుడు-2 స్క్రిప్ట్‌ను రాహుల్ రవీంద్రన్ వినిపించారని, అది విన్న ఆయన వెంటనే ఓకే చెప్పాశారని పరిశ్రమలో వినిపిస్తోంది. బంగార్రాజు చిత్రంతో పాటు ఏకకాలంలో ఈ చిత్రం షూటింగ్ జరుగుతుందా? లేక కొంత గ్యాప్‌తో మొదలవుతాయా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సివుంది.



# అప్పట్లో నన్ను హౌస్ అరెస్ట్ చేశారు

**-ప్రియాప్రకాష్ వారియర్**

సోషల్ మీడియా వల్ల నేను బాగా పాపులర్ అయ్యాను. అయితే అదే మీడియాలో నామీద చాలా వదంతులు కూడా వచ్చాయి. అయితే వాటిల్లో ఎంతమాత్రం వాస్తవం లేదు అని ప్రియాప్రకాష్ వారియర్ చెప్పుకొచ్చారు. మలయాళంలో తాను నటించిన తొలి సినిమాలో ఒకేఒక కనుగీటుతో దేశవ్యాప్తంగా బోలెడంత పబ్లిసిటీ ఈ భామకు వచ్చేసింది. దాంతో తన మాతృభాష మలయాళంతో పాటు ఇతర భాషల సినీరంగాల్లో కూడా ఆమెకు అవకాశాలు రావడం మొదలుపెట్టాయి. మలయాళంలో ఆమె నటించిన ఒరు ఆడార్ లవ్ చిత్రం తెలుగులో లవర్స్ డే పేరుతో అనువాదమైంది. వచ్చే నెలలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ప్రియా వారియర్ హైదరాబాద్‌లోని పాత్రికేయులతో కొద్దిసేపు ముచ్చటించారు.

### ఆ వదంతులలో వాస్తవం లేదు

అప్పట్లో కన్నుగీటిన సన్నివేశం బాగా పాపులర్ కావడంతో ఒక్కసారిగా నాకు ఎంతో క్రేజ్ లభించింది. అయితే అదే సమయంలో నేను, నా కుటుంబం కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంది. ప్రేక్షకులు, అభిమానులు, మీడియా వాళ్లు భారీ ఎత్తున మా ఇంటికి వచ్చేవారు. ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిని చవిచూశాం. సాధారణ జనం సైతం మా ఇంటికి వద్దకు రావడంతో మా కుటుంబ సభ్యులు ఆ సమయంలో నన్ను బయటకు వెళ్లకుండా హౌస్ అరెస్ట్ చేశారు. మరోవైపు సోషల్‌మీడియా సంచలనంగా మారిన తర్వాత నన్ను బోర్డింగ్ స్కూల్‌లో పెట్టలేదు. నా గురించి అప్పట్లో వచ్చిన వదంతులన్నీ సత్యదూరమే. అయితే వాటిని నేనే కాదు నా కుటుంబ సభ్యులు పట్టించుకోలేదు. ధైర్యాన్ని కూడగట్టుకుని కుటుంబ సభ్యులు ఇచ్చిన వెన్నుదన్నుతో ముందుకు సాగాను. ఆ తర్వాత గాసిప్స్‌ను, నాపై వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోవడం మానేశాను.

### స్వచ్ఛమైన ప్రేమకథతో

స్కూల్ డేస్‌కు సంబంధించిన స్వచ్ఛమైన ప్రేమకథతో లవర్స్ డే చిత్రం తెరకెక్కింది. అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది. ప్రేక్షకులకు వారి బాల్య స్మృతులను గుర్తుకు తెస్తుంది. అలాగే యూత్‌కు మధురానుభూతిని పంచుతుంది. ఫ్యామిలీస్‌కు కూడా వినోదాన్ని అందిస్తుంది.

### అల్లు అర్జున్ చిత్రంలో అవకాశం

మలయాళంలో ఒరు ఆడార్ లవ్ (లవర్స్ డే) చిత్రం చిత్రీకరణలో ఉన్నప్పుడే తెలుగులో అల్లు అర్జున్ చిత్రంలో నటించే అవకాశం లభించింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆయన చిత్రంలో నటించలేక పోయాను. దానివల్ల చాలా బాధ అనిపించింది. తెలుగు సినీరంగం నుంచి అవకాశాలు చాలానే వస్తున్నాయి. ఇంకా వేటినీ అంగీకరించలేదు.

### నాకు నోటీసులు రాలేదు

శ్రీదేవి బంగ్లా చిత్రంలో నటించినందుకు నాకు ఎలాంటి నోటీసులు రాలేదు. బోనీకపూర్ నోటీసులు పంపారన్న అంశం గురించి నాకు ఏమీ తెలియదు. అది ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రం. అలాంటి చిత్రంలో నటించాలన్న జిజ్ఞాసతోనే నటించాను. ఇక ఆ చిత్రం కథ ఏమిటన్నది తెరపైనే చూడాల్సిందే అంటూ ముగించారు.

# చాలా కాలం తర్వాత హిట్టొచ్చింది

సినిమారంగంలో వరుస ఫ్లాపులు ఎదురైన వారికి ఐరెన్‌లెగ్ ముద్ర వేసేస్తుంటారు. ఒకసారి ఆ ముద్ర పడితే దాని నుంచి ఎప్పుడెప్పుడు బయటపడతావూ అని ఆర్టిస్టులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తుంటారు. మళ్లీ ఒక మంచి సక్సెస్ వస్తే...ఆ ముద్ర తుడిచిపెట్టుకునిపోయి...వారికి అవకాశాలపై అవకాశాలు రావడం చూస్తున్నదే. ఇందుకు భిన్నంగా ఏమీలేదు

మెహ్రీన్ కెరీర్. టాలీవుడ్‌లో పరిచయమైన తొలినాళ్ళలో విజయానికి మారుపేరుగా నిలిచి...కృష్ణగాడి వీరప్రేమగాథ, మహానుభావుడు, రాజా ది గ్రేట్ చిత్రాలతో అందరి దృష్టిని ఆకర్షించిన ఆమెకు ఆ తర్వాత కేరాఫ్ సూర్య, పంతం, జవాన్, నోటా, కవచం వంటి ఐదు చిత్రాలు నిరాశ పరిచాయి. ఈ నేపథ్యంలో తన కెరీర్ ఏమౌతుందోనని భయపడిన ఆమెకు ఇప్పుడు ఓ మంచి సూపర్‌డూపర్ హిట్ లభించింది. వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహ్రీన్ నాయకానాయికలుగా నటించిన ఎఫ్-2 చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై...భారీ విజయాన్ని సాధించింది. దీంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. గత కొద్దిరోజులుగా కెరీర్ పట్ల ఆమెకు ఏర్పడిన టెన్షన్ ఒక్కసారిగా దూరమైందట. ఎఫ్-2లో ప్రేమికుడ్ని ఫ్రస్టేషన్‌కు గురిచేసే హనీ పాత్రలో ఆమె అద్భుతమైన అభినయం కనబరిచిందని పేరొచ్చింది.

# మళ్లీ మళ్లీ చూసే సినిమా



సాయిదేవ రామన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మళ్లీ మళ్లీ చూశా'. కొణిదెన కోటేశ్వరరావు నిర్మాత. అనురాగ్ కొణిదెన హీరోగా పరిచయం అవుతున్నారు. శ్వేత అవస్తి, కైరవి తక్కర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ''టీజర్ చాలా కొత్తగా ఉందని, కంటెంట్ యువతకు బాగా చేరువయ్యేలా ఉంది'' అని ఈ సందర్భంగా సురేష్ బాబు చెప్పారు. ''హీరోగా పరిచయం అవుతున్న అనురాగ్ మంచి భవిష్యత్తు ఉంటుందని'' అభినందించారు. చిత్ర దర్శకుడు సాయిదేవ రామన్ మాట్లాడుతూ ప్రకృతి సృష్టించిన ప్రేమకథ మా సినిమా అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ ''మా సినిమా కంటెంట్ నచ్చి టీజర్ విడుదల చేసిన డి.సురేష్‌బాబుగారికి ధన్యవాదాలు. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఆడియోను, సినిమాను విడుదల చేస్తాం'' అని తెలిపారు. ''కంటెంట్ ఓరియంటెడ్ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉందని చిత్ర కథానాయకుడు అనురాగ్ పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఈటీవీ ప్రభాకర్, టిఎన్ఆర్, మిర్చి కిరణ్, అప్పాజీ, బ్యాంక్ శీను, మధుమణి, పావని ప్రభావతి, జయలక్ష్మి తదితరులు నటిస్తున్నారు. సంగీతం శ్రవణ్ భరద్వాజ్, ఛాయాగ్రహణం సతీష్ ముత్యాల.

# ఎనిమిది దేశాల్లో...


కమల్ హాసన్

భారీ అంచనాల మధ్య కమల్‌హాసన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం ఇండియన్-2 (భారతీయుడు-2). ఎప్పుడో ఇరవై రెండేళ్ల క్రితం వచ్చిన భారతీయుడు చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం తెరకెక్కబో తోంది. అప్పట్లో కమల్‌హాసన్, శంకర్‌ల కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం మొదటి భాగం ప్రేక్షకులను ఎంతగా అలరించిం దో తెలియంది కాదు. నీతినిజాయితీలకు మారు పేరైన సేనాధిపతి అనే వృద్ధుడి పాత్రలో కమల్ ఒదిగిపోయిన విధానం ప్రేక్షకుల హృదయా లలో నిలిచిపోయింది. మళ్లీ అదే పాత్రను సీక్వెల్‌లో కొనసాగిస్తున్నారు. 2.ఓ. చిత్రాన్ని నిర్మించిన లైకా సంస్థ ఈ చిత్రాన్ని క ూడా నిర్మిస్తోంది. ఇటీవల రెగ్యులర్ షూటింగ్‌ను మొదలు పెట్టుకున్న ఈ చిత్రం చిత్రీకరణ తొలి షెడ్యూల్ చెన్నైలో జరుగుతోంది. ఇందులో భాగంగా సేనాధిపాత్రకు సంబంధించిన సన్నివేశాలను కమల్‌హాసన్‌పై ముందుగా చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి తొమ్మిది గంటలకు షూటింగ్ లొకేషన్‌కు రావాల్సిన కమల్ ఈ చిత్రంలోని పాత్ర కోసం ఉదయం 6 గంటలకే వచ్చేస్తున్నారట. మేకప్ కోసమే దాదాపు మూడు గంటలకు పైగా సమయాన్ని వెచ్చిస్తున్నారట. ఇంకో రెండు వారాలు చిత్రీకరణ చెన్నైలోనే జరుగుతుందని, ఆ తర్వాత చిత్రబృందం విదేశాలకు పయనమ వుతుందని అంటు న్నారు. ఎనిమిది దేశాల్లో చాలా రోజుల పాటు ఈ చిత్రం షూటింగ్ జరపాలని నిర్ణయించుకున్నారట. అందుకోసం చిత్రబృందం ఇప్పట్నుం చే ఏర్పాట్లకు సంబంధించిన కసరత్తు చేస్తోందని చెబుతు న్నారు. కాజల్ అగర్వాల్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని, రవివర్మన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు జాక్ గిల్, టాడో గ్రిఫిత్‌లు ఫైట్స్ కంపోజ్ చేస్తున్నారు. 2020 జనవరికి ఈ చిత్రాన్ని విడుదల చేయాలన్న సంకల్పంతో చిత్రబృందం ముందుకు సాగుతోంది.

# కొత్తగా సాగే ప్రేమ ప్రయాణం

**-ప్రియాంత్**

స్నేహానికి, సహ జీవనానికి మధ్య ఓ సన్న గీత ఉంటుంది. అదేమిటన్నది కొత్తగా మా ప్రయాణంలో చూడాల్సిందేనని హీరో ప్రియాంత్ వెల్లడించారు. ప్రియాంత్, యామిని



భాస్కర్ నాయకానాయికలుగా రమణ దర్శకత్వంలో నిశ్చయ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని పాత్రికేయులతో ప్రియాంత్ కొద్దిసేపు ముచ్చటించారు. ఆ వివరాలేంటో ఆయన మాటల్లో...ముక్కుసూటిగా ఉంటే ఎలాంటి చిక్కులు వస్తాయో అందరికీ తెలిసిందే. అలా ముక్కుసూటిగా ఉండే కుర్రాడు ఓ అమ్మాయి విషయంలోను ముక్కుసూటిగా ఉంటే ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయి? అన్న ప్రధానాంశంతో ఈ చిత్రం సాగుతుంది. ఇందులో ముక్కుసూటిగా ఉండే కార్తీక్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాత్రలో నటించాను. నెలకు రెండు లక్షల రూపాయలు సంపాదించే కుర్రాడి జీవన విధానానికి సంబంధించిన సినిమా ఇది. తనకు ఏదైనా కావాలనుకుంటే ఎట్టి పరిస్థితు ల్లో దానిన దక్కించుకో వాలనుకునే స్వభావం ఆ కుర్రాడికి ఉంటుంది. అలాగే నలుగురికి సాయపడే మనస్తత్వం కూడా అతనిది. ఓ అమ్మాయితో ఆ కుర్రాడు సూటిగా మాట్లాడిన తరువాత కథలో ఎలాంటి మలుపులు చోటుచేసుకున్నాయి అన్నది ఆసక్తికరంగా ఉంటుంది. నేటి సాఫ్ట్‌వేర్ కల్చర్‌లో ఎవరెలా ఉంటున్నారో వేరుగా చెప్పనక్కరలేదు. అలాగని సహజీవనానికి సంబంధించిన కథ కాదు. స్వేచ్ఛా జీవనానికి అలవాటు పడితే ఎలా ఉంటుంది? హాస్టల్స్‌లో ఉండే కుర్రాళ్ళ జీవితం ఎలా ఉందో చూపించాం. సినిమాలో గ్లామర్ అంశాలకు ప్రాధాన్యం ఉన్నా... హద్దుమీరిన రొమాన్స్ ఉండదు. చిత్రంలోని ఇతర ప్రధాన పాత్రల్లో బిగ్‌బాస్ ఫేమ్ భానుశ్రీ, ఈరోజుల్లో ఫేమ్ సాయి తదితరులు నటించారు అని తెలిపారు. ఇక తన వ్యక్తిగత వివరాలు గురించి ప్రియాంత్ తెలియజేస్తూ...ఓ ప్రముఖ బ్యాంక్‌లో ఉన్నతోద్యోగిగా పనిచేస్తున్న నాకు తొలినుంచి సినిమారంగంపై ఎనలేని ఆసక్తి ఉంది. చాలాకాలంగా హీరోగా నటించాలని ప్రయత్నిస్తూ వచ్చాను. ఈ చిత్రం రూపంలో అవకాశం లభించింది అన్నారు.

# దొంగదొరికితేనే పెళ్లి!

పగటి కలలు ఎక్కువ కంటున్నాడని కంపెనీలో ఉద్యోగం పోగొట్టుకున్నాడు సాయి. ఏదో విధంగా పెళ్లి చేసుకుందామని అనుకుంటే ఓ సమస్య ఎదురవుతుంది. కేవలం మూడు రోజుల్లో ఓ దొంగను పట్టుకుంటేనే పెళ్లి జరుగుతుంది. అలాంటి సందర్భంలో తన స్నేహితుడు జానీతో కలిసి దొంగను పట్టుకునేందుకు సాయి బయలుదేరుతాడు. ఈ ప్రయాణంలో వీరికి ఎదురైన అనుభవాలే 'మిఠాయి' సినిమా అని అంటున్నారు చిత్ర దర్శకుడు ప్రశాంత్ కుమార్. రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి ప్రధాన పాత్రధాలుగా ఈ సినిమా తెరకెక్కుతోంది. డా.ప్రభాత్ కుమార్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 22న సినిమాను విడుదల చేస్తారు. మగళవారం ఈ చిత్రం టీజర్ విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ ''ఇద్దరు స్నేహితుల మధ్య నడిచే కథతో తీస్తున్నాం. వినోదానికి ప్రాధాన్యత ఉంది. సాయిగా రాహుల్ రామకృష్ణ నటిస్తున్నాడు'' అని చెప్పారు. ఇతర పాత్రల్లో కమల్ కామరాజు, భూషణ్ కల్యాణ్, రవివర్మ, అజయ్ ఘోష్, అర్ష, శ్వేతా వర్మ, అదితి మ్యాకల్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రవివర్మన్ నీలమేఘం, సంగీతం: వివేక్ సాగర్.


రాహుల్ రామకృష్ణ ప్రియదర్శి

# రౌడీభాయ్...వస్తున్నాడు



'రౌడీభాయ్' సినిమా ఫస్ట్ లుక్‌ను మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆవిష్కరించారు. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న రామ సత్యనారాయణ మాట్లాడుతూ ''మానస్, పిప్ర కౌర్, స్మైల్ శ్రీను, సంగా ప్రధాన తారాగణం. చిత్రీకరణ పూర్తిచేశాం. త్వరలో నిర్మాణానంతర పనులు పూర్తిచేస్తాం. భీమవరం టాకీస్ పతాకంపై నిర్మించాం. ఈ చిత్రానికి ఉదయ్ దర్శకత్వం వహిస్తున్నారు. సంగీతం అర్జున్, ఛాయాగ్రహణం భాస్కర్ అందిస్తున్నారు'' అని చెప్పారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు ధృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
☞ ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకొండి
08943212076